




మనవర్కర్


కార్మికుల మాసపత్రిక

సంపుటి : 2	సంచిక : 2	ఫిబ్రవరి 2015	మాసపత్రిక	వెల: రూ.7/-	హైదరాబాద్
Volume : 2	Issue : 2	February 2015	Monthly	Price : Rs. 7/-	Hyderabad





ఉద్యమానికై మాతృత్వాన్ని త్యాగం చేసిన మాతృమూర్తి



కమలమ్మతో రెండు గంటలు గడిపాం. ఆనాడు జరిగిన నైజాం దౌర్జన్యాలు, జమీందార్ల, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీ, ప్రజల తిరుగుబాటు, సాయుధ పోరాటం, ప్రజలు చేసిన అశేష త్యాగాలు వారి మాటల్లో చెబుతుంటే ఆ పోరాటం కళ్ళముందే జరిగినట్లు ఒకదాని వెనుక ఒకటి తెరలు తెరలుగా దృశ్యమానమయ్యాయి. ఒక్కొక్కరి జీవితం ఇంకొకరి త్యాగంతో పోల్చలేకున్నా, ఒక చారిత్రక దశలో వారు తీసుకున్న నిర్ణయాలు, ఎర్రజెండా కోసం నిలబడ్డ తీరు వారిని అసామాన్యులుగా చేస్తుంది. కమలమ్మ ఒక సామాన్య స్త్రీగా కమ్యూనిస్టు దళాల్లో కొచ్చి పార్టీ ఇచ్చిన జ్ఞానంతో ఒకానొక సందర్భంలో ఆమె తీసుకున్న నిర్ణయం నన్ను విపరీతంగా కదలించి వేసింది. ఆ సంఘటన, ఆమె తేజోవంతమైన జీవితం నా మదిలో పదే పదే జ్ఞాపకం వస్తూనే ఉంది.

ఉద్యమం జరుగుతున్నప్పుడు కమలమ్మ వయస్సు 18 ఏళ్లు. ఎనిమిదినెలల బాబు. భర్త దళాల్లోకి పోయిండి. భర్తతోనే జీవితమన్న భావజాలం కావచ్చు... బయట రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడాలన్న ఆకాంక్షే కావచ్చు... పిల్లవాడు చిన్నవాడైనా త్యాగానికి సరిహద్దులు ఉండాల్సిన అవసరం లేదని దళాల్లోకి వచ్చింది. దళాల్లో వైజ్ఞానిక రంగంలో అంటే నర్సుగా దెబ్బలు తాకినప్పుడు కట్లు కట్టడం, సూదులు ఇవ్వడం, జనాలను చైతన్యం చేయడానికి పాటలు పాడటం చేసింది. ఒక చోట క్లాసులు జరుగుతున్నప్పుడు పిల్లవాడు ఏడ్వడం మొదలేసిందు. ఎంతకూ ఏడవడం ఆపడం లేదు. పిల్లవాడు అక్కడే ఉంటే కష్టమని కమలమ్మ ఆ బిడ్డను సాదుకొమ్మని ఆడబిడ్డ వద్దకు పంపింది. నైజాం లొంగిపోయాక యూనియన్ సైన్యాలు వచ్చాయి. దాడి తీవ్రమైంది. పిల్లవాడిని పంపేసినా పాలు తాగే వయసు కనుక మాతృత్వ మమకారం నిరంతరం మెలిపెట్టేది. ఈ రెండేళ్లలో వాడిని చూడాలని అనుకున్నా, నిర్బంధంలో చూడటం సాధ్యం కాలేదు. ఈలోపే ఇంకొక బాబు పుట్టాడు. అడవిలోనే ఆరు నెలలు సాదుకుంది. పిల్లోడిని ఎత్తుకొనే అనేక పనులు చేసేది.

పోరాటం విస్తృతమైంది. యూనియన్ సైన్యం దాడులు పెరిగిపోయాయి. దళాల ఉనికే ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో ఏరియా కమిటీ నాయకులుగా ఉన్న మద్దికాయల ఓంకార్, కొండేటి వాసుదేవరావు, తిరుమలరావు ఈ పిల్లవాడు దళాల్లో ఉండటం వలన ఏడిస్తే శత్రువుకు చిక్కే ప్రమాదం ఉంది. పిల్లవాడే. కావాలనుకుంటే దళాలను వీడి బయట ప్రపంచంలోకి వెళ్ళి పొమ్మని, దళాల్లో ఉండాలనుకుంటే పిల్లవాడిని ఎవరికన్నా ఇచ్చేయమని చెప్పారు. కమలమ్మ ముందు రెండే ప్రశ్నలు. ఒకటి మాతృత్వాన్ని త్యాగం చేయాలా? రెండు ఉద్యమాన్ని వదిలేయాలా? మాతృ ప్రేమ కావాలనుకుంటే మంచి తల్లి అవుతుంది. ఉద్యమమే కావాలనుకుంటే ఊరందరి తల్లి అవుతుంది. కమలమ్మ ఊరందరి తల్లి కావడానికే నిశ్చయించుకుంది. తెలిసిన వారికి ఇవ్వడానికి, బయటకు పోయే పరిస్థితి లేదు. అడవిలో ఉన్న కోయ వారిని కలిసి పిల్లోడిని సాదుకొమ్మని అడిగింది. పిల్లోడు ఎర్రగా ఉన్నాడు. మా కోయెల్లలో కలిసినట్లు ఉండదు. కనుక మాపై పోలీసులు దాడులు పెరగవచ్చు. అదీగాక దళ సభ్యురాలి పిల్లవాడని తెలిస్తే, ఈ ఏరియా దళాలకే ప్రమాదమని వారు వద్దన్నారు.

మెడలో ఒక కాగితం రాసి అందులో 'పిల్లవాడిని సాదలేక పోతున్నాను. దయ గల్లవారు సాదుకొమ్మని' పట్టుకొని పోయింది. బాగ్గుట్ట ఏరియాలో ఒకరు కలిసి తీసుకెళ్ళి పోయారు. పిల్లవాడిని ఇవ్వడమంటే.. పిల్లవాడిని వదిలేయడమంటే... వదిలేసిన పిల్లోడిని దారినపోయే ఒక మనిషి తీసుకుపోతుంటే చూడటమంటే ఏ తల్లికైనా సాధ్యమేనా? తొమ్మిది నెలలు మోసి పేగు తెంచుకుని పుట్టిన తన రక్తం గుబ్బును ఇవ్వడం... తన మాతృత్వాన్ని ఇవ్వడం... తన చేతుల్లో పెరిగి, చనుపాలు తాగి శరీరంలో భాగమైన ఒక పసితనాన్ని ఇవ్వడం... తెలిసిన ముఖం అవుపడగానే బోసి నోట నవ్వే ఆ పసితనపు ఛాయలను ఇవ్వడం వెన్నెలంత మూటకట్టుకొని తుపాకులతో ఆడుకొని మురిపించిన తన చిన్నారి అనుభూతులను ఇవ్వడం! పిల్లోడిని ఇచ్చింది డబ్బు కోసం కాదు... ఉద్యమం కోసం... తనునమ్మిన సిద్ధాంతం కోసం... తను ఎత్తుకున్న ఎర్రజెండా కోసం... తననే నమ్మిన కష్టజీవుల కోసం!! ఈ నిర్ణయం తీసుకునే క్రమంలో తన భర్తకు చెప్పే పరిస్థితి లేదు. అతడు వేరే దళంలో ఉన్నాడు. ఒంటరిగా ఆ నిర్ణయం తీసుకున్న చైతన్యం కమలమ్మది.

ఇంతవరకే త్యాగమైతే కొంత వరకే చెప్పుకుంటాం. కాని ఇంతకు మించిన మహోన్నతమైన విలువలకు కట్టుబడింది ఆమె నేటి వరకు. సాయుధ పోరాటం విరమించుకున్నాక పిల్లవాడిని ఏ ఏరియాలో ఇచ్చి వచ్చారో తెలుసు కనుక, ఈవిడతో ఆ రాత్రి నడిచి వచ్చిన కామ్రేడ్‌కు తీసుకుపోయిన మనిషీ తెలిసే అవకాశం ఉందని... కొద్దిగా కష్టపడితే పిల్లవాడిని దొరక పట్టవచ్చని అందరూ చెప్పినా కమలమ్మ, ఆవిడ భర్త అప్పన్న (చివరి వరకు కమ్యూనిస్టు ఉద్యమంలో ఉండి ఈ మధ్యనే చనిపోయారు) అలాంటి ప్రయత్నాలు వద్దన్నారు. గుండె దిటవు చేసుకొని ఇద్దరూ ఒక నిర్ణయానికొచ్చారు. ఒకవేళ పిల్లవాడు దొరికితే తీసుకొని వస్తే, పిల్లవాడిని కోల్పోయిన తల్లిగా నేనంత ఏడ్చానో, సాదుకొన్న తల్లికీ అంతే బాధ ఉంటుందని వద్దన్నది. పిల్లవాడిని తీసుకొని వస్తే, ఇద్దరు తల్లులు ఉండనీయని ఇతరులు చెప్పినా, ఒకవేళ అసలు తల్లి నేనని తెలిస్తే, ఆ పిల్లవాడు సాదిన తల్లిని మరిచిపోతే అట్లైనా ఆ తల్లికి గుండె కోతని... పిల్లవాడిని దేవులాడటం వద్దని నిర్ణయించుకున్నారు. ఆ తల్లి బిడ్డల మమకారం మధ్యన తను ఒక సమస్యగా మారకూడదని నేటికీ దాదాపు 66 ఏళ్ళు నుండి ఆ జ్ఞాపకాల్లో కదలాడుతూ... కదిలిస్తే కళ్ళల్లో కారే కన్నీటిని తుడ్చుకుంటూ!

ఏ ఉద్యమం కోసం ఆ తల్లి మాతృత్వాన్ని చంపుకొని ఊరంతా బిడ్డలనుకుందో, మిగిలిన ఈ జీవిత చరమాంకంలో తను నమ్మిన ఎర్రజెండాను అభిమానించే అందరూ "అమ్మా - మేమంతా నీ బిడ్డలమే కదమ్మా. నీవు పట్టి నడిచిన ఆ ఎర్ర జెండాను మేము ఎత్తుకొని నీ అడుగుజాడల్లోనే నడుస్తున్నామని గొంతెత్తి చెప్పాలి ఉంది". వీలు చేసుకొని ఒక్కసారన్నా అమ్మతో మాట్లాడండి.... అమ్మ జ్ఞాపకాల్లో మునిగి తేలండి! చేతిలో చెయ్యేసి ఆ తీపి అనుభూతుల్లో అమ్మ తనాన్ని ఆవిష్కరించండి!!

-స్ఫూర్తి

ఫిబ్రవరి - 2015

మనవర్కర్

[illegible]

సంపుటి : 02 సంచిక : 02

విడి ప్రతి వెల : రూ. 7

సం॥ చందా : రూ. 75

విషయ సూచిక

మేనేజర్
మనవర్కర్
ఇ.నం.1-7-139/44, ఎస్.వి.బి.స్మారక కేంద్రం,
ఎస్.ఆర్.కె.నగర్, రిసాలగడ్డ, జమీస్తాన్‌పూర్,
ముషీరాబాద్, హైదరాబాద్-20.
ఫోన్ : 27612474,
ఫ్యాక్స్ : 27646565

Printer, Publisher P Rajarao on behalf of CITU Telangana State Committee, Printed at Prajasakthi Daily Printing Press, Plot No 21/1, Azamabad, Industrial Area, Near RTC Kalyana Mandapam, Musheerabad, Hyderabad - 20 Published from CITU Office, 1-7-139/44, SRK Nagar, Zamistanpur, Hyderabad - 20. Editor Md Abbas

KRSA102M105

సంపాదకీయం

ఫిబ్రవరి 26న సత్యాగ్రహం




మోడీ ప్రభుత్వానికి కార్మికుల 'ఘోష' వినిపించడము లేదు. కన్పించడం లేదు. అధికార మత్తుతలకెక్కి తానేమి చేసినా అడిగేవారే లేరు అనే రీతిలో ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తున్నది. రెండవదశ ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలు చేయడానికి పూనుకుంటున్నది. మహారత్న, మినీరత్న వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తుల లాభాల దాహానికి బలిచేయడానికే మోడీ శర వేగంగా కృషి చేస్తున్నారు. కార్పొరేట్ సంస్థల లాభాలకు ఆటంకం కలిగిస్తాయని భావించిన చట్టాలన్నింటిని సవరిస్తున్నారు. కార్మిక చట్టాలను ఇప్పటికే కొన్నింటిని సవరించారు. ఇంకొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయి. పార్లమెంటులో చర్చించకుండానే ఆర్డినెన్స్‌లు తీసుకు వస్తున్నారు. భూసేకరణ చట్టాన్ని ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా సవరించారు. బొగ్గు రంగంలో 10 శాతం వాటాలను విక్రయించారు. బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు కేటాయించడాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించినప్పటికీ బొగ్గు గనులను కోల్ ఇండియాకు కేటాయించడకుండా 'ఇ' వేలం పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే మొగ్గు చూపుతున్నారు. రైల్వేలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) పెట్టడానికి అనుమతి ఇచ్చారు. రక్షణ లాంటి వ్యూహాత్మక రంగాలలో కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతులు ఇస్తున్నారు. కార్మిక వర్గంపై చట్టసవరణల ద్వారా దాడులకు దిగుతున్నది ప్రభుత్వం. ఈ నేపథ్యంలో డిసెంబర్ 5 కార్మికవర్గం దేశవ్యాపితంగా నిరసన తెలియజేసింది. అయినా ప్రభుత్వ తీరులో మార్పు కన్పించడం లేదు.

విడివిడిగా బ్యాంక్, ఇన్సూరెన్స్, కోల్, రైల్వే, రోడ్ ట్రాన్స్‌పోర్టు, రక్షణ, విద్యుత్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్లాంటేషన్ వర్కర్స్ ఇలా అనేకరంగాల కార్మికులు ఆందోళన చేస్తున్నారు. వీటన్నింటిని సమన్వయం చేసి దేశ వ్యాపితంగా పెద్దఎత్తున కార్మికులను సమీకరించి ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణ, కార్మిక హక్కుల రక్షణ, కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన అవసరముంది.

జాతీయ కార్మిక సంఘాలు ఐక్యంగా నిర్వహిస్తున్న కార్మిక ఐక్య ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళడానికే నిశ్చయించుకొన్నాయి.

ఫిబ్రవరి 26న దేశవ్యాపితంగా చట్టాలను ఉల్లంఘించి సత్యాగ్రహం నిర్వహించి నిరసన తెలియజేయాలని అప్పటికి ప్రభుత్వంలో కదలిక రాకుంటే దేశవ్యాపితంగా సమ్మెకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాయి.


మోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించడానికి ఫిబ్రవరి 26న జరిగే సత్యగ్రహంలో కార్మికులంతా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి సిఐటియు శ్రేణులు కార్మికవర్గాన్ని సమాయత్తం చేయాలి.



కార్టూనీయం

వివిధ పత్రికల సౌజన్యంతో





సంఘమే వద్దన్న యాజమాన్యంపై 'బంకా బయో' కార్మికుల విజయం

'నా దగ్గర పని లేదు. వెళ్ళిపోండి. మీ దిక్కున్నచోట చెప్పుకోండి. నా కంపెనీ నా యిష్టం" అంటూ ఓ ప్రైవేటు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తన సంస్థలో పనిచేసే కార్మికులతో పలికిన మాటలివి. ఈ మాటలు విన్న ప్రతి ఒక్కరిలో కార్మికులు ఏదో చేయకూడని పని చేసినట్లున్నారు. అందుకే ఎండీ ఈ రకంగా మాట్లాడినట్లు అనుకుంటారు. కానీ అక్కడ కార్మికులేం తప్పు చేయలేదు. తమ హక్కుల కోసం అడిగేందుకు ఓ కార్మిక సంఘాన్ని పెట్టుకున్నారు. అంతే యాజమాన్యానికి కోపమొచ్చింది. సంఘాన్ని కారణంగా చూపుతూ 16 మందిని సంస్థ నుంచి తొలగించింది. ఇది సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో చోటు చేసుకోవడం గమనార్హం. చర్లపల్లిలోనని ఫేజ్-3 ఏరియాలో బంకా బయో ప్రయివేటు లిమిటెడ్ సంస్థ రెండున్నరేళ్ల క్రితం ఏర్పడింది. ఆ సంస్థలో రైల్వే సెప్టిక్ ట్యాంకు బాక్సులు తయారు చేస్తున్నారు. 60 మంది కార్మికులు పనిచేస్తున్నారు. రెండున్నరేళ్లుగా ఆ కంపెనీలో ఎలాంటి సంఘములేదు. కార్మికులు జీతాలపై ప్రశ్నించే హక్కూ లేదు. కొందరు కార్మికులు ముందుకొచ్చి ఇటీవలే సిఐటియు లో చేరారు. ఈ నేపథ్యంలోనే సిఐటియు కార్మిక సంఘానికి అనుబంధంగా "బంకా బయో ఎంప్లాయీస్ యూనియన్"ను 16 మందితో ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని గతేడాది డిసెంబర్ 19న రిజిస్ట్రేషన్ (ఎ/డివైసిఎల్ / ఆర్ ఆర్/ 26/2014) కూడా చేసుకున్నారు. ఈ విషయం సంస్థ యాజమాన్యానికీ తెలుసు. సంఘం ప్రతినిధులంతా యాజమాన్యానికి పరిచయం కోసం వెళితే ప్రస్తుతం బిజీగా ఉన్నామని చెప్పి పంపారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 30న యాజమాన్యం తరపున ఓ సూపర్ వైజర్ వచ్చి "మీరు కంపెనీలో యూనియన్ ఏర్పాటు చేశారు. కాబట్టి కంపెనీ మూసివేస్తున్నాం. మిమ్మల్ని తీసివేస్తున్నాం" అని చెప్పి వెళ్ళిపోయారు. జనవరి 3న కంపెనీలో సంఘం ఆఫీస్ బేరర్స్‌తో పాటు కమిటీ సభ్యులుగా ఉన్న 16 మందిని టర్మినేషన్ చేస్తున్నట్లు ఇంటికి లెటర్లు పంపారు. ఆ లెటర్లలో 'సంస్థ నష్టాల్లో ఉంది. జనవరి 31 తర్వాత మీరు రావాల్సిన అవసరం లేదు' అంటూ పేర్కొన్నారు. మిగతా సభ్యులందర్నీ తొలగించగా ఇదే పేరుతో పక్కనే ఉన్న మరో సంస్థలోకి మార్చారు.

పోరాటానికి దిగిన కార్మికులు : సంస్థ నిర్ణయాన్ని నిరసిస్తూ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక శాఖను ఆశ్రయించారు. జనవరి 7న రంగారెడ్డి జిల్లా కార్మికశాఖ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జనవరి 10న కార్మికులతో ఏర్పాటు చేసే జాయింట్ మీటింగ్‌కు హాజరు కావాలని యాజమాన్యానికి అధికారులు నోటీసులు పంపారు. పలు కారణాలు చూపుతూ యాజమాన్యం కొంత గడువు కావాలని కోరింది. 'జనవరి 21 తప్పనిసరిగా రావాలి' అని యాజమాన్యాన్ని లేబర్ కమీషన్ ఆదేశించింది. కానీ యాజమాన్యం రాలేదు. జనవరి 29న జరిగిన జాయింట్ మీటింగ్‌లో కార్మికులను పనిలోకి తీసుకుంటామని యాజమాన్యం పేర్కొంది. 30, 31 తేదీల్లో కార్మికులు పనిలోకి పోయారు. ఫిబ్రవరి 1 నుంచి మీరు పనిలోకి రావాల్సిన అవసరం లేదని యాజమాన్యం కార్మికులకు తెలిపింది. దీంతో యాజమాన్యంపై కార్మికులు ఫిర్యాదు చేశారు. దీంతో కార్మికశాఖ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉల్లంఘించిన నేపథ్యంలో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనికి ఏడు రోజుల్లో సమాధానమివ్వాలని, జనవరి10న యూనియన్ నేతలను ఎందుకు తొలగించారో తప్పనిసరిగా సమాధానమివ్వాలని పేర్కొంది. మరోవైపు యాజమాన్య వైఖరికి నిరసనగా కార్మికులు సంస్థ బయట ఫిబ్రవరి 6నుంచి రిలే నిరాహార దీక్షలకు దిగారు. ఆందోళనకు దిగివచ్చిన యాజమాన్యం వర్కర్స్‌ను పనిలోకి తీసుకున్నది. ✤

పాఠకులకు విజ్ఞప్తి

'మనవర్కర్' పత్రిక మన పత్రిక. మన కార్మికుల పత్రిక. దీనిని నిర్వహించుకోవాల్సిన బాధ్యత మనదే. ఇందులో రాసే ప్రతి అక్షరం కార్మికులకు ఉపయోగపడేదే. కార్మికుల జీవితాలను ప్రతిబింబించేదే. అలాగే కార్మికులే దీని నిర్వాహకులు. మన జీవితాలే ఇందులో వ్యాసాలు, మనం గీసిన బొమ్మలే ఇందులో కార్టూన్లు, మన బాధలు - వ్యధలే కథలు, కవితలు. మన ఉద్యమాలు, అనుభవాలే ఉద్యమ వార్తలు, మన సమ్మె పోరాటాలే ఉత్తేజకర వార్తలు. మనకు కలిగే ఉద్వేగాలు, బాధలు "మనవర్కర్" ద్వారా కార్మికులందరితో పంచుకుందాం.... మనం చూడగానే మనల్ని కదిలించే సంఘటనలు రాయండి, మీ సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీయండి. మాకు పంపండి. వాటిని మనవర్కర్‌లో ప్రచురిద్దాం. కార్మికుల సమస్యలను, జీవితాలను ప్రపంచానికి తెలియజేద్దాం. రండి అక్షరాలతో మన ఆవేదనలు పంచుకుందాం.

మీరు విన్నవి, మీరు చూసినవి, మీ అనుభవాలు, కథలు, కవితలు, కార్టూన్లు, ఫోటోలు వెంటనే 'మనవర్కర్'కు పంపించండి. మీ ఫోటోతో సహా ముద్రిస్తాము.

\- ఎడిటర్

మనవర్కర్ ఇ-మెయిల్ ఐ.డి. : manaworker14@gmail.com; F/B : manaworker

తలనొప్పికి కొన్ని చిట్కాలు

తలనొప్పి సర్వసాధారణం. అన్ని వయసుల వాళ్ళు, వృత్తుల వాళ్ళు కూడా తలనొప్పితో తరచూ బాధపడుతుంటారు. తలనొప్పి తగ్గడానికి వాళ్ళు కొన్ని మాత్రలు వేసుకుంటారు. కానీ తలనొప్పికి ప్రతిసారీ మందులు వేసుకోవడం మంచిది కాదు. సాధారణ తలనొప్పులు చిన్నచిన్న చిట్కాలతో కూడా తగ్గిపోతాయి.

యూకలిప్టస్ తైలం

తలనొప్పి తగ్గించుకోవడానికి మరో మార్గం తలకు యూకలిప్టస్ తైలంతో మర్దన చేయడం వల్ల తక్షణం నొప్పి తగ్గుతుంది. ఎందుకంటే యూకలిప్టస్ మంచి నొప్పి నివారిణి.

తాజా నిమ్మరసం

ఒక గ్లాసుడు గోరువెచ్చటి నీళ్లు తీసుకొని దాంట్లో కొంచెం నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమం తాగడం వల్ల నొప్పి తీవ్రత తగ్గుతుంది. ఈ చిట్కా చాలా తలనొప్పులకు పనిచేస్తుంది. ఎందుకంటే తలనొప్పులు చాలా వరకు కడుపులో గ్యాస్ చేరడం వల్ల వస్తాయి. ఈ మిశ్రమం కడుపులోని గ్యాస్‌ను, తలనొప్పిని కూడా తగ్గిస్తుంది.

గోరువెచ్చని పాలు


ఆవు పాలు వెచ్చబెట్టి తాగితే తలనొప్పి తగ్గుతుంది. తరచుగా తలనొప్పి వస్తుంటే భోజనంలో నెయ్యి చేర్చుకుంటే మంచి గుణం కనిపిస్తుంది.

చక్కెర, దనియాలు

దనియాలు, చక్కెర, నీళ్లు కలిపి తాగినా కూడా తలనొప్పి తగ్గుతుంది. జలుబు వల్ల వచ్చిన తలనొప్పయితే ఈ వంటింటి చిట్కా చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది.

గంధం

గంధపు చెక్కను నీళ్ల చుక్కు వేసి రాయి మీద రుద్ది పేస్టులాంటి గంధం తీయాలి. దీన్ని నుదుటి మీద రాసుకుంటే తలనొప్పి పూర్తిగా తగ్గుతుంది.



మందారంతో ఉపయోగాలు

మందారం పూల గురించి మనందరికీ తెలుసు. ఇవి కేవలం చూడటానికి అందంగానే కాకుండా మనిషి ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతాయి. దీనిని హైబిస్కస్ అని కూడా అంటారు. దీనిని ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటారు. అలాగే మందులుగా కూడా ఉపయోగించొచ్చు. దీంతో మనిషి ఆరోగ్యంగా వుంటారని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

* ముఖ్యంగా యునాని మందులలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీంతో శరీరంలోని కొవ్వు, మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధి, గొంతుకు సంబంధించిన వ్యాధులు తదితర జబ్బులకు మంచి ఔషధంలా పనిచేస్తాయి.
* ఇందులో విటమిన్ సి, కాల్షియం, పీచు పదార్థం (ఫైబర్), ఐరన్, నైట్రోజన్, ఫాస్ఫరస్, టెటరిక్, ఆక్సీలిక్ యాసిడ్, ఫ్లేవోనైడ్ గ్లైకోసైడ్స్ తగు మోతాదులో లభిస్తాయి. వీటివలన శరీరం ఆరోగ్యంగా వుంటుంది.
* మందారపువ్వును హెర్బల్ టీ, కాక్టేల్ రూపాలలోనూ సేవించవచ్చు. పూలనుఎండబెట్టి హెర్బల్ టీగా తీసుకోవచ్చు.

హెర్బల్ టీ తయారు చేసే విధానం : నీటిని బాగా వేడిచేసిన తర్వాత ఎండిన మందార పువ్వులను అందులో వేయండి. అందులో చక్కెర, కాస్త టీపొడి కలుపుకుని టీలాగా తయారు చేసుకోండి. దీంతో హైబిస్కస్ హెర్బల్ టీ తయారవుతుంది. ప్రతి రోజు దీనిని సేవిస్తుంటే ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు వైద్యులు. అలాగే కాక్టేల్ టీ కొరకు దీనిని చల్లగా చేసి అందులో కొన్ని ఐసు ముక్కలను వేసుకుని తాగితే అదే కాక్టేల్ టీ. ఇలా ప్రతి రోజు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారంటున్నారు ఆరోగ్య నిపుణులు.

అందానికి మందారం : మందార మొక్క నుంచి లభించే ఆకులు, పువ్వులు కూడా సౌందర్యాన్ని పరిరక్షించేందుకు ఎంతగానో తోడ్పడతాయి. ఈ మొక్క నుంచి నూనె తీస్తారు. మందార నూనెతో తలవెంట్రుకలను పరిరక్షించుకోవటమే కాక, చర్మ రక్షణకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. మందార నూనె కేశాలకు రాస్తే ఆ కేశాలకు మరింతగా అందాన్నీ, మెరుపుని ఇస్తుంది. ఈ నూనెతో తలకు మసాజ్ చేస్తే చుండ్రు నివారించుకోవచ్చు. జుట్టు రాలటం తగ్గటమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కేశాలు తెల్లబడకుండా ఉండేందుకు ఉపకరిస్తుంది. అంతేకాక కేశాలు దృఢంగా ఉండేందుకు, మెరుపుతో ఉండేందుకు ఈ నూనె ఉపయోగపడుతుంది. కేశాలకు వృద్ధాప్య చాయలు దరిచేరకుండా చూస్తుంది. చర్మం నునుపుగా ఉండేలా చూస్తుంది. చర్మంలో మృత కణజాలం లేకుండా చేస్తుంది. స్నానానికి వెళ్ళే ముందు మందార నూనె నీటిలో వేయటం వల్ల శరీరం అందంగా ఉండటమే కాక సుగంధ భరితంగా ఉంటుంది. పాదాల సంరక్షణలోనూ తన ఉనికి కాపాడుతోంది. పాదాలపగుళ్ళు తగ్గేందుకు ఈ నూనెతో మసాజ్ చేస్తే మంచి ఫలితాలొస్తాయి. అన్నింటికన్నా ముఖ్యమైన విషయమేమంటే మందారం అన్నిచోట్ల విరివిగాదొరుకుతుంది.❖

సగటు మనిషీ! జర పైలం!!



మోది సర్కార్ కొలువు తీరి నవ మాసాలు కావస్తోంది. ఎన్నికలలో ఊదరగొట్టిన "మంచి రోజుల" పత్తాలేకపోగా సామాన్యుడికి చెడ్డ రోజులు మాత్రం ముసురుకుంటున్నాయి. జనం రోసిన కాంగ్రెస్ విధానాలనే మరింత దూకుడుగా అమలు చేస్తున్న మోడీ సర్కార్ కాంగ్రెస్ పోగు చేసుకున్న వ్యతిరేకతను అతిత్వరలోనే మూటగట్టుకోక తప్పదన్న విషయం సంఘ్ పరివారానికి తెలియదని అనుకోలేం. అందుకే ప్రజల్లో వచ్చే అసంతృప్తిని దారిమళ్లించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

దిగజారుతున్న ఆర్థిక స్థితి - చితికిపోతున్న సగటు భారతీయుడు

పెట్టుబడిదారులు, వారి కిరాయి ఆర్థికవేత్తలు, ప్రధాన మీడియా భారత్ ఆర్థిక వ్యవస్థ వికసిస్తోందని సమీప భవిష్యత్‌లో చైనాను వెనక్కినెట్టి, అభివృద్ధి సాధిస్తుందని చెప్తున్నారు. (2017 కి చైనా జి.డి.పి. 6.9% కాగా భారత దేశం 7 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని ఎకనామిక్ టైమ్స్ రాసింది). ఫిక్కి, సిఐఐ లు మొన్న అమెరికా విమానం ఎక్కే ముందు నరేంద్రమోడీ ఆవిష్కరించిన 'మేక్ ఇన్ ఇండియా' నినాదంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. నెలలు గడుస్తున్నా తామాశించిన ఫలాలు పూర్తిగా అందలేదన్న అభిప్రాయం వున్నవారూ, అది పెరుగుతున్న కార్పొరేట్లూ ఉన్నారు. నేరుగా స్వరం పెంచి తమ డిమాండ్లు సాధించుకుంటున్నారు.

భారతదేశ ఎగుమతులు తగ్గాయి. ప్రపంచమంతా సజావుగా వున్నప్పుడు, గత పాతికేళ్ళుగా నిర్మించిన ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉపయోగపడింది. నేడు గ్రోత్ ఇంజనే కుంటుతున్నది. అంటే అమెరికన్లు ఖర్చు చేస్తుంటే చైనా, భారత్ వంటి దేశాలతో సహా అనేక 3వ ప్రపంచ దేశాల నుండి గోధుమలు మొదలు ఎలక్ట్రానిక్ సరుకుల వరకు, నూలు బట్టల నుండి లగ్జరీ కార్ల వరకు అమెరికన్‌లు ఖర్చు పెడ్తాంటే మనలాంటి దేశాలు ఎగమతులు చేస్తున్నాయి. (ఈ సందర్భంగా ఒక విషయం మనం గుర్తు చేసుకోవాల్సిందే. 18వ శతాబ్దం చివరి వరకు, అంటే ఈస్టిండియా కంపెనీ పాలన మన దేశంలో వెళ్ళూనుకునే వరకు, ఇంగ్లాండులో టీలో చక్కెర వేసుకుని కేవలం ధనికులే త్రాగేవారట! నేడు ధనిక దేశాల సూపర్ మార్కెట్లలో లభ్యమయ్యే సరుకుల్లో సుమారు 12వేల సరుకులు 3వ ప్రపంచ దేశాల నుండి దండుకున్నవే!). అమెరికా ఒక్కటే కాదు, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలన్నీ నేడు తీవ్ర మాంద్యంలో వున్నాయి. జపాన్ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది.

ఈ వింత పరిస్థితి చూడండి. కొన్ని యూరోపియన్ దేశాలు ముఖ్యంగా గ్రీస్ దివాళా అంచునుంది. అది ఐ.పి పెడ్తే దానికి ఇప్పటికే అప్పులిచ్చిన దేశాల్లోని బ్యాంకులు మునగనున్నాయి. వాటిని బయటెయ్యకపోతే ఇతర యూరో దేశాలూ మునుగుతాయి. కాబట్టి ఇంకా అప్పిచ్చి గ్రీసును బయటెయ్యాలి. ఇవ్వాలంటే ఆయా దేశాల్లోని కార్మికుల కడుపులు కొట్టే 'పొదుపు చర్యలు' ప్రకటించాలి. అప్పులిచ్చిన గ్రీసులోను 'పొదుపు చర్యలు' చేపడ్తున్నారు. దాని పర్యవసానమే జీతాల తగ్గింపు, పెన్షన్ల కోత (ఇవన్నీ ఇంకా మన దేశంలోకి పెద్దగా రాలేదు). ప్రైవేటీకరణలు, సంక్షేమ చర్యల్లో కోత (ఇవి క్రమంగా ఊపందుకుంటున్నాయి మన దేశంలో) ఫలితంగా ఇంగ్లాండు, ఫ్రాన్స్‌తో సహా అన్ని యూరో దేశాల్లోను కనీవినీ ఎరుగని సమ్మెలు నడుస్తున్నాయి. వెరసి, అప్పు ఇచ్చినాతంటా, ఇవ్వకుంటే పూర్తిగామంటే!

ఈ సంక్షోభ ఫలితాలు దారుణంగా వున్న యూరోపియన్ బ్యాంకులకు బ్యాలన్స్ షీట్ సమస్యలు ముందుకొచ్చాయి. స్టాక్ మార్కెట్లు కుదుపులకు గురౌతున్నాయి. ఎందుకంటే, మదుపుదారుల విశ్వాసం సన్నగిల్లుతోంది. దాని ఫలితమే అభివృద్ధి చెందే దేశాల్లోకి పెట్టుబడులు సన్నగిల్లుతున్నాయి. ఇవన్నీ ఒకెత్తయితే, యూరో దేశాల్లో పొదుపు చర్యల .వల్ల మనలాంటి దేశాల నుండి వెళ్ళే ఎగుమతులకు గిరాకి తగ్గుతోంది. అటు అభివృద్ధి చెందిన దేశాల్లో నిరుద్యోగం పెరగడంతో పాటు మనలాంటి దేశాల్లోనూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. పై వివరణ నేపథ్యంలో నేడు దిగజారుతున్న మన దేశ ఆర్థిక పరిస్థితిని పరిశీలిద్దాం.

2014-15 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 50వేల కోట్లు ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలు అమ్మడం ద్వారా సంపాదించాలని మోదీ సర్కార్ లక్ష్యం నిర్ణయించుకుంది. కనీసం ఓ.ఎన్.జి.సి,



కోల్ ఇండియాల్లో డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.37,500 కోట్లు. కానీ మోదీగారొకటి తలిస్తే స్టాక్ మార్కెట్లు వేరొకటి తలిచాయి. అంతర్జాతీయంగా ఇంధన ధరలు పతనమౌతున్న నేపథ్యంలో ఈ రెండు సంస్థల్లో డిజిన్వెస్ట్‌మెంట్ అవాంఛనీయమని ప్రభుత్వ పెద్దల్లోనే కొందరు వాదిస్తున్నారు. ఈ వాటాలు విక్రయం చేయకుంటే ప్రభుత్వ ఆదాయం తగ్గిపోతుంది. ఆ దేశాల్లో ఇలాంటి దాన్నే 'క్యాచ్ -22 పరిస్థితి" అంటారు. అచ్చ తెలుగులో "నుయ్యా, గొయ్యా" తేల్చుకోవాలన్న మాట!

మోదీ గారు 'మేక్ ఇన్ ఇండియా' అన్నా, వైబ్రెంట్ గుజరాత్‌ను మోదీ 'వైబ్రెంట్ ఇండియా' గా మార్చాడని ఎకనామిక్ టైమ్స్ వంటి ఆర్థిక రంగ పత్రికలు మురిసిపోయినా పరిస్థితి అంత సజావుగా ఏమీలేదు. 2014 3వ త్రైమాసికంలో (సెప్టెంబర్ - డిసెంబర్) జి.డి.పి. వృద్ధి రేటు 5.3 శాతమే. కాని ఇది మొదటి త్రైమాసికం కంటే (ఏప్రిల్ - జూన్) తక్కువ (5.7శాతం). దీనికి ప్రధాన కారణం తయారీ రంగం దిగజారటమే. కానీ ఐ.ఐ.పి (పారిశ్రామిక గణాంక సూచి) మైనింగ్, క్వారీయింగ్ 1.9 శాతం (ఇది 3వ త్రైమాసికంలో '0'శాతం) తయారీ రంగం విస్తరణ 0.1శాతం, విద్యుత్, గ్యాస్, వాటర్ సప్లై 8.7 శాతం (3వ త్రైమాసికంలో 7.8 శాతం) ఉన్నాయి.

వాస్తవానికి ముడిచమురు పీపాకు 50 డాలర్లకు చేరింది. దీనవల్ల మన దిగుమతుల ఖర్చు తగ్గింది. ఫలితంగా విదేశీ చెల్లింపుల్లో ఒత్తిడి తగ్గింది. కాని పైన చెప్పిన పరిస్థితులు మెరుగుదలను సూచించట్లేదు.

ఉపాధి రంగం అస్తవ్యస్తంగా ఉంది. ఐ.ఎల్.ఓ. (ఉపాధి రహిత అభివృద్ధి) అంచనా ప్రకారం 2014లో అది 3.8% ఉంటుంది. నయా ఉదారవాద విధానాల అమలు జరుగుతున్న ఈ పాతికేళ్ళలో (2003-04 - 2010-2011) ఆరేళ్ళు జి.డి.పి. 8-9 శాతం వున్న కాలం. పెట్టుబడిదారులకు 'స్వర్ణయుగం'గా వర్ధిల్లిన ఈ కాలంలో కూడా ఉపాధి దిగనాసిల్లింది. 2010-11లో 3.5%, 2011-12లో 3.6%, 2013-14లో 3.7శాతం నిరుద్యోగముంది. 2014-15లో 3.8% ఉండవచ్చని ఐ.ఎల్.ఓ. నివేదిక 'గ్లోబల్ ఎంప్లాయిమెంట్ ట్రెండ్స్' అంచనా వేసింది. ఈ శాతాలెక్కల్లోని మతలబు అర్థం చేసుకోవాలి. 15-59 సం॥రాల వయసున్న జనాభాలో ఈ శాతం లెక్కిస్తారు. ఆషాలు, ఐ.కె.పి. యానిమేటర్లు వంటి వారందరూ ఉద్యోగాలున్న లెక్కలోనే వుంటారు. అందుకే ఐ.ఎల్.ఓ. నివేదిక మన దేశంలో ఉద్యోగాల్లో వున్న వారిలో కేవలం 21.2 శాతమే క్రమం తప్పకుండా వేతనాలొచ్చే ఉపాధిలో వున్నారని రాసింది.

2012-13లో ఛండీఘర్‌లోని లేబర్ బ్యూరో విడుదల చేసిన నివేదిక ప్రకారం చదువుకున్న నిరుద్యోగం దేశంలో పెరుగుతోంది. పొట్ట చింపితే అక్షరం ముక్కరాని 15-29 ఏళ్ళ వారిలో నిరుద్యోగం 3.7 శాతం (2012-13) ఉండగా, పట్టభద్రుల్లో నిరుద్యోగం ఇదే కాలంలో 32 శాతంగా ఉంది. టైమ్స్ ఆఫ్ ఇండియా ఆవిష్కరించిన మరోకోణం గమనార్హం. నిరుద్యోగులున్న కుటుంబాలు అత్యధికంగా జమ్ము & కాశ్మీర్‌లో 48 శాతంకాగా, జార్ఖండ్ 42%, ఒడిశా 39%, అస్సాం 38%, బీహార్ 35%. నిరుద్యోగ సమస్య యొక్క సాంఘిక మూల్యం ఏ విధంగా ఉందో ఈ రాష్ట్రాల ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు.

సర్వముదనష్టాలకు కారణం యుపిఏ కనుక, మోడీ వస్తే ఉద్యోగాలొస్తాయని కొందరు పండుగ చేసుకున్నారు. "జాబు రావాలంటే బాబు రావాల"న్న నినాదం ఎ.పి. లో అన్ని గల్లీల్లో దర్శనమిచ్చింది ఈ బాపతుదే! కొండనాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు కొత్త ఉద్యోగాలొస్తాయని జనం ఆశిస్తుంటే ఉన్న ఉద్యోగాలూడుతున్నాయి. తయారీ రంగం గురించి ముందే చెప్పుకున్నాం. ఇప్పటిదాకా 'ఆహా, ఓహో' అన్న రంగం సర్వీసు సెక్టార్. (మొత్తం సర్వీసు రంగం పెరుగుదల్లో ఐటి, రియల్ ఎస్టేట్ రంగాలదే పెద్దపీట) నేడు టిసిఎస్ లో 25-30 వేలమందిని, కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసెస్‌లో 5-10 వేల మందిని తొలగించే

ఆలోచనలో వున్నారని వార్త. దీని ప్రభావం ఎలా ఉంటుందో, 2008 సెప్టెంబర్‌లో కుప్పకూలిన లేమన్ బ్రదర్స్‌కు మన దేశంలో ప్రధాన క్లైయింట్ అయిన టిసిఎస్‌కు ఏమైనా సంబంధముందా వంటివి భవిష్యత్‌లో తేలాల్సి వుంది.

ఏమైనా నిరుద్యోగ సమస్య పెచ్చరిల్లుతోందన్నది వాస్తవం. ప్రతి ముగ్గురు పట్టభద్రుల్లో ఒకరు నిరుద్యోగిగా వున్నారని టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రచురించింది.

అంతరాలు పెరిగాయి. మన దేశంలో శత, సహస్ర కోటీశ్వరులు ప్రపంచంలోని ఏ దేశం కంటే ఎలా పెరుగుతున్నారో ఇటీవల ప్రొ॥ ప్రభాత్ పట్నాయక్ గణాంకాలతో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఒక విషయం మనం పరిశీలిద్దాం. ఇంతగా అంతరాలు పెరుగుతున్నా జనం పెద్దఎత్తున పోరాటాల్లోకి చురుకుగా ఎందుకు దూకట్లేదన్నది ఒక ప్రశ్న. దీనిపై ఇటీవల అర్జున్ అప్పదొరై అనే సోషియాలజిస్టు "కలలు కనే సామర్థ్యం"అని రాశాడు. నరేందర్ పాని అనే ఆయన ఈ జనవరిలో బిజినెస్‌లైన్ పత్రికలో ఒక వ్యాసం రాస్తూ "1970ల్లో పేదరికం గురించిన చర్చల్లో ధనికులు పేదల కోసం కొంత త్యాగం చేయాలనే వారు. కానీ నేడు పేదలు కూడ ఆదాయాల నిచ్చెన మెట్లెక్కి పైకి వెళ్ళవచ్చని ప్రచారం సాగుతోంది. చింపిగుడ్డల్లో బ్రతికే వారికి సైతం ధీరుభాయి అంబానీ 'విజయగాథ' వినిపించి పేదలందరూ పైకి మెట్టెక్కలేకపోయినా తానొక్కడే దీనికి మినహాయింపుగా ఉండవచ్చన్న ఆశల పల్లకీ ఎక్కిస్తున్నారు. ఇక్కడే 'అభివృద్ధి నమూనా' ఆవిష్కరించబడ్డున్నది. దాని పర్యవసానమే మోదీలు, చంద్రబాబులు.

ఉదారవాద విధానాలకున్న ఈ హస్తలాఘవ అవకాశాలు కూడ మూసుకుపోయే సమయం ఎంతో దూరంలో లేదు.

దేశ సామాన్యుల స్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టయింది. కార్పొరేట్లు తమ ఖర్చుకు, ప్రతిఫలం డిమాండ్ చేస్తున్నారు. 2015 జనవరి 14 ఎకనామిక్ టైమ్స్ పత్రికే నిదర్శనం. 'విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు ప్రభుత్వ రంగ సంస్థ వాటాలు అమ్మేందుకు కష్టపడ్తున్న బ్యాంకులు అన్న శీర్షికతో ఒక వార్త ఉంది. ఆ వార్త సారాంశం అర్థమౌతే ఒళ్ళు ఝల్లుమంటుంది. ఎన్.టి.పి.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.పి.హెచ్.సి. ల వాటాలు అమ్ముతామని మోదీ సర్కార్ ఢంకా బనాయించి చెప్తున్నా విదేశీ సంస్థాగత పెట్టుబడిదార్లు (ఎఫ్ఐఐ లు) నమ్మడం లేదట! కారణమేంటో తెల్సా ? 2010లో ఎన్‌టిపిసి వాటాలను అమ్మినప్పుడు కూడా ఎన్‌టిపిసి తయారు చేసే విద్యుత్‌లో 10 శాతాన్ని వాణిజ్య పద్ధతిలో (మర్చంట్ రేటులో) అమ్ముతామని వాగ్దానం చేశారట. కాని అమలు చేయలేదట! ఎన్ఎండిసి లో వాటాలు అమ్మినప్పుడు (విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లతో కొనిపించినప్పుడు) దాని మొత్తం ఇనుప ఖనిజాన్ని వాణిజ్య పద్ధతుల్లో దేశంలో అమ్ముతామని వాగ్దానం చేశారట! కాని అమలు చేయలేదట! దీని మతలబేంటంటే, అమెరికాలో త్రవ్వే ఇనుపఖనిజం కంటే మన దేశంలో చవగ్గా ఉండకూడదు. (అంతర్జాతీయ ధరల స్థిరీకరణ. ఇంటర్నేషనల్ ప్రైస్ ప్యారిటీ) మనలాంటి దేశాలను దెబ్బతీసేందుకు సామ్రాజ్యవాద దేశాల గేమ్ ప్లాన్ ఇది. 2012లో ఓఎన్‌జిసి షేర్లు అమ్మినప్పుడు గ్యాస్ సబ్సిడీలపై యుపిఏ చేసిన వాగ్దానం అమలు చేయలేదట! ప్రభుత్వ రంగ సంస్థల పునర్వ్యవస్థీకరిస్తామన్న వాగ్దానం కూడా అమలు కాలేదని ఎఫ్.ఐ.ఐ. లు వాపోతున్నారు.

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు నిలవకపోతే మన స్టాక్ మార్కెట్లు కుప్పకూలతాయి. దేశంలో జనం ఏమైనా, సెన్సెక్స్, నిఫ్టీలే మన పాలకులకు ముద్దు. అందుకే గతంలో యుపిఏ వాగ్దానం చేసి "విధానపరమైన పక్షవాతం" వల్ల అమలు చేయలేకపోయిన వాటన్నింటిని నరేంద్ర మోడీ అమలు చేయడానికి సిద్ధమౌతున్నాడు.

అసంతృప్తి దారి మళ్ళించే ప్రయత్నాలు

"ఏ విత్తు నాటితే ఆ చెట్టే వస్తుంది" ఇది మనందరికి తెల్సిన సత్యమే. ఈ విధానం ఎవరు అమలు జరిపినా ఒకే రకమైన అసంతృప్తి ప్రజల్లో పెల్లుబుకుతుంది. ఇది రాష్ట్రాల అనుభవం. కేంద్రంలో అనుభవం. ఆరేళ్ళు ఎన్.డి.ఏ. ను చూసిన దేశ ప్రజలు పదేళ్ళు దానికి అధికారం ఇవ్వలేదు. ఈ అయిదేళ్ళ మోదీ పాలన చూసిన తర్వాత ప్రజలే బిజెపి భవిష్యత్ నిర్ణయిస్తారు. ఈ విషయం తెలియని వారు కాదు కదా సంఘ్ పరివారం. అందుకే ప్రజల అసంతృప్తిని దారిమళ్ళించే ప్రయత్నాలు నిత్యం చేస్తున్నారు.


ఒక పక్క చర్చీలు, మసీదులు ధ్వంసం చేస్తూనే బాధ్యత గల పార్లమెంటు సభ్యులు, మంత్రులు భారత రాజ్యాంగాన్ని పరిహాసం చేస్తున్నారు. మొన్నటికి మొన్న ప్రవీణ్ తోగాడియా లాహోర్, కందహార్ లలో త్రివర్ణ పతాకమెగరెయ్యాలన్నాడు. ఇది కాకతాళీయంగా అన్నమాట కాదు. ఆర్.ఎస్.ఎస్. వారి దృష్టిలో భారతదేశ పటం చూస్తే అర్థమయ్యే విషయమిదే. అసదుద్దీన్ ఓవైసీ ని "హిందూ మతం తీసుకో, లేకుంటే పాకిస్తాన్ పో" అంటుంది సాధ్విప్రాచి. సాక్షి మహరాజ్ ప్రతి హిందూ మహిళా నల్గుర్ని కనాలంటే, బెంగాల్‌లోని ఓ కొత్త బిచ్చగాడు ఐదుగుర్ని కనమంటాడు. వీరి దృష్టిలో మహిళలు కేవలం పిల్లల్ని కనే యంత్రాలన్న మాట!

మరీ బరితెగించి గాడ్సే విగ్రహాలను దేశమంతా పెట్టాలని ఒకడు అంటే గాడ్సేని ఉరితీసిన రోజున 'శౌర్యదివస్' గా జరపాలంటాడు ఇంకోడు. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి కి ఓట్లు వేయని వారంతా అక్రమ సంతానమని సాక్షాత్తూ ఒక మంత్రి ఉపన్యాసం చెప్పి, నిలదీసేటప్పటికి పార్లమెంట్లో 'సారీ' చెప్పింది. జాతీయ గ్రంథంగా భగవద్గీత ఉండాలని శ్రీమతి సుష్మా స్వరాజ్ చెప్పారు. దేశమంతా రీకన్వర్షన్లు జరుపుతున్నారు.

ఈ వ్యాసంలో వివరించిన పేదరికం, నిరుద్యోగం, ప్రైవేటీకరణ వంటి అంశాల నుండి జనం దృష్టిని మళ్ళించే ఈ ప్రయత్నాల యెడల కార్మికవర్గం అప్రమత్తంగా ఉండాలి.


✤ - ఆర్. సుధాభాస్కర్

యునైటెడ్ మెడికల్ & హెల్త్ ఉద్యోగుల సంఘం 2015 డైరీ ఆవిష్కరణ



యునైటెడ్ మెడికల్ & హెల్త్ ఉద్యోగుల సంఘం డైరీ 2015ను ఆదిలాబాద్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా డిఎం & హెచ్ఓ ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్య రంగంలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు నిత్యం ఉపయోగపడే విధంగా 2015 సంవత్సరం డైరీని తెలంగాణ యునైటెడ్ మెడికల్ & హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటి ముద్రించడం అభినంద నీయమని డిఎం& హెచ్ఓ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు మామిడి వెంకన్న, నవీన్ కుమార్, నాగనాథ్, మంజుల, వెంకటమ్మ, ప్రశాంత్ దేశ్‌పాండే, సుభాష్, సురేందర్, ఇబ్రహీం, శ్రీకాంత్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు. ✤


నిజామాబాద్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా





4 నెలల వేతనాలు, 3 నెలల బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు నిజామాబాద్ జిల్లాలో వేలాది మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క బిల్లులు సకాలంలో అందక కార్మికులు అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తూ అనేక ఆర్థిక, మానసిక క్షోభకు గురౌతున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా పథకం సక్రమంగా నడువలేకపోవడానికి కార్మికులే కారణమని చూపిస్తూ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుంది. మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.4.50పైॱల నుండి రూ.5/-ల వరకు దొరుకుతుంది. ఏజెన్సీలకు ఇచ్చే స్లాబు రేటు సరిపోవడం లేదు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని మరియు వారానికి రెండుసార్లు కోడి గుడ్డు పెట్టాలని ప్రభుత్వం, అధికారులు వేధిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2014-15 విద్యా సంవత్సరం ప్రారంభమైన గాని, కార్మికులకు ఇచ్చే స్లాబు రేటుగాని, వేతనాలు గాని పెంచలేదు అని వారు విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సంఘం జిల్లా అధ్యక్షురాలు ధరోజి భారతి, ప్రధాన కార్యదర్శి టి.చక్రపాణి, జె.భద్రప్ప డివిజన్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. ✤



ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కోల్ ఇండియా రక్షణకై జరుగుతున్న ఆందోళనా పోరాటంలో భాగంగా కోల్ ఇండియాలో వాటాల అమ్మకాన్ని నిరసిస్తూ ది.10.02.2015న అంబేద్కర్ సెంటర్, మణుగూరులో ఎన్.డి.ఎ. ప్రభుత్వం దిష్టిబొమ్మను ఊరేగింపు చేసి దగ్ధం చేశారు.


దేశీయ బొగ్గు దిగ్గజం కోల్ ఇండియాకు గడ్డు పరిస్థితి

అదే బాటలో మరికొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు

ఇప్పుడు ప్రపంచంలో ఆర్థికంగా పురోగమిస్తున్న మూడు అతిపెద్ద దేశాల్లో భారత్ ఒకటిగా ఉంది. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలంటే విద్యుత్ రంగం ఇప్పటివరకు చేస్తున్న విద్యుత్ ఉత్పత్తికి మరింత అదనంగా ఉత్పత్తి చేయాల్సి వుంటుంది. దేశంలో బొగ్గు ప్రధాన ఇంధన వనరుగా ఉంది. ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 66% బొగ్గు ద్వారానే అన్నది సుస్పష్టం. ప్రపంచంలో బొగ్గును ఉత్పత్తి చేస్తున్న అతిపెద్ద దేశాల్లో చైనా, అమెరికా తర్వాత స్థానం భారత్‌దే. భాతరదేశంలో కోల్ ఇండియా లిమిటెడ్ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ. దీని పరిధిలో తొమ్మిది బొగ్గు సంస్థలు ఉన్నాయి. ఇందులోనాలుగు లక్షల మంది పర్మినెంట్ ఉద్యోగులు కాగా, రెండు లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రపంచంలో అత్యధికంగా బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఏకైక పెద్ద సంస్థగా దీనికి పేరుంది. ఇక దేశంలో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో కోల్ ఇండియా గరిష్టంగా 81% తో పెద్దన్న పాత్ర పోషిస్తోంది. మొత్తం ఎనిమిది రాష్ట్రాల్లో 81 మైనింగ్ ఏరియాలు దీని పరిధిలో ఉన్నాయి. మహారత్న హోదాను ఏప్రిల్ 2011లో ఈ సంస్థ దక్కించుకుంది. మొత్తం 217 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశంలో ఉండగా మహారత్న హోదాను దక్కించుకున్న 5 కంపెనీల్లో ఒకటిగా నిల్చిన కోల్ ఇండియా పరిస్థితి ఇప్పుడు ప్రమాదంలోపడింది.

గత పాలకులు కోల్ ఇండియాను, మన రాష్ట్రంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌ను ప్రైవేటీకరించాలని చేసిన ప్రయత్నాలను కార్మికులు తీవ్రమైన ఆందోళనలతో తిప్పికొట్టారు. దశాబ్దాలుగా బొగ్గు పరిశ్రమల్లో ఉన్న కార్మిక సంఘాలకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై వీరోచిత పోరాటాలు చేసిన ఘన చరిత్ర ఉంది. 1991 నుండి ఇప్పటి వరకు రెండున్నర దశాబ్దాల్లో దేశీయ బొగ్గు పరిశ్రమ పరిరక్షణ కోసం కార్మికులు మహత్తరమైన ఉద్యమాలు చేసి కార్మిక వ్యతిరేక విధానాల్ని అడ్డుకున్నారు. 1992 నవంబర్ 25న ఢిల్లీలో 10 లక్షల మంది ప్రభుత్వ రంగ సంస్థలు కార్మికులు తమ నిరసన గళాలతో పెద్దఎత్తున కవాతు నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టం. అలాగే 1997 ఏప్రిల్ 2న దేశవ్యాపితంగా కోల్ వర్కర్లు ఒక రోజు సమ్మె చేసి బొగ్గు సంస్థల ప్రైవేటీకరణను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ఉత్పత్తిని స్థంభింప చేశారు. తిరిగి అదే ఏడాది జూలై 28 నుండి మూడు రోజుల పాటు కార్మికవర్గం సమ్మెలోకి వెళ్ళి తమ నిరసను తెలిపాయి. వివిధ రూపాల్లో కార్మికవర్గం ప్రభుత్వ రంగ సంస్థల్లోకి ప్రైవేటు పెట్టుబడులు రాకుండా ఆందోళనలు చేసి, అడ్డుకోగలిగారు. ఆ పరంపరలో భాగంగా 1998 మే 11న దేశంలోని బొగ్గు పరిశ్రమల కార్మికులు గనుల ముందు ధర్నాలకు దిగి ఆనాటి ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పారు. ఇన్ని విధాలుగా కార్మికులు తమ సంస్థని కాపాడుకునేందుకు ఉద్యమించడం తప్ప వేరే మార్గం కన్పించలేదు. అయినా బొగ్గు సంస్థతో పాటు, ఇతర ప్రభుత్వరంగ సంస్థల్లో సంస్కరణలకు, ప్రైవేటీకరణకు ఆనాటి ప్రభుత్వాలు అత్యుత్సాహం ప్రదర్శించాయి. దాంతో 2002 ఆగస్టు 5 నుండి 11 వరకు దేశంలోని బొగ్గుగని కార్మికులు ఆరు రోజులు నిరవధిక సమ్మె చేయడంతో సంస్కరణలకు బ్రేక్ పడింది. ఇక ఆ తర్వాత సంస్కరణలు చేయాల్సిందే అంటూ ప్రపంచ బ్యాంకు ఒత్తిడి మేరకు సంస్కరణలను వేగవంతం చే'సేందుకు కోల్ ఇండియా యాజమాన్యం మొండిగా వ్యవహరించేందుకు సమాయత్తమైంది. దీనిని తిప్పికొట్టేందుకు సిఐటియు తో పాటు ఐదు జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. 2003 మే 21న దేశవ్యాప్తంగా కార్మికులు విధుల్ని బహిష్కరించి సమ్మెను విజయవంతం చేశారు. దేశానికి ప్రధాన ఇంధన వనరు అయిన బొగ్గు సంస్థను కాపాడుకునేందుకు గణనీయమైన ఉత్పత్తుల్ని వెలికితీస్తూనే అనివార్యంగా సమ్మెలతో ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పారు కార్మికులు.

ఇన్ని విధాలుగా కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ నిరసనలు తెలిపినా యుపిఏ ప్రభుత్వం "నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు" అంటూ పెట్టుబడుల ఉపసంహరణ వైపుకే మొగ్గు చూపింది. మరలా కార్మికులు సమ్మె ఆయుధాన్ని ప్రయోగించారు. 2008 డిసెంబర్ 18, 19 తేదీల్లో సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. అయినా పాలకులు కార్పొరేట్ దిగ్గజాల బెదిరింపులకు లొంగిపోతూ కోల్ ఇండియాలో 10 శాతం పెట్టుబడుల ఉపసంహరణకు పూనుకున్నది. యుపిఏ మొదటి పాలనలో వామపక్షాలు భాగస్వామిగా ఉండటం మూలాన ఇలాంటి సంస్కరణలకు ఆస్కారం లేకుండా పోయింది.



ఇక యుపిఏ రెండు పాలనలో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు ఎదురులేకుండా పోయింది. సరిగ్గా నాలుగేండ్ల క్రితం కోల్ ఇండియాలో 10 శాతం వాటా ఉపసంహరణతో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం సుమారుగా ఇరవై వేల కోట్ల రూపాయల్ని రాబట్టింది. ఇక ఇప్పుడు ఇంటా, బయట కార్పొరేట్ శక్తులకు రెడ్‌కార్పెట్ పరుస్తున్న నరేంద్రమోదీ కోల్ ఇండియాలో మరో

10 శాతం వాటా ఉపసంహరణ చేశారు. దీంతో కోల్ ఇండియా 20 శాతం వాటాను కోల్పోయింది. 1970 దశకంలో దేశంలో నెలకొన్న చమురు సంక్షోభంతో "ప్రైవేటురంగంలో ఉన్న బొగ్గు సంస్థల్ని జాతీయం చేయడం జరిగింది. నాలుగున్నర దశాబ్దాల అనంతరం ఇవి తిరిగి ప్రైవేటు రంగం వైపుకు పోవడం అత్యంత దురదృష్టకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో జాతి నిర్మాణానికి మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చిన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పిలుపును ఆనాటి పెట్టుబడిదారులు త్రోసిపుచ్చారు. మీరు కోరుకునే రంగాల్లో పెట్టుబడులు పెట్టి మేము అనుకున్న లాభాల్ని రాబట్టలేమని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. సత్వరమే లాభాలు వచ్చే రంగాల్లో పెట్టుబడులు పెట్టి ముందుకు సాగారు. ఆ సమయంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వమే రష్యా సహకారంతో రైల్వే, తంతితపాల, కమ్యూనికేషన్స్, చమురు, ఉక్కు లాంటి సంస్థలను ఏర్పాటు చేసి జాతి నవ నిర్మాణానికి పూనుకుంది.


ఇప్పుడు అవన్నీ నవరత్న, మహారత్న హోదాలో సగర్వంగా జాతి ముందు ఉన్నాయి. దశాబ్దాలుగా కార్మికులు తమ శక్తిని ధారపోసి, వాటిని ఈ స్థాయికి తెస్తే, ఇప్పుడు పారిశ్రామిక వేత్తల కన్ను వాటిపై పడింది. కార్పొరేట్ శక్తుల అడుగులకు మడుగులొత్తే పాలకులు ఇప్పుడు ఆ సంస్థల నుండి వాటాలను ఉపసంహరించు కుంటూ కార్మికవర్గానికి, దేశానికి తీరని ద్రోహం చేస్తున్నారు. మోది పాలనా పగ్గాలు చేపట్టీ పట్టగానే కార్పొరేట్ శక్తులకు సంతోషాన్ని కలిగించే చర్యలకు ఉపక్రమించారు. కేంద్ర ప్రభుత్వం ఇదే దూకుడుతో ముందుకుపోతే ప్రభుత్వరంగ సంస్థల పరిస్థితి ప్రశ్నార్ధకమవు తుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2014-15)లో కోల్ ఇండియాతో పాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థల్లోని వాటాల విక్రయం ద్వారా రూ.43,425 కోట్లు రాబట్టే లక్ష్యంతో ముందుకు పోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించేసింది. ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను మార్కెట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు మోదీ ప్రభుత్వం ఉవ్విళ్ళూరుతోంది. ఉద్యమాలు, పోరాటాలు కోల్ ఇండియా కార్మికులకు కొత్తకాదు. కానీ! చర్చలు జరుపుతాం అని ప్రభుత్వం కార్మికులకు నమ్మబలికి 10 శాతం వాటాను ఉపసంహరించు కోవడంతో ఆ సంస్థ కార్మికులు మరో మారు ఉద్యమాలవైపుకు పోకతప్పని పరిస్థితి. రానున్న రోజుల్లో ప్రభుత్వరంగ సంస్థల్లో ముఖ్యంగా మహారత్న హోదాల్లో ఉన్న కంపెనీల్లో దశల వారీగా వాటాలను ఉపసంహరించుకుంటూ పోతే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదపు అంచుల్లోకి పోదా? లక్షలాది మంది కార్మికులు దశాబ్దాలుగా తమ స్వేదాన్ని చిందించి వీటిని ఈ స్థాయికి పెంచుకున్నారు. ఆర్థిక సంస్థలు, ఇంధన రంగం, కమ్యూనికేషన్, భారీ ఇంజనీరింగ్ సంస్థలు ప్రభుత్వ రంగంగా బాగా అభివృద్ధి చెంది ఈ దేశ స్వావలంబనకు రక్షణగా నిలబడ్డాయి. ఇప్పుడు వీటిని రక్షించుకునేందుకు కార్మికవర్గం మరోమారు మహత్తర పోరాటాల్లోకి రాక తప్పని పరిస్థితి. లేకపోతే ఈ రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యం పెరిగిపోయి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోగా, ఆర్థిక వ్యవస్థకు జరిగే ప్రమాదం పొంచి వుంది. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చే పోరాట పిలుపులకు కార్మికులు కదిలి, ప్రభుత్వ రంగ సంస్థల్ని కాపాడుకోవాల్సి ఉంటుంది.

✣ - పి.వి.రావు, సీనియర్ జర్నలిస్టు, సంగారెడ్డి, మెదక్

సింగరేణిలో కోల్ ఇండియా ఒప్పందాల అమలుకై మంత్రి హరీష్‌రావుకు వినతి

కోల్ ఇండియా వేతనాలను, ఒప్పందాలను సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయించేందుకు జోక్యం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖామాత్యులు టి.హరీష్‌రావుకు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జాయింట్ యాక్షన్ కమిటి నాయకులు తేది.10.02.2015న మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. బొగ్గు గనులలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అన్‌స్కిల్డ్ రూ.464/-లు, సెమిస్కిల్డ్‌కు రూ.494/-లు, స్కిల్డ్‌కు రూ.524/-లు, హైలీస్కిల్డ్ కార్మికులకు రూ.554/-లు ఇవ్వాలని ఒప్పందం జరిగి రెండు సంవత్సరాలు పూర్తైనా సింగరేణి యాజమాన్యం అమలు చేయకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని జె.ఎ.సి. నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో ప్రభుత్వ చట్టాలు, ఒప్పందాలు, బోనస్, క్యాంటిన్, సెలవులు తదితర చట్టబద్ధ సౌకర్యాలు అమలు కాక పోవడం శోచనీయమని జెఏసి నాయకులు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలు, బోనస్, ఇతర కార్మిక చట్టాలు



అమలు చేసే విధంగా సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించాలని జెఏసి నాయకులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి సి & యండి తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో సిఐటియు నాయకులు బి.మధు, లోడింగ్ అన్ లోడింగ్ యూనియన్ నాయకులు శంకర్ ముదిరాజ్, ఐఎఫ్‌టియు నాయకులు ఎ.వెంకన్న, టిఆర్ఎస్ కెవి నాయకులు, జల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ✣



... మరి మనుస్మృతిని ఎందుకు

తగలబెట్టరు?

ఆమె అంటరాని వసంతాన్ని ఆలింగనం చేసుకుంటుంది. కసిగా కలాన్ని ఝుళిపించి కుల వివక్షను నిలదీస్తుంది, ఎదిరిస్తుంది. అసమానతలపై అక్షరాల్ని సంధించిన కవయిత్రి ఆమె. మది మదినీ కదిలించేలా స్త్రీ అంతరంగాన్ని కవిత్వీకరించిన స్పర్శ ఆమెది. సమాజం అంచుల దాకా నెట్టి వేయబడ్డ స్త్రీ ధిక్కారస్వరాన్ని వినిపించిన వీరవనిత ఆమె. ఇప్పుడు 'ద జిప్సి గాడ్డెస్' తో అగ్రకుల, భూస్వామ్య దురహంకారాన్ని తూర్పార బడుతోంది. ఆమే... యువ కవయిత్రి, రచయిత, అనువాదకు రాలు **మీనా కందస్వామి.** హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన మీనా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు సాహితీ సంగతులను పంచుకుంది. రచయిత సామాజిక బాధ్యతను స్వీకరించాలని, కార్పొరేట్ సంస్థల దోపిడీని ప్రశ్నించాలంటున్న **మీనా కందస్వామి** ముచ్చట్లు...

పెరుమాళ్ళ మురుగన్ వంటి రచయితలపై దాడిని ఎలా అర్థం చేసుకోవచ్చు?

ప్రగతిశీల రచయితలపై దాడులను అర్థం చేసుకోవా లంటే... ముందు అలాంటి దాడులకు పాల్పడుతున్న వారిని అర్థం చేసుకోవాలి. హిందుత్వ శక్తులు కుల వ్యవస్థను, స్త్రీ అణచివేతను కాపాడాలనుకుంటాయి. తమిళనాడులోని కొంగు వెలద గౌండర్ అనే సామాజికవర్గానికి చెందిన వాళ్ళు మురుగన్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ సామాజిక వర్గం విద్యా సంస్థల్లో కులాంతర వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండడాన్ని గమనించవచ్చు. స్త్రీకి ఆస్తిహక్కు కల్పిస్తే కుల అస్తిత్వం కోల్పోతామని బహిరంగంగా ప్రకటనలు చేశారు. కుల వ్యవస్థను కాపాడడమనేది వీళ్ల లక్ష్యం. అందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతుంటారు. నిజానికి మనుస్మృతి కంటే ఎక్కువ స్త్రీలని అవమానించిన గ్రంథం మరొకటి ఉండదు. పెరుమాళ్ రచనల్ని తగలబెట్టిన వీళ్లు మనుస్మృతిని ఎందుకు తగలబెట్టట్లేదు. అంబేద్కర్ ఎప్పుడో ఆ పని చేసి చూపించారు. కులాన్ని కాపాడుకోవడం, పురుషాధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం సాగుతున్న ప్రయత్నం ఇది.

వన్ పార్ట్ ఉమెన్ ప్రచురితమైన చాలాకాలం తరువాత ఎందుకు వివాదాలు తలెత్తాయి ?

ఇక్కడ ఎంతకాలం తరువాత అనేది ముఖ్యం కాదు. సమాజంలోని అసమానతలు, దురాచారాలను ప్రశ్నించడం హిందుత్వ శక్తుల దృష్టిలో తప్పు. ఇలాంటి ప్రయత్నం ఎవరు చేసినా భయభ్రాంతులకు గురి చేయాలనుకుంటారు. నేను రాసిన 'అప్ రూట్ హిందుత్వ' పుస్తకంలోని ఫుట్‌నోట్స్‌లో ఇద్దరు దేవుళ్లను గురించి ప్రస్తావించాను. ఆ పుస్తకం వచ్చిన 7 సంవత్సరాల తరువాత నాపై కేసు వేశారు. కమ్యూనల్ హార్మోనీకి భంగం వాటిల్లుతోందని వాదించారు. విమర్శను స్వీకరించలేని అసహనం వాళ్లది. గతంలో సెంథిల్‌ముల్లర్ కుల వివక్షను గురించి రాసిన పుస్తకం నిషేధానికి గురైంది. బహిరంగ దాడులను ఎదుర్కోవలసి వచ్చింది. చివరకు దేశం విడిచి వెళ్లిపోవాల్సిన స్థితి కల్పించారు.

రచయితలపై జరిగే దాడులను వ్యక్తిగతంగా చూడకూడదు. సామూహికంగానే చూడాలి.

ఇలాంటి దాడులు ఎలాంటి సంకేతాలిస్తున్నాయి ?

వేలాది మంది ముస్లింలు, ఆదివాసీలను హత్య చేసి అధికారం చేపట్టిన నరేంద్రమోడీ పాలనలో ఇలాంటి దాడులు ఊహించనివి కావు. ఇది కేవలం సంకేతం మాత్రమే. ఇంతకు మించి మరిన్ని దారుణాలు జరిగే అవకాశం ఉంది. దీన్ని ప్రజలు దృష్టిలో ఉంచుకోవాలి.

దురాచారాన్ని ప్రశ్నించడం నేరమంటారా ?

మతం, కులం పేరిట స్త్రీ స్వేచ్ఛను హరిస్తున్నారు. ఎవరితో జీవించాలి? ఎలాంటి దుస్తులు వేసుకోవాలి? ఏం మాట్లాడాలి? వంటి అన్ని విషయాల్లో నేటికీ పురుషాధిపత్యం కొనసాగుతోంది. ఒక రకంగా మతం డిక్టేట్ చేస్తోంది. కులాంతర, మతాంతర వివాహాల్ని నేరంగా పరిగణిస్తూ లవ్ జిహాద్ పేరిట అంటూ దాడులకు పాల్పడుతున్నారు. రాజ్యం అందుకు పూర్తి మద్దతునిస్తోంది. రెండు సంవత్సరాల క్రితం కేరళలో మతాంతర వివాహం చేసుకున్న ఓ జంటపై తల్లిదండ్రులు కేసు వేశారు. కోర్టు 'లవ్ జిహాద్'పై విచారణ జరపాలంటూ డీజిపిని ఆదేశించింది. విచారణలో అలాంటిదేమీ లేదంటూ తేలిందనుకోండి. ఎవరితో జీవించాలనే విషయంలో స్వయం నిర్ణయాధికారాన్ని హరించే చర్యలివి.

రచయితల పాత్ర ఎలాంటిది?

రచయిత సామాజిక బాధ్యతను స్వీకరించాలి. రచన ఊసుబోని ప్రక్రియ కాదు. సమాజంలోని అసమానతలు, అణచివేతలపై అక్షరాన్ని సంధించాలి. ఆధిపత్యాన్ని ప్రశ్నించాలి. అణచివేతను ఎదిరించాలి. సమాజం పట్ల బాధ్యతపడడమే కాదు... తనను తాను రక్షించుకోవాలి కూడా. ప్రగతి నిరోధకుల నుంచి ఎదురయ్యే దాడులను ఎదుర్కొనేందుకు వినతిపత్రాలు ఇస్తే సరిపోదు. రచయితలు సంఘటితమవ్వాలి. ప్రజల పక్షాన నిలబడి ఐక్యతను చాటాలి.

రచయితలు కూడా వేరు వేరు అస్థిత్వాల కింద విడిపోయి కనిపించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

వేరు వేరు సమూహాలు ఎదుర్కొంటున్న సమస్యలు రూపంలో వేరుగా కనిపించినప్పటికీ అవన్నీ సారంలో ఒకటే. ఒక వ్యక్తిపై జరిగే దాడి అది వ్యక్తిగతమైంది కాదు. సామూహికమైంది. ఆదివాసీ సమాజం ఇవాళ యుద్ధం మధ్య నిలబడి దేశానికి స్ఫూర్తినిస్తోంది. వనరులు కొల్లగొట్టడాన్ని ప్రశ్నిస్తోంది. కార్పొరేట్ సంస్థల దోపిడీని ఎదిరిస్తోంది. అలాంటి ప్రజా ఉద్యమాన్ని సమర్థించాల్సిందే. అక్కడి ఉద్యమ నాయకత్వం కేవలం పెట్టుబడి గురించే మాట్లాడడం లేదు. కులం, స్త్రీ అణచివేత తదితర అన్ని విషయాల్ని చర్చిస్తోంది. అనురాధ గాంధీ తన రచనల్లో కుల నిర్మూలనకు 29 పాయింట్స్ సూచించింది. వాటిని అధ్యయనం చేస్తే కులనిర్మూలన పట్ల విప్లవోద్యమ అవగాహన అర్థమవుతుంది.

ప్రజల పక్షాన నిలవాల్సిన రచయితలు పర్సరం విమర్శించుకుంటారు ఎందుకు ?

ప్రజాహిత శ్రేణుల మధ్య దూరం కృత్రిమంగా సృష్టించిందనే చెప్పాలి. కార్పొరేట్ శక్తులు సాహిత్యాన్ని, రచనను సైతం తమకు అనుకూలంగా మలుచుకోవాలని చూస్తాయి. నిజానికి విప్లవ శ్రేణుల కార్యాచరణని సమర్థించకపోవడానికి చాలా కారణాలున్నాయి. నిర్బంధం ప్రధానమైంది. కార్పొరేట్ సంస్థల నుంచి అందే ఫారిన్‌ఫండ్ అందదు. ఎన్.జి.ఓ. ల మద్దతు లభించదు. ప్రభుత్వాల సహకారం ఉండదు. ఇలాంటి కారణాల వల్లే విమర్శలు గుప్పిస్తూ....కార్పొరేట్ అనుకూలతను చాటుకుంటారు కొందరు.

లిటరరీ ఫెస్టివల్స్‌కి సైతం కార్పొరేట్ సంస్థలే స్పానర్స్ ఉంటున్నాయ్ కదా మరి?

కార్పొరేట్ సంస్థలు ప్రజలను మభ్యపెట్టేందుకు వేసుకునే మేలి ముసుగు ఇది. ప్రజల పక్షం వహించాల్సిన రచయితలు సైతం తమ పక్షం ఉన్నారని చాటుకునే యత్నం. ఇలాంటి వేదికపై పాల్గొనాల్సి వస్తే... రచయితలుగా తమ స్వతంత్ర భావాల్ని ప్రకటించే స్వేచ్ఛ ఉండాలి. జైపూర్‌లిటరరీ ఫెస్టివల్‌కి టాటా స్టీల్స్ స్పాన్సర్ చేసింది. ఫెస్టివల్‌లో ప్రగతిశీల రచయితలుగా చెప్పుకునే వాళ్లంతా టాటా స్టీల్ వైస్ ఛైర్మన్‌తో వేదిక పంచుకున్నారు. ప్రముఖ పొగాకు ఉత్పత్తి సంస్థ రజినీ గంధా మరో స్పాన్సర్. కానీ ఫెస్టివల్‌లో నో స్మోకింగ్ బోర్డులు కనిపిస్తాయి. ఈ వైరుధ్యాన్ని గమనిస్తే చాలు.. లిటరరీ ఫెస్టివల్స్ అసలు లక్ష్యం, కార్పొరేట్ సంస్థల స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

✦ **(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)**

వివిధ పత్రికలలో ప్రచురించబడిన కార్మికులకు ఉపయోగకరమైన సమాచారాన్ని 'వినదగునెవ్వరు చెప్పిన' అనే శీర్షికలో ప్రచురిస్తాము. అలాంటివి గమనించినప్పుడు మా దృష్టికి తీసుకురాగలరని కోరుతున్నాము.

\- ఎడిటర్

మహిళా శ్రామికులంటే అంత అలుసా?

ఏయ్! ఏంటే ఇంత ఆలస్యంగానా పనిలోకొచ్చేది? ఐదు నిమిషాలే కదా సారు! ఈసారి టయానికి వస్తాను. ఏందే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావ్. ఐదు నిమిషాలైన ఊరుకునేది లేదు. నీకు ఇష్టముంటే చెయ్... లేదంటే పో... ఒరేయ్ దీన్ని మెడపట్టి బయటకు గెంటేయ్... నోరు లేస్తంది... ఇవి ఏవో సినిమా డైలాగులనుకుంటున్నారా? కాదండి. హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఇ.ఎస్.ఐ. ఆసుపత్రిలో హౌస్ కీపర్లుగా పనిచేస్తున్న మహిళా కార్మికులతో ఒక సూపర్‌వైజర్ అంటున్న మాటలు. చదవటానికే ఎంతో ఇబ్బందిగా ఉంది కదూ... ఇక అనుభవించే వారి బాధ ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి. ఇలా ఎన్నో బండబూతులను అక్కడి హౌస్‌కీపర్లు భరిస్తున్నారు. ఎన్ని మాటలు అన్నా, ఎంత ఇబ్బంది పెట్టినా పని చేయకపోతే కుటుంబం గడవదు. అందుకే ఇవన్నీ భరించక తప్పదంటున్నారు.

ఒక్కొక్కరితో రెండు వార్డుల్లో పని

హైదరాబాద్ ఎర్రగడ్డ ఇ.ఎస్.ఐ. ఆస్పత్రి కార్మికులకు మెరుగైన వైద్య సహాయం అందించడం కోసం ఏర్పాటు చేయబడింది. కానీ అక్కడ పనిచేసే కార్మికులకు మాత్రం అక్కడ నుండి ఒక్క మందు బిళ్ళ కూడా ఇవ్వరు. ఆస్పత్రిలో రకరకాల పనులు చేసే వారిలో హౌస్ కీపర్లు కూడా ఉన్నారు. మొత్తం 44 మంది వరకు హౌస్ కీపర్ వర్కర్స్ ఉన్నారు. వారిలో 30 మంది మహిళలు ఉంటారు. వాస్తవానికి ఆస్పత్రి శుభ్రం చేయడానికి ఒక్కొక్క వార్డుకు ఒక్కొక్క వర్కర్‌ని నియమించాలి. కాని ఒక్కొక్క హౌస్ కీపర్‌తో నిబంధనలకు వ్యతిరేకంగా రెండు వార్డుల్లో పని చేయించుకుంటున్నారు. అటెండర్లు వెళ్ళిపోయిన తర్వాత వారు చేసే పని కూడా వీరితోనే చేయించుకుంటారు. చివరికి నర్సులు చేయాల్సిన పని కూడా వీరితోనే చేయిస్తుంటారు.

సూపర్‌వైజర్ వేధింపులు ఎక్కువయ్యాయి

వీరంతా కాంట్రాక్టు వర్కర్లే. ఇంత చాకిరీ చేయలేమని, తమకు కేటాయించిన పని వరకే తాము చేయగలమని అడిగితే సూపర్ వైజర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. మహిళలను కూడా చూడకుండా బండబూతులు తిడతాడు. గట్టిగా మాట్లాడితే మెడపట్టుకొని గెంటేస్తామంటాడు. మర్యాద లేకుండా ఒసేయ్, ఏంటే, ఏందే వంటి పదాలు వాడతాడు. చాలాసార్లు బయటకు చెప్పుకోలేని బూతులతో తిడతాడు. ఇష్టం వుంటే చేయండి. లేదంటే మానేయండని బెదిరిస్తుంటాడు. ఇవన్నీ భరించలేక మూడు సంవత్సరాల క్రితం సిఐటియు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. అనేక సమస్యలపై సంఘం అండతో పోరాడుతున్నాం. సంఘం వాళ్ళు ఇచ్చిన ధైర్యంతో అతనిపై యాజమాన్యానికి ఫిర్యాదు చేశాం. ఆ సమయంలో అతని పెళ్ళి ఉందని పెద్దగా పట్టించుకోలేదు. పైగా అతను ఈసారి ఎటువంటి తప్పు చేయనని యాజమాన్యం కాళ్ళు పట్టుకున్నాడు. అందుకే నెల రోజులు చూద్దామని వదిలేశారు. ఇప్పుడు తన ప్రవర్తనా ఇంకా మితిమీరిపోయింది. మాపై వేధింపులు ఎక్కువయ్యాయి.

మా ఆరోగ్యానికి గ్యారెంటీ లేదు

నర్సులు చేసే పని కూడా మాతోనే చేయించడం వల్ల దానిపై మాకు అవగాహన ఉండదు. చాలా మందికి సూదులు గుచ్చుకొని ఇన్ఫెక్షన్లు అవుతున్నాయి. చర్మ వ్యాధులు వస్తున్నాయి. చర్మం దురదలు, మంటలు వస్తాయి. ఆసుపత్రిలో ఎవరికైనా ఏమైనా ఇబ్బంది వచ్చినా యాజమాన్యం పట్టించుకోదు. ఐదారు నెలల క్రితం మాతో పాటు పనిచేసే ఒక హౌస్‌కీపర్ కింద పడి పోయింది. అప్పుడు ఆస్పత్రికి వెళ్ళి మందులు వేసుకుంది. నొప్పి తగ్గింది. ఇప్పుడు మళ్ళీ తనకు సమస్య ఎక్కువైంది. ఆపరేషన్ చేయాలంటున్నారు. ఇటువంటి ఆరోగ్య సమస్యలకు యాజమాన్యం నుండి మాకు ఎటువంటి సహకారం ఉండదు. ఇఎస్ఐలో ఉండి కూడా బయట ఆసుపత్రుల్లో వేలు ఖర్చు పెట్టవల్సి వస్తుంది. ఇ.ఎస్.ఐ. లో చూపించుకుందామంటే రోజుల తరబడి ఆ ఆసుపత్రి చుట్టూ తిప్పుతుంటారు. ఐదు నిమిషాలు ఆలస్యం అయితేనే బండబూతులు తిట్టే సూపర్‌వైజర్ ఆస్పత్రికి వెళ్ళటానికి ఒక్కపూట సెలవు పెట్టినా ఊరుకోడు. దాంతో తప్పక ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించుకుంటున్నాం. మేము పనిచేసే ఆస్పత్రిలో మా ఆరోగ్య సమస్యలు చూపించుకోవడానికి అవకాశం లేదు.

కనీస సౌకర్యాలు లేవు

పని చేసే సమయంలో మాకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చేతులకు గ్లౌజ్‌లు, ముఖానికి మాస్క్‌లు ఇవ్వాలి. కానీ అటువంటి సౌకర్యాలు ఏమీ లేవు. అడుగుదామంటే సూపర్‌వైజర్ ఏమంటాడోనని భయం. దాంతో మాట్లాడకుండా నోరుమూసుకొని పనిచేయాల్సి వస్తుంది. సంఘం అండతో మా సమస్యలపై గట్టిగా మాట్లాడితే ఎవరైతే గట్టిగా ప్రశ్నిస్తారో వాళ్ళను టార్గెట్ చేసి ఇంకా వేధింపులు ఎక్కువ చేస్తున్నాడు. హౌస్‌కీపర్లలో మహిళలు ఎక్కువగా ఉంటాం. కాని మహిళలుగా మాకు వచ్చే ప్రత్యేకమైన సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం లేదు. సూపర్‌వైజర్, యాజమాన్యం అందరూ మగవారే. ఒక్కమహిళా అధికారి కూడా లేదు.

- అనురాధ, హౌస్‌కీపర్, ఇ.ఎస్.ఐ. స్పెషాల్టీ హాస్పిటల్, ఎర్రగడ్డ, హైదరాబాద్

రైల్వేను ప్రైవేటీకరణ నుంచి పరిరక్షించుకుందాం!!



భారతదేశంలోనే అతిపెద్ద రవాణా సంస్థ రైల్వేను ప్రయివేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం వేగంగా కదులుతోంది. లక్షలాది మంది పని చేస్తున్నటువంటి రైల్వేను కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చివేసి రైల్వేను నిర్వీర్యం చేయడానికి మోడీ దూకుడుగా వ్యవహరిస్తున్నాడు.

రైల్వే రంగం, బిఎస్ఎన్ఎల్, విమానాశ్రయాలు, హెచ్.సి.ఎల్, కోల్ ఇండియా ఇంకా ఎన్నో వాటిని ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు అమ్ముతున్నారు. ప్రైవేటీకరణ విధానాలను అమలు చేయడంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటంలోనూ మోడీ దూకుడుగా వెళుతున్నాడు. రైల్వేలో ఇప్పటికే క్రమక్రమంగా క్లీనింగ్, క్యాటిరింగ్, దోబి వంటివి ప్రయివేటీకరణ చేశారు. రైల్వే రంగంలో సుమారు దేశ వ్యాప్తంగా ఆరు లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అహ్మదాబాద్ నుంచి బొంబాయి వరకు బుల్లెట్ ట్రైన్స్, వచ్చే రైల్వే కొత్త లైన్లు ప్రైవేటీకరణ చేయబోతున్నట్లు మోడీ చెప్పారు. రైల్వే బడ్జెట్‌లో అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రైవేట్ పబ్లిక్ పాట్‌నర్‌షిప్ నినాదమయింది. బుకింగ్ నెట్‌వర్క్‌లను మూసివేసి ఇ-సేవ, మీ -సేవ లాగా ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పు తున్నారు. సౌత్ సెంట్రల్, నార్త్ సెంట్రల్, నార్త్ ఈస్ట్ రైల్వేలున్నాయి. భారత రైల్వేలు వంటి రవాణా వ్యవస్థనూ పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటు వ్యక్తులకు అప్పగించు తున్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల కాలంలో రైల్వేలో వందశాతంవిదేశీ ప్రత్యక్ష పెట్టుబడిదారులకు బార్లు తెరిచింది. ప్రజా వనరాలకు అనుగుణంగా ప్రజా రైల్వే రవాణా వ్యవస్థనూ మెరుగు పర్చకుండా - ప్రైవేటు భాగస్వామ్యం పేరిట రైల్వే ప్రైవేటీకరణకు పూనుకొన్నది. దేశ వ్యాప్తంగా ఏడు వేలకు పైగా రైల్వే స్టేషన్లు ఉన్నాయి. వీటికి ఆనుకుని వేలాది ఎకరాల భూములున్నాయి. ఇలాంటి వనరులను దోచుకోవడానికి ప్రైవేటు స్థిరాస్థి వ్యాపారులకు లాభాలు చేకూర్చే విధంగా హోటళ్ళు నిర్మాణానికి వారికి అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ప్రైవేటీకరణలో భాగంగా కొన్ని రైల్వే స్టేషన్లను ఎంపిక చేశారు. విలాసవంతమైన హోటళ్ళు, రెస్టారెంట్లు, రవాణా సేవలో భాగం కాదు. రవాణా సౌకర్యాల కోసం ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సౌకర్యాలు కొరవడినాయి. తగినన్ని రైలు బండ్లు, తగినన్ని రైలు పెట్టెలు లేక ప్రయాణీకులు అవస్థ పడుతున్నారు. కార్పొరేటు శక్తులు రైల్వే భూములపై కన్నేసి, వాటిని స్వంతం చేసుకోవడానికి కుట్ర పన్నుతున్నారే తప్ప ప్రజలకు సేవ చేయడానికి కాదు. మోడీ వారికి వంత పాడు తున్నారు.

మోడీ కేంద్రంలో అధికారంలోకి రాగానే గతంలో ఎన్నడూలేని విధంగా రైల్వే ప్రయాణ ఛార్జీలు 14.2శాతం పెంచి ప్రజల నడ్డి విరిచారు. సరుకు రవాణా ఛార్జీలు 6.5శాతం పెంచారు. ఒకవైపు ప్రయాణీకులపై, మరోవైపు ఆర్థిక వ్యవస్థపైన తీవ్రప్రభావం పడేలా రవాణా ఛార్జీలను పెంచడం అత్యంత హేయమైన చర్య. నష్టాలలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను పునరుద్ధ రించకుండా వాటి వాటాలను విక్రయిస్తున్నారు. లాభాలలో ఉన్నటువంటి ప్రభుత్వరంగ సంస్థలను బడ్జెట్‌లోటును పూడ్చుకోవడానికి విక్రయించే విధానాన్ని కొనసాగిస్తూ, గతంలో పరిపాలించిన యుపిఏ కంటే రెట్టించిన విధంగా ఎన్డీయే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవర్తిస్తున్నారు.


రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణతో ప్రమాదం : మన దేశంలో సురక్షితంగా ఎంత దూరమైన గమ్యాన్ని చేర్చేది రైల్వే. ఈ రైల్వే లాభాలతో నడుస్తున్నది. లక్షలాదిమంది ఉపాధి ఉద్యోగాలు పొందుతున్నారు. రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణ మూలంగా భద్రత గాలికి వదిలేసినట్లవుతుంది. రైల్వే ఛార్జీలు తరచుగా పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతారు. రైల్వేప్రైవేటీకరణకు స్వస్తిపలకాలని ఉద్యోగులు, కార్మిక సంఘాలు ఆందోళనకు దిగుతున్నారు. రైల్వే స్టేషన్లను ప్రైవేటీకరించడమంటే 1.25 కోట్ల మంది సందపను అప్పన్నంగా కార్పొరేట్లకు కట్టబెట్టడమే. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రభుత్వపరంగా ఉంచాలి. రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణ కాకుండా అన్ని వర్గాల ప్రజలు -రైల్వే ఉద్యోగ, కార్మిక సంఘాలు పోరాటం ద్వారా అడ్డుకొని మోడీ దూకుడుకు చెక్‌పెట్టాలి.

✤ - దామరచర్ల నర్సింహారెడ్డి

మిషన్ నిధుల పేరుతో ఆర్టీసి ముక్కలు

రీషెడ్యూల్ ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసి లో విజయవాడ, విజయనగరం జోన్స్, అర్బన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ నెల్లూరు, కడప జోన్స్, అర్బన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్స్‌ను ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్.1, తేది.5.1.2015ను విడుదల చేసింది. నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ జోన్ అర్బన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్, కరీంనగర్ జోన్ అర్బన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్.నెం.2, తేది.20.1.2015ను విడుదల చేసింది.

భారత ప్రభుత్వ అర్బన్ డెవలప్ మెంట్ మంత్రిత్వశాఖ జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (JNNURM) పథకం 2013 క్రింద బస్‌ల కొనుగోలు కోసం మరియు అనుబంధ మౌలిక వసతుల ఏర్పాటు కోసం నిధుల విడుదలకు 2013లో మార్గదర్శకా లను విడుదల చేసింది. ఆ మార్గదర్శకాలలో 3.5 క్లాజు ప్రకారం పట్టణం చిన్నదైనా, విస్తరించబడుతున్న పట్టణాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, స్పెషల్ పర్పస్ వెహికిల్‌ను ఏర్పాటు చేయాలి. ఆ 'ఎస్‌పివి' నే ఆ ప్రాంతంలో స్టేజి క్యారేజిల పర్మిట్‌తో బస్సులను నడుపుతాయి. అలా ఎస్‌పివి లు ఏర్పాటు చేస్తేనే ఈ స్కీము క్రింద మొదటి విడత వాయిదాని కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది.



2014 ఫిబ్రవరిలో బోర్డు అనుమతి - ఎస్.డబ్ల్యు.ఎఫ్ ఆందోళన

ఆర్టీసిని 4 సబ్సిడరీ కార్పొరేషన్లను ఏర్పాటుకు ఫిబ్రవరి 11, 2014న జరిగిన బోర్డు సమావేశంలో అనుమతి తీసుకున్నారు. ఇలా ఎస్‌పివి లను ఏర్పాటు చేయడం అంటే ఆర్టీసి ని ముక్కలు చేయడం తప్ప మరొకటి కాదని ఆనాడు ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది.

కేవలం కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంటుపొందడానికే ఇలా ఎస్‌పివి లు ఏర్పాటు చేశామని, ఇవి కేవలం పేపర్‌పైన మాత్రమే వుంటాయని, ఇందులో ఎటువంటి దురుద్దేశం లేదని యాజమాన్యం నమ్మబలికింది. అయితే జెఎన్ఎన్‌యుఆర్ఎం నిధుల విడుదలకు నిర్దేశించిన లక్ష్యాలు, ఆర్థిక వనరుల ఏర్పాటు, స్కీములో వున్న షరతులను బట్టి చూసినట్లయితే, యాజమాన్యం చెబుతున్నది నిజం కాదని ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆనాడే చెప్పింది. కానీ ఎవరూ ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు.

జనవరి 30, 2014న అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన మీటింగ్ మినిట్స్‌ను (కె.14011/30/2013-యుటి-1) పరిశీలించి నట్లయితే, స్కీము నిబంధనల అమలు విషయంలో స్పందిస్తూ (ఐటెమ్ నెం.సి) డిపోల మరియు నూతన డిపో స్థలాలు గుర్తించబడ్డాయని, ఎస్‌పివి లను ప్రభుత్వం నోటిఫై చేసిన వెంటనే వాటిని బదలాయిస్తామని ఆ సమావేశంలో పాల్గొన్న ఆర్టీసి డైరెక్టర్ గారు సెలవిచ్చారు. అలాగే ఆర్థిక సంస్థ మధ్యవర్తిత్వం గురించితెలియచేస్తూ జెఎన్ఎన్‌యుఆర్ఎం బస్‌ల కోసం గతంలో వున్న ఒప్పందాన్ని ఎక్స్‌టెన్షన్ చేయడానికి హడ్కో బ్యాంక్ అంగీకరించిందని తెలియజేశారు. అలాగే ఐటెమ్ నెం.(ఎఫ్) లో అర్బన్ ట్రాన్స్‌పోర్టులో చేయాల్సిన సంస్కరణపై చర్చ జరిగింది. ఐటెమ్ నెం.(జి) లో రూట్స్ గురించి చర్చ జరిగింది. ఈ అర్బన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ల పరిధిలో నడపాల్సిన రూట్లను గుర్తించామని, బస్‌లు వచ్చిన తర్వాత రూట్ పర్మిట్స్ తీసుకుంటామని తెలియజేశారు. ఇటువంటివే మరికొన్ని విషయాలపై ఆనాడు అంటే నాలుగు కార్పొరేషన్ల ఏర్పాటుపై బోర్డు అనుమతి తీసుకోకముందే కేంద్ర ప్రభుత్వం ముందు ఇన్ని విషయాలపై వివరణ ఇస్తే, మన అధికారులు మాత్రం అబ్బా! అంతా ఉత్తిదే! ఇది మనకు డబ్బులు కోసమేనని కార్మికుల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేసిందని మనకు అర్థం అవుతుంది.

మన డబ్బులతో బస్‌లు కొనలేమా?

4.9.2014న కేంద్ర సెంట్రల్ శాంక్షనింగ్ మోనిటరింగ్ కమిటి (సిఎస్ఎంసి) 13వ మీటింగ్ ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి సంబంధించి మన సంస్థ ఎం.డి. గారు వీడియా కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఈ సమావేశంలో అర్బన్ ట్రాన్స్‌పోర్టు సెక్రటరీ, అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రెటరీ మాట్లాడుతూ అర్బన్ ట్రాన్స్‌పోర్టులో ప్రైవేటు, పబ్లిక్ పార్టిసిపేషన్ (పిపిపి) ల ఇన్‌వాల్వ్‌మెంట్ గురించి ఒత్తిడి చేశారని పేరా నెం. 5లో రికార్డు చేయబడింది. అంటే పట్టణ ప్రాంత రవాణాను ప్రైవేటు భాగస్వామ్యం గురించి మాట్లాడటమనేగా అర్థం.

జెఎన్ఎన్‌యుఆర్ఎం మొదటి విడత సందర్భంగా కేంద్రం తన వాటా క్రింద రూ.146.65 కోట్లు ఇస్తే అందులో 60% గ్రాంటుగాను, 40%లోను గాను రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తానుగా ఆ స్కీముకు ఇవ్వాల్సిన 15%

డబ్బును రూ.54.82 కోట్లు ఇవ్వలేదు. దీని ఫలితంగా మొత్తం ఆర్టీసి భరించాల్సిన 50% + రాష్ట్ర ప్రభుత్వం వాటా 15%+ కేంద్రం నుండి అప్పుగా ఇచ్చిన డబ్బులు మొత్తం కలిపి సుమారు ప్రాజెక్టు మొత్తం (59+55+151 కలిపి) రూ.265 కోట్లు ఆర్టీసి భరించాల్సి వచ్చింది. అంటే ప్రాజెక్టు ఖర్చులో 74% ఆర్టీసి భరించింది. పైగా అన్ని డబ్బులు భరించి కేంద్రం పెట్టిన నిబంధనలను మనం అంగీకరించాల్సిన అవసరం ఏమిటి? ఈ అనుభవం వున్నప్పటికి మనం ఎటువంటి గుణపాఠం తీసుకోకుండా మరలా రెండవ ప్రాజెక్టును అంగీకరించడం వివేకమైన పనేనా? ఆలోచించాలి.

సంస్కరణల అమలుకునిర్దేశించిన లక్ష్యాలు - ఎవరికి ప్రయోజనం

ఆగస్టు 2013న విడుదల చేసిన గైడ్‌లైన్స్‌లో సెక్షన్ 13లో అర్బన్ ట్రాన్స్‌పోర్టులో తీసుకురావలసిన వివిధ రకాల సంస్కరణలు, అవి అమలు చేస్తే ఇచ్చే పాయింట్ల స్కోరును పొందుపరచారు. బస్సుల శాంక్షన్‌కు పేరా 13.1 ఖచ్చితంగా అమలు చేయాలని, అందులో నిర్దేశించారు. 13.2లో రాష్ట్ర స్థాయి సంస్కరణలకు నిర్దేశించారు. 13.2.1 లో అర్బన్ ట్రాన్స్‌పోర్టును డీల్ చేయడానికి సింగిల్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలి. భూమి వినియోగం కూడా ఈ సంస్థనే డీల్ చేయాలి. ప్లానింగ్, సమన్వయం, మానిటరింగ్, పర్యవేక్షణ చేయడానికి ఒక 'గొడుగు సంస్థ'ను ఏర్పాటు చేయాలని 13.2.2 పేరా నిర్దేశిస్తున్నది. 13.2.3 పేరాలో 10 లక్షలపైన జనాభా వున్న పట్టణంలో 'యునిఫైడ్ మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటి'ని ఏర్పాటు చేయాలని ఈ పేరాలో నిర్ణయించారు. అర్బన్ ట్రాన్స్‌పోర్టు ఫండును ఏర్పాటు చేయాలని, పెట్రోల్‌పైన అదనపు సేల్స్ టాక్స్ విధింపు, 4 చక్రాలు, ద్విచక్ర వాహనాలుపైన అదనపు రిజిస్ట్రేషన్ ఫీజు వేయాలని, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ ఫీజును పెంచడం మరియు గ్రీన్ టాక్స్ విధింపు ద్వారా ఈ అదనపు ఫండు సమకూర్చాలని పేరా నెం.13.2.4 లో నిర్దేశించారు. ఆటోమేటిక్ ఫేర్ రివిజన్ కోసం ఓ రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయాలని, ఇంధన ధరలు, విడి భాగాలు మరియు మానవ వనరులపై పెట్టే ఖర్చు పెరిగినప్పుడల్లా టిక్కెట్ ధరలు పెంచుకొనేందుకు అవకాశం కల్పించాలని పేరా నెం.13.2.6 నిర్దేశిస్తున్నది. అర్బన్ మరియు సిటి బస్‌లపై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న పన్ను మరియు వ్యాట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రీ-ఎంబర్స్ చేయాలని పేరా నెం.13.2.7లో తెలియజేశారు. పేరా నెం. 13.3 మొత్తం కూడా పట్టణ స్థాయి సంస్కరణలు నిర్దేశించారు. ఇందులో పార్కింగ్ ఫీజు అనేది ఆ పార్కింగ్ స్థలం నిజ వాల్యూకు తగ్గట్టుగా వుండాలనేది 13.3.4 పేరాలో నిర్దేశించారు. వీటన్నింటిలో ఏది అమలు చేస్తే ఎన్ని పాయింట్లు ఇస్తారో కూడా తెలియజేశారు. ఇవన్నీ కూడా నేరుగా ప్రజలపైన భారాలు మోపేవేనని అర్థమవుతుంది. అలాగే ఇవన్నీ అమలయితే ప్రజలు మన బస్‌ల దగ్గరకు కూడా రాని పరిస్థితులు ఏర్పడతాయి. మరి మనం ఈ కండీషన్స్‌ను ఒప్పుకొని నిధులు తీసుకొచ్చు కునేది ఎవరి ప్రయోజనం కోసం ?

UMTA ఏర్పాటు ప్రమాదం

పేరా నెం. 13.2.3 లో యునిఫైడ్ మెట్రో పాలిటిన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీని ఏర్పాటు చేయాలని నిర్దేశించిన విషయం చూశాం. భారతదేశంలో మొదటి UMTA హైదరాబాద్‌లో ఏర్పాటయింది. మన రాష్ట్రంలో 2008 నుండి ఇది పని చేస్తుంది. రాష్ట్ర విభజన జరిపిన అనంతరం హైదరాబాద్ నగర ఆర్టీసిని UMTA కి అప్ప చెబుతారని, తద్వారా హైదరాబాద్ నగర రవాణా అంతా జి.హెచ్.ఎం.సి. చేతుల్లోకి వెళ్తుందని పత్రికలలో వార్తలు వచ్చాయి. ఆ వార్తల పట్ల ఆర్టీసి కార్మికులలో ఆందోళన వ్యక్తమైంది. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం రోడ్ ట్రాన్స్‌పోర్టు & సేఫ్టీ బిల్లు - 2014 ను సెప్టెంబర్ 13న విడుదల చేసింది. ప్రజల నుండి కొన్ని విజ్ఞప్తులు వచ్చాయని ముసాయిదాలో కొన్ని మార్పులు చేసి, ఆర్టీఎస్ బిల్లు - 2014, రెండవ వెర్షన్‌ను డిశంబర్‌లో నెట్‌లో పెట్టారు. జనవరి 31న మూడవ వెర్షన్‌ను పెట్టారు. వచ్చే పార్లమెంటు సమావేశాలలో దీనిని పార్లమెంటులో పెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ బిల్లులో ప్రతిపాదిత రెండవ వెర్షన్‌లో నేషనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటి, స్టేట్ ట్రాన్స్‌పోర్టు అథారిటీలతో పాటు యునిఫైడ్ మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీని కూడా ఒక స్వతంత్ర సంస్థగా ప్రతిపాదించారు. దీనికి పాలకమండలి వుంటుంది. టిక్కెట్ ధరలు, రూట్ పర్మిట్స్ వంటి అధికారాలన్ని ఈ సంస్థకు ఉంటాయి. రేపు ఈ బిల్లు పార్లమెంటులో పాసయితే మొట్టమొదటగా మన 'గ్రేటర్ హైదరాబాద్ జోన్' మొత్తం UMTA చేతిలోకి వెళ్ళిపోతుంది. ఈ ప్రమాదాన్ని ఎవరూ గుర్తించడం లేదు.


కర్తవ్యం ఏమిటి ?

తెలుగు రాష్ట్రం రెండు రాష్ట్రాలయింది. రేపో, మాపో రెండు ఆర్టీసిలు ఏర్పడతాయి. అవి ఏర్పడకముందే ఆంధ్రాలో, తెలంగాణాలో రెండు అర్బన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్స్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వాలు నోటిఫికేషన్ ఇస్తూ జి.ఓ. లను విడుదల చేశాయి. ఆర్‌టిఎస్ బిల్లు చట్ట రూపం ధరిస్తే హైదరాబాద్ ఆర్టీసి మొత్తం UMTA చేతుల్లోకి పోతుంది. అంటే దేశంలో అతిపెద్ద సంస్థ అయిన ఎపిఎస్ ఆర్టీసి 5 ముక్కలు అయిపోయి బలహీనపడ్తుంది. అంతేకాక సంస్కరణల అమలు వల్ల ప్రజలపై తీవ్రమైన భారాలు పడతాయి. ఫలితంగా ప్రజలు ఆర్టీసి లకు దూరమవుతారు. కావున పరిమితమైన ప్రయోజనాల కోసం కార్మికులకు నష్టం కలిగించే, ప్రజలపై భారాలు మోపే సంస్కరణలను వెనక్కి నెట్టి ప్రజా రవాణాను పటిష్టపరచడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసిలను ఆర్థికంగా బలోపేతం చేయాలి. ఈ వైపు ప్రజలు కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి. ఇదే నేటి తక్షణ కర్తవ్యం.


- వి.ఎస్.రావు

✤ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఎస్‌డబ్ల్యుఎఫ్

అవినీతి, మత రాజకీయాలకు సామాన్యుని చీపురుదెబ్బ




'ఆమ్ ఆద్మీ పార్టీ' చరిత్ర సృష్టించింది. 70 సీట్లున్న అసెంబ్లీలో ఏకంగా 67 స్థానాలను దక్కించుకుంది. ఢిల్లీలో గద్దెనెక్కింది. దేశాన్ని ఏలుతున్న బిజెపి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడింది. 'మిషన్44' సంగతి పక్కన పెడితే... రెండంకెల సీట్లూ దక్కించుకోలేక... మూడంటే మూడు స్థానాలకు పరిమిత మైంది. సాంకేతికంగా చూస్తే విపక్ష హోదాకూ అర్హతలేకుండా పోయింది...



ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి మూడంకే వేయగా, గతంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ముమ్మారు గెలిచి, 15 ఏళ్లు పాలించిన కాంగ్రెస్‌కు నిండా 'సున్నం' పడింది. ఒక్కటంటే ఒక్క సీటూ గెలవలేక... శూన్య 'హస్తం' మిగుల్చుకుంది. తగిన ప్రత్యామ్నాయ దొరికితే... ప్రత్యామ్నాయ పార్టీలకు, ప్రత్యామ్నాయ శక్తులకు పట్టం కంట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టమైంది. అవును... 'సామాన్యుడే' గెలిచాడు. గల్లీగల్లీలో ఉన్న సామాన్య ప్రజలంతా ఏకమైన ఢిల్లీ ఎన్నికల్లో తమను తాము గెలిపించుకున్నారు. విస్తృత ప్రచారాలను తిప్పికొట్టారు. బెదిరింపుల్ని ఎదిరించారు. అహంకార పూరిత ధోరణి రాజకీయాలను మట్టి కరిపించారు. అరవింద్ కేజ్రీవాల్ ఘన విజయం సాధించారు. 'చీపురు'తో ఢిల్లీ ఎన్నికల బరిని 'క్లీన్ స్వీప్' చేసేశారు. ఏకంగా 95శాతం సీట్లు సొంతం చేసుకున్నారు. ది.7.2.2015న జరిగిన ఎన్నికల ఫలితాలు ది.10.2.2015న వెలువడ్డాయి. ఉదయం 8గంటలకు కౌంటింగ్ మొదలైంది. ఫలితాల సరళి ఆది నుంచీ ఆప్‌కు అనుకూలంగా వచ్చింది. చూస్తుండగానే ఆప్ విజయపతాక అలా అలా ఎగిరింది. ఆధిక్యంలో ఉన్న స్థానాల సంఖ్య... 20, 30, 40, 50 వరకు దూసుకు పోయింది. అంతా 'అయ్య బాబోయ్' అనుకుంటుండగానే, ఆప్ నేతలే సంభ్రమాశ్చర్యాలకు గురవుతుండగానే.. గెలుపు సూచీ 67 వద్ద ఆగింది. గతంలో సిపిఐ(ఎం) త్రిపురలో 60కి 54 సీట్లు గెలుచుకున్నది. 1982 లో 'సిక్కిం సంగ్రామ్ పరిషత్' సిక్కింలోని మొత్తం 32 స్థానాలను దక్కించుకుంది. ఇప్పటిదాకా ఇదే చరిత్ర! మళ్ళీ ఇప్పుడు ఆప్‌ది మరో చరిత్ర!

2014 పార్లమెంట్ ఎన్నికలలో మోదీ, ఆయన పార్టీకి లభించిన ఘనవిజయం దేశంలో సామరస్య జీవన విలువలకు భంగం కలిగిస్తున్నది. ఉన్మాదశక్తులు పెట్రేగిపోయి దేశ రాజకీయాలు మతతత్వీకరించబడుతున్నాయి. దేశ భవిష్యత్ గురించి ఆందోళనలో ఉన్న ప్రజానీకానికి ఈ ఎన్నికల ఫలితాలు భవిష్యత్తుపై ఆశ కల్పిస్తున్నాయి. కొత్త శక్తులతో రాజకీయ ప్రత్యామ్నాయం సాధ్యమేనని ఢిల్లీ పరిణామం నమ్మకం కలిగిస్తున్నది. ప్రజల సమస్యల పరిష్కారాన్ని మించిన ఎజెండా



పార్టీలకు మరొకటి ఉండదని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్రమోడీకి అఖండ విజయాన్ని చేకూర్చిపెట్టిన ఢిల్లీ వాసులు ఏడాది కూడా గడవక ముందే ఒక సామాన్యుడి పక్షాన ఎందుకు నిలబడ్డారో బిజెపి అంతర్మథనం చేసుకోవాలి.

వెయ్యి గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలి వానకే ఒరిగిపోయిందని సామెత. ఢిల్లీ ఎన్నిక ఫలితం ఆ సామెతను ఇంత గొప్పగా నిరూపిస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. అనుకూల మీడియా దన్నుతో అపారమైన కార్పొరేట్ అర్థబలం, ఆర్ఎస్ఎస్ అంగబలం అండతో మోడీ అజేయుడు, అప్రతిహతుడు అంటూ బిజెపి శ్రేణులు కొన్ని మాసాలుగా అదే పనిగా ఊదరగొడుతూ వచ్చాయి. అటువంటి మోడీ అజేయుడు, అప్రతిహతుడు కాదని దేశ రాజధానిలో సామాన్యపౌరుడు ఈ ఫలితం ద్వారా చాటిచెప్పాడు. అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వం లోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దే అధికారం అని ఎగ్జిట్ పోల్స్ ముక్తకంఠంతో తేల్చి చెప్పినా, డెబ్బై సీట్లలోనూ ఏకంగా 67 స్థానాలను అది కైవసం చేసుకోవడం అనూహ్యమూ, అసాధారణమే. నిన్న గాక మొన్న లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి మెజారిటీ సాధించడమేగాక, మహారాష్ట్రతో మొదలుపెట్టి జార్ఖండ్ వరకు శాసనసభ ఎన్నికలలో వరస విజయాలను సాధిస్తూ వచ్చిన బిజెపి మూడే మూడు స్థానాలకు కుదించుకుపోయి, పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిన కాంగ్రెస్ సరసన చేరడమూ అంతే అసాధారణం. ఢిల్లీలో మత ప్రాతిపదికపై జనాన్ని చీల్చడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం లేదు. హిందూ – ముస్లింల మధ్య కుంపటి రాజేసే ప్రయత్నం చేసింది. హిందూ ఓటును సమీకరించి ఎన్నికల్లో లబ్ధి పొందుదామనుకుంది. కానీ ఇవేమీ పనిచేయలేదు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాల వల్ల పెరిగిన ధరలు వగైరాలతో సామాన్య ప్రజానీకంలో అసంతృప్తి, ఆగ్రహాలు తారాస్థాయికి చేరి ఢిల్లీ ఎన్నికల్లో బిజెపిని పాతాళ మట్టానికి పడదోశాయి. ఢిల్లీ ఓటర్ల తీర్పు కేంద్ర పాలకులకు ఒక తిరుగులేని హెచ్చరిక.

అభివృద్ధి పేరుతో సంపన్న, కార్పొరేట్ వర్గాలకు మేలుచేసే విధానాలతో ఆకాశ విహారమే తప్ప క్షేత్ర వాస్తవాలను పట్టించుకునే స్థితిలో మోడీ నాయకత్వం లేదనడానికి ఇది సాక్ష్యం. వరస విజయాలతో అలవిమాలిన అహం, అతిశయం, ఆడంబరం, మితిమీరిన ఆత్మవిశ్వాసం బిజెపి కళ్లు కప్పేశాయి. మోడీ హవా కొనసాగుతోంది కనుక గడ్డిపరకను నిలబెట్టినా గెలుపు తథ్యమన్న భ్రమల్లో మునిగితేలింది. తీరా ఢిల్లీ బరిలోకి దిగిన తర్వాత కానీ తాము ప్రవాహానికి ఎదురీదుతున్న సంగతి దానికి తెలిసిరాలేదు. మోడీ జపం ఈసారి గట్టెక్కించలేదని, స్పందన లోపించిన ఆయన తొలి ర్యాలీతోనే తేలిపోయింది. ఇక అప్పటి నుంచి ఢిల్లీ ఎన్నికలను ఆ పార్టీ జాతీయ ఎన్నికల స్థాయికి పెంచుతూ గెలవడమే ఏకైక లక్ష్యంగా దిగజారని లోతులు లేవు. అమలు చేయని కుయుక్తులు లేవు. ఓటమిని పసిగట్టి చివరి క్షణాల్లో కిరణ్ బేడీని తెరమీదికి తేవడం ద్వారా మోడీని అప్రతిష్ట నుంచి తప్పించి ఆమెను బలిపశువును చేయడానికి సిద్ధపడింది. కేంద్ర మంత్రివర్గం మొత్తాన్నీ, సగం మంది పార్టీ ఎంపీలనూ, వందల కోట్ల ధనాన్నీ, అంగబలాన్నీ ఎన్నికల బరిలో మోహరించింది. నెగిటివ్ ప్రచారాన్ని హద్దులు దాటించింది. ఈ ఎన్నికలు మోడీ ప్రతిష్టపైన, ప్రభుత్వంపైన రెఫరెండం అనే అభిప్రాయాన్ని తనే అడుగడుగునా కలిగించింది.

ఇందుకు భిన్నంగా ఆమ్ ఆద్మీ పార్టీ క్షేత్ర సమస్యలకు, పేద వర్గాలకు దగ్గరగా ఉంటూ గత కొన్ని మాసాలుగా నిశ్శబ్దంగా జనాదరణను కూడగట్టుకుంటూ వస్తోంది. కిందటిసారి తను చేసిన తప్పులకు ఆ పార్టీ చెప్పిన క్షమాపణను ప్రజలు మన్నించారు. మంచినీరు, విద్యుచ్ఛక్తి ఛార్జీల తగ్గింపు వంటి హామీలతో పేదలపై భారాన్ని తగ్గించే అజెండాను ఆ పార్టీ ముందుకు తెచ్చింది. అందుకు భిన్నంగా బిజెపి పేదలపై భారాన్ని పెంచే దుర్విధానాలతో వారికి దూరమైంది. ఆపైన, ఆ పార్టీ మతతత్వ విషపూరిత విద్రోహ చర్యలు బడుగువర్గాలనే కాక, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకు కూడా ఏవగింపును కలిగించాయని ఓటింగ్ సరళి నిరూపిస్తోంది. గత తొమ్మిది నెలల స్వల్ప కాలంలోనే మోడీ పాలన పట్ల యువతలోనూ భ్రమలు చెదిరాయి. బిజెపి నేతలు ఇప్పుడు అట్టు తిరగేసి ఇది కేవలం స్థానిక ఎన్నిక అనీ, మోడీ పాలనపై రిఫరెండం కాదనీ అంటున్నప్పటికీ ఇది నిస్సందేహంగా మోడీ పాలనపై రిఫరెండమే. ఢిల్లీ ఎన్నికను తన ప్రతిష్టతో ముడిపెట్టుకుని మోడీ చేసిన ప్రసంగాలే ఇందుకు సాక్ష్యం. గుజరాత్‌లో ఓటమి ఎరుగని నేతగా ముద్రపడిన మోడీకి ఇది గణనీయమైన తొలి ఓటమి. తను 41 ఎన్నికలలో ప్రచారానికి సారథ్యం వహించాననీ, ఒక్కటి కూడా ఓడిపోలేదనీ చెప్పుకున్న అమిత్ షా అతిశయానికి కూడా తూట్లు పొడుస్తున్న ఓటమి ఇది. ✤

సిరిజా పార్టీ విజయ ప్రాధాన్యత - ప్రపంచ మీడియా స్పందన

గ్రీసు ఎన్నికలలో వామపక్ష సిరిజా పార్టీ విజయంపై మిశ్రమ స్పందన వ్యక్తమౌతోంది. మూడు వందల స్థానాలున్న పార్లమెంట్‌లో 149 సీట్లను పొందిన ఆ పార్టీ మితవాద గ్రీక్ ఇండిపెండెంట్ పార్టీతో కలిసి సంకీర్ణ మంత్రి వర్గం ఏర్పాటు చేయటాన్ని కొందరు గ్రీస్ భూకంపంగా వర్ణించారు. ప్రపంచంలోని కొన్ని కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు, అభ్యుదయ శక్తులు దాని పనితీరును వేచి చూసే ధోరణితో ఉన్నాయి. రాబోయే రోజులలో వాటి స్పందనలు, విశ్లేషణలు వెలువడతాయి. ఇప్పుడున్న స్థితిలో పొదుపు చర్యల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్న నయా ఉదారవాద విధానాల వ్యతిరేక పోరాట శక్తులకు ఈ విజయం ఎంతో ఊపునిస్తుంది. ఆ నినాదంతో ఐరోపాలో ఒక వామపక్ష పార్టీ అధికారంలోకి రావటంపై ప్రపంచం మొత్తం మీద హర్షం వ్యక్తమౌతోంది. ఒకవైపు ఎట్టి పరిస్థితుల్లోనూ పొదుపు చర్యలను వెనక్కు తీసుకొనేందుకు ఐరోపా యూనియన్, ఐరోపా సెంట్రల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అంగీకరించటం లేదు. మరోవైపు ఉపసంహరించి తగిన ఉపశమనం కలిగించకపోతే జనం ఊరుకోరు. ఈ నేపథ్యంలో సిరిజా తాను వాగ్దానం చేసిన అంశాలను ఎలా అమలు జరుపనుందా అని అభ్యుదయ శక్తులతో పాటు పెట్టుబడిదారులు కూడా ఎదురు చూస్తున్నారు. సిరిజా పార్టీ తనకు అవసరమైన సంపూర్ణ మెజారిటీ కోసం పొదుపు చర్యలను వ్యతిరేకించే ఒక్క కారణం తప్ప మిగతా అంశాలలో పొసగని మితవాద గ్రీక్ ఇండిపెండెంట్ పార్టీతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. పదిహేను స్థానాలున్న కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలకు ముందే సిరిజాతో సంకీర్ణ కూటమికి వ్యతిరేకతను వ్యక్తం చేసింది. దాంతో విధిలేక మితవాద పార్టీతో జతకట్టారని సమర్థిస్తున్న వారు కొందరు. ఏమైనా రానున్న రోజులలో పర్యవసానాలు ఎలా ఉంటాయనేది చూడాల్సి ఉంది. ప్రధాన స్రవంతిలోని పెట్టుబడిదారీ అనుకూల మీడియా వ్యక్తం చేసిన కొన్ని స్పందనలు ఎలా ఉన్నాయో చూద్దాం.

న్యూయార్క్ టైమ్స్ (అమెరికా) : ఐరోపాలో సిరిజా విజయం ఒక మైలురాయి. కొనసాగుతున్న ఆర్థిక బలహీనత ఫ్రాన్స్ నుంచి స్పెయిన్ మరియు ఇటలీ వరకు ప్రజా ప్రతిక్రియను పురికొల్పింది. రుణదాతల డిమాండ్లను నెరవేర్చటానికి ఎన్నో త్యాగాలు అవసరమైన విధానాలతో విసిగిపోయే ఓటర్లు పెరుగుతున్నారు. ఎందుకంటే అవి మరిన్ని ఉద్యోగాలు, సంపదలను సృష్టించటం లేదు.

ఫైనాన్షియల్ టైమ్స్ : ఇప్పుడు సిరిజా విజయం సాధించింది ఎవరు కళ్లు మిటకరిస్తారు? గ్రీస్ రుణదాతలు మిటకరిస్తే దాని ప్రత్యక్ష ప్రమానము యూరోజోన్‌లో పేద దేశాలలో ఆర్థిక సాయం గురించి ఆశలు రేపుతుంది. ధనిక ప్రాంతంలో ఆతృత పెరుగు తుంది. ఈ పరిస్థితి రాజకీయ ఐక్యత పెరుగుదలకు తోడ్పడదు. గ్రీస్ తన ఆర్థిక పునరుద్ధరణ కార్యక్రమాన్ని బోసిపోయేట్లు చేస్తే యూరోజోన్‌లోని పేద, ధనిక దేశాల మధ్య ప్రమాదకరమైన రాజకీయ పర్యవసానాలతో కూడిన అపోహలు తీవ్రం అవుతాయి. సిరిజా ఒక ముఖ్యమైన విజయం సాధించింది. అయితే ఐరోపా అస్థిరతలో నూతన అధ్యాయానికి ఇది కేవలం ప్రారంభం మాత్రమే.

వాషింగ్టన్ పోస్ట్ (అమెరికా) : చారిత్రాత్మక ఎన్నికలో సిరిజాను ఎన్నుకోవడం ద్వారా గ్రీకులు పొదుపు చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు నొక్కి చెప్పారు. పురాతన గ్రీకు దేవత చిత్రాలతో కూడిన ఏథెన్స్ దేవాలయ ప్రాంతం నుంచి హరిత అలలతో అలరారే దీవుల వరకు మిలియన్ల మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి మిగతా ఐరోపాతో గ్రీసును సంధింప చేసే తీవ్రవాద వామపక్ష పార్టీ అయినా సిరిజాకు చారిత్రాత్మక విజయాన్ని చేకూర్చారు. ఊహించిన సంఘర్షణ ఇప్పటికే గ్రీక్ ఆర్థిక మార్కెట్లను గడగడ లాడించాయి. ఐరోపా కరెన్సీ యూనియన్ ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్యమైన సూత్రాన్ని సవాలు చేయవచ్చు.

గార్డియన్ (బ్రిటన్) : సిరిజా చారిత్రక విజయం ఐరోపాతో సంఘర్షణకు గ్రీసును నెట్టింది. ఆవిరైపోతున్న ఆర్థిక వ్యవస్థలకు ఐరోపా ప్రతిస్పందనపై తిరుగులేని నష్టదాయక ప్రజా తీర్పు ఐరోపా రాజకీయ కులీనులపై భూతంలా వెంటాడే ప్రభావం కలిగిస్తుంది. ఐరోపా అంతటా తమ ప్రత్యర్థులైన తీవ్ర మితవాదుల మాదిరి ఐరోపా వ్యతిరేకులు కానప్పటికీ బ్రసెల్స్, బెర్లిన్‌ను తీవ్రంగా వ్యతిరేకించే ప్రజాకర్షకులకు తొలిసారిగా అధికారాన్ని అప్పగించారు. తొలిసారిగా ఐరోపా యూనియన్ సంక్షోభపు బిడ్డ, స్పష్టమైన పొదుపు వ్యతిరేక పార్టీ ఐరోపా యూనియన్ లో అధికారాన్ని స్వీకరిస్తోంది.

డై జెయిట్ (జర్మనీ) : ఇప్పుడు ఎన్నిక విజయం సాధించింది. కథలు చెప్పే ప్రచారం అయిపోయింది మరియు అలెక్సి సిప్రాస్ గ్రీకు ప్రభుత్వంలోకి రావటం నిజమైంది. చివరికి ఎవరితో సంకీర్ణ కూటమి కడతారన్నది ప్రధానం కాదు, ఒకటి మాత్రం స్పష్టం, సిప్రాస్‌కు తక్షణమే డబ్బు కావాలి.

కొరెయో ద మానహ (పోర్చుగల్) : ఆశతో గ్రీకులు పెట్టిన ఒక కేక సిరిజా విజయం రూపంలో ప్రతిధ్వనించింది. అంతేకాదు ఐరోపా బ్లాక్‌మెయిల్ మరియు కబ్జా నుంచి స్వేచ్ఛ కోసం మోగించిన భేరీ కూడా.

ది టైమ్స్ (ఐర్లండ్) : పెద్ద జూదమిది, అయితే రెండు పక్షాలకూ గట్టి చేతులున్నాయి. ఒక్క గ్రీసుకే గాక మొత్తం యూరోజోన్‌కు సైతం సిరిజా విజయాన్ని నిర్ద్వంద్వంగా నిర్ధారించిన క్షణమిది. ఆరు సంవత్సరాల మాంద్యం, 25 శాతం నిరుద్యోగం, 50శాతం యువ నిరుద్యోగులు, పడిపోతున్న వేతనాలు, నిరంతరాయంగా పడిపోతున్న జీవన ప్రమాణాలు గ్రీసు పౌరులు భరించలేనివి. మీరిక తగ్గండి, ఇంతకంటే తమ చేత ద్వారా మొత్తం యూరో పథకం ఉనికి పైనే వారు ప్రశ్నలు సంధించారు.


ఎల్‌పాయిస్ (స్పెయిన్) : వామపక్ష పొడెమాస్ విషయానికి వస్తే సిరిజాను అది తమ సోదర పార్టీగా పరిగణిస్తుంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో జరుగనున్న ఎన్నికలలో స్పెయిన్ యార్థులు కూడా అదే మాదిరి ఓటు చేస్తారన్న నమ్మకానికి బలం చేకూర్చే విధంగా గ్రీక్ ఫలితాలు ఉన్నాయి.

వాల్‌స్ట్రీట్ జర్నల్ (అమెరికా) : పొదుపుపై ఐరోపా చర్చను గ్రీక్ ఎన్నికలలో సిరిజా విజయం అడుగు మట్టిని కూడా పైకి తీసినట్లయింది. యూరోజోన్ అంతటా వామపక్ష పార్టీ విజయం ప్రజాకర్షక ఉద్యమాలను గట్టిపరచనుంది. ఐదు సంవత్సరాలుగా తమ ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం రాజ్యాల పాత్ర కుదింపు మరియు మార్కెట్లపై నియంత్రణ ఎత్తివేయటం లేదా ఆర్థిక మరియు ద్రవ్య విధానాలను మరింతవిస్తృతపరచటంలో ఉందా అన్న జగడంలో ఐరోపా ఉమ్మడి కరెన్సీ కూటమి ఉంది. యుద్ధం ఇప్పుడే పెద్దది అవుతున్నది. బయటపడే మార్గం కొద్దిగా కూడా కనిపించటం లేదు.

✤

- ఎంకెఆర్

కావలివాని కల(లు)



విజయాదిత్య మహారాజు విజయనగర సామ్రాజ్యాన్ని జన రంజకంగా పాలించేవాడు. చుట్టుపట్ల రాజ్యాలను జయించి, ఆయా రాజులను తన సామంతులుగా చేసుకున్నా, సామంత రాజులని కూడా గౌరవంగా చూసేవాడు. అయినప్పటికీ వాళ్లల్లో కొందరు ఆయన పట్ల శత్రుత్వ భావం కలిగి, ఆయనను అంతమొందించటానికి రకరకాల కుయుక్తులు పన్నేవారు. వాటనన్నింటిని ఆయన మంత్రి సుబుద్ధి ఛేదించి, రాజుగారిని కంటికి రెప్పలా కాపాడేవాడు.

అలా ఉండగా, ఒక రోజు, రాజుగారి అంతఃపురంలో ఆయనగారి ముందు రాత్రుళ్లు కావలి ఉండే బాహుబలి అనే అతను రాజు గారిని దర్శించి, "అయ్యా! తమ గదిలోకి ఒక తాచుపాము వచ్చి, తమరిని కాటేసినట్లుగా గతరాత్రి నాకు కలవచ్చింది. సామాన్యంగా నాకు వచ్చిన కలలు నిజమవుతుంటాయి. ఎందుకైనా మంచిది తమరు అనుమతిస్తే తమ గదిని క్షుణ్ణంగా వెతుకుతాము" అని విన్నవించాడు.

"సరే చూద్దాం అతని కలలోని నిజమెంతో" అని రాజు గారు అనుమతించాడు.

ఆ గది అంతా నిశితంగా పరీక్షించాక రాజుగారి మంచం కింద ఒక చిన్న బొరియలో ఒక పాము దొరికింది. ఆ తర్వాత అది శత్రువు పన్నాగమే అని తెలిసింది. దాంతో రాజుగారు తన ప్రాణాలను కాపాడిన బాహుబలిని ఘనంగా సన్మానించాడు.

ఆ తర్వాత కూడా బాహుబలి తన కలల ఆధారంగా రాజు గారిని రక్షించాడు రెండుసార్లు.

ఇదంతా తెలిసిన మంత్రి సుబుద్ధి, మూడవసారి బాహుబలి రాజు గారిని రక్షించగానే అతనికి కొంత బహుమతి ఇచ్చి, అతణ్ని ఆ ఉద్యోగంలోంచి తొలగించి, వీరమల్లు అనే అత్యంత విశ్వాస పాత్రుణ్ని అతని స్థానంలో నియమించాడు.

బాహుబలి వెళ్లి రాజుగారికి మొరపెట్టుకున్నాడు. రాజుగారు మంత్రిని "బాహుబలిని పనిలోనుంచి ఎందుకు తొలగించారు?" అని అడిగాడు.

"అయ్యా! శత్రువులతో మీకు ఎప్పుడు కీడు కలుగుతుందో తెలియదు. మిమ్మల్ని అనుక్షణం రక్షించాల్సిన కావలివాడు నిద్ర పోతూ కలలు గంటూ ఉంటే మీకు రక్షణ ఏముంటుంది? అతని ఉద్యోగం తెల్లవార్లూ మేలుకుని ఉండి మిమ్మల్ని రక్షించడం కాని, నిద్రపోవటం కాదు. అందుకే అతణ్ని తొలగించాను" అన్నాడు.

బాహుబలి సిగ్గుతో తలదించుకున్నాడు.

రాజు, మంత్రిని ప్రశంసించాడు. ✤

సూక్తులు

"ఇతరులలో ఉండే చెడు మీద దాడి చేయటం కంటే ముందు నీలో ఉన్న చెడును తరిమివేయడానికి ప్రయత్నించు"
– కన్ఫ్యూషియస్


"కాలక్షేపం కోసం సమయం వృధా చేయకు" – మహాత్మాగాంధీ

"భయం తలుపు తట్టినప్పుడు ఆత్మవిశ్వాసాన్ని మేల్కొలపాలి. అప్పుడు భయం పారిపోతుంది" – మార్టిన్ లూథర్ కింగ్

"అనారోగ్యానికి వ్యతిరేకంగా వైద్యుడే కాదు, రోగి కూడా పోరాటం చేయాలి" – హిపోక్రేట్స్

"నిజం ఒక ఆయుధం. ఉపయోగించాల్సిన సమయంలో తడబడితే మనల్నే వధిస్తుంది" – కన్ఫ్యూషియస్

అంతిమ ఘడియలు



వియన్నా నగర శివారు. 1786లో ఒక శీతాకాల సంధ్యా సమయం. చిన్న ఇల్లు. నిజం చెప్పాలంటే అది ఇల్లు కూడా కాదు. శిథిలమైపోయిన గుడిసె. తోట మధ్యలో ఉంది. అందులో ఒక వృద్ధుడు మరణావస్థలో ఉన్నాడు. ఒకప్పుడుతను తూన్ అనే జమీందారిణి దగ్గర వంటవాడుగా పనిచేశాడు. ఇప్పుడు చూపు పూర్తిగా పోయి గుడ్డివాడైపోయాడు.

గాలికి విరిగిపడి కుళ్ళిపోయిన చెట్లకొమ్మలు ఆ తోట నిండా పడి ఉన్నాయి. ఎవరు అడుగువేసినా అవి కాళ్ళ కింద పడి కరకరమని చప్పుడవుతోంది. ఆ శబ్దం వినగానే దొడ్డిలో ఉన్న కావలి కుక్క గుర్రుగుర్రుమంటోంది. అది కూడా తన యజమాని లాగా ముసలిదైపోయింది. ఏ క్షణాన్నయినా దాని ప్రాణం పొయ్యేటట్టుగా వుంది. గట్టిగా మొరిగే శక్తి కూడా పోయింది దానికి.

కొన్నేళ్ళ ముందే పొయ్యి సెగకు వంటవాడి కంటిచూపు పూర్తిగాపోయింది. అప్పుడు వృద్ధుణ్ణి జమీందారిణి తరఫు నిర్వాహకుడు ఒకరు ఈ గుడిసెలోకి మార్పించాడు. అతనే అప్పుడప్పుడూ వచ్చి కొంత డబ్బు ఇస్తుంటాడు.

వృద్ధుడికి సుమారు పద్దెనిమిదేళ్ళున్న కూతురు ఉంది. పేరు మరియా. తండ్రితో పాటు గుడిసెలోనే ఉంటుంది. గుడిసెలో ఒక మంచి, కొన్ని కుంటి బల్లలు, ఒక మోటుమేజా, పగుళ్ళు బారిన కొన్ని మట్టిపాత్రలు ఉన్నాయి. అవికాక ఒక పాతకాలపు పియానో ఉంది. అలికిడైనా ఆ పాత పియానో తంత్రులు కదిలి వాటి ప్రతిధ్వనుల్ని వినిపిస్తాయి. వంటవాడు దాన్ని తన ఇంటి కాపలాదారు అనేవాడు తమాషాకు. దాని ముసలితంత్రుల ఆహ్వాన రొద లేకుండా ఈ ఇంట్లోకి ఎవ్వరూ రాగలిగేవాళ్ళు కాదు.

అవసాన దశలో ఉన్న తండ్రి ఒంటిని మరియా శుభ్రంగా తడిబట్టతో తుడిచి ఉతికిన చొక్కా తొడిగింది. కాసేపటికి –

"మత గురువులన్నా, సన్యాసులన్నా నాకు మొదట్నించీ ఇష్టం లేదు. ఉపదేశిని ఇక్కడికి పిలవలేను. కానీ, చనిపోయే ముందు నా ఆత్మశుద్ధి చేసుకోవాలి" అన్నాడతను.

"నన్నేం చేయమంటారు?" భయపడుతూ అడిగింది మరియా.

"వీధిలోకి వెళ్ళి నీ కంటపడిన మొదటి మనిషిని అడుగు – చనిపోతున్న ఒక వృద్ధుడు తన పాపాలు వెళ్ళబోసుకుంటూ చెప్పే మాటలు వినడానికి లోపలికి రమ్మని. ఎవరూ కాదనరు" అన్నాడు వృద్ధుడు.

"మన వీధిలో ఎప్పుడోగానీ మనుషులు తిరుగాడరు" అంటూ మరియా శాలువా కప్పుకొని బయటకు నడిచింది. పరిగెత్తుకుంటూ వెళ్ళి తుప్పుపట్టిన చిన్నగేటును కష్టం మీద తెరిచి నిలబడింది. వీధి నిర్మానుష్యంగా ఉంది. గాలికి చెట్ల ఆకులు కొట్టుకొస్తున్నాయి. మబ్బులు పట్టిన ఆకాశం... వాన చినుకులు పడుతున్నాయి.

ఎవరైనా వస్తారేమోనని ఎదురు చూస్తూ మరియా చాలాసేపు నిలబడింది. చెవులు రిక్కించి వింది. చివరికి తోట కంచె వెంబడి ఒక మనిషి కూనిరాగం తీస్తూ వస్తున్నట్టనిపించింది. అతని కెదురుగా కొన్ని అడుగులు వేసి ఆ చీకట్లో అతణ్ణి గుద్దుకుని కేకపెట్టింది.

ఆ వ్యక్తి 'ఎవరది' అన్నాడు.

మరియా అతని రెక్క పట్టుకుని, వణుకుతున్న స్వరంతో తన తండ్రి విన్నపాన్ని నివేదించింది.

"మంచిది నేను మతగురువును కాదు. పదండి పోదాం" అన్నాడా వ్యక్తి.

వాళ్ళు గుడిసె లోపలికి వెళ్ళారు. కొవ్వొత్తి వెలుగులో మరియాకు బక్కపల్చటి మనిషి రూపం కలిపించింది. అతడు తడిసిన తన కోటును బల్లమీద విసిరేశాడు. నిరాడంబరమైన దుస్తులు ధరించి ఉన్నాడు.

అతడు ఇంకా యువకుడే. చిన్నపిల్లాడిలా తల అటూయిటూ ఊపుతూ జుత్తు సవరించుకుని మంచం దగ్గరికి వెళ్ళాడు. స్టూల్ లాగి కూచుని, వంగి అవసాన దశలో ఉన్న వృద్ధుడి ముఖంలోకి తదేకంగా చూశాడు.

"చెప్పండి! నాకు దేవుడిచ్చిన శక్తి వల్ల కాక, కళ ద్వారా నాకు అబ్బిన శక్తితో బహుశా మీకు చివరిక్షణాల్లో ఊరట కలిగించి, మీ గుండెల్లోని భారం తొలగించగలనేమో" అన్నాడా అపరిచితుడి.

"నేను నా జీవితమంతా కళ్ళు పోయే వరకూ పనిచేశాను" అపరిచితుణ్ణి తన చేత్తో మరింత దగ్గరికి తీసుకుంటూ లోగొంతుకతో అన్నాడు వృద్ధుడు.

"పనిచేసే వాళ్ళకు పాపాలు చేసే తీరిక దొరకదు. నా భార్య - పేరు మార్తా - క్షయవ్యాధితో మంచానపడింది. ఆమెకు రకరకాల ఖరీదైన మందులు వాడమని వైద్యుడు చీటీ రాసిచ్చాడు. ఆమెకు వెన్న మీగడలు, అత్తిపండ్లు తప్పక తినిపించాలనీ, ఎర్ర ద్రాక్ష సారా తాగించాలని చెప్పాడు. అందుకోసం జమీందారిణి తూన్ తమ ఇంట్లో విందు భోజనాల సమయంలో వాడే సామాన్లలో ఒక చిన్న బంగారు పాత్రను నేను దొంగిలించాను. దాన్ని చిన్న చిన్న ముక్కలుగా విరగ్గొట్టి అమ్మేశాను. ఇప్పుడా విషయం గురించి తల్చుకున్నా, నా కూతురు ముందు చెప్పాలన్నా నా మనసుకు చాలా కష్టం కలుగుతోంది. పరాయివాళ్ళ సొత్తు నలుసంతైనా సరే తాకొద్దని నా కూతురికి నేర్పాను" అన్నాడా వృద్ధుడు.

"మీరా పని చేసినందుకు జమీందారాణి దగ్గర పనిచేసిన సేవకులకెవరికైనా శిక్షపడిందా?" అడిగాడు అపరిచితుడు.

'ఒట్టు బాబుగారూ! ఏ ఒక్కరికీ హాని జరగలేదు" అంటూ వృద్ధుడు కంటతడి పెట్టాడు. "నా భార్య మార్తాను ఆ బంగారం కాపాడలేకపోతుందని తెలిసివుంటే నేను అసలు దొంగిలించే వాణ్ణేనా?" అన్నాడు వృద్ధుడు.

"మీ పేరేంటి?" అడిగాడు అపరిచితుడు.

"యోహాన్ మేయర్"

"మంచిది, యోహాన్ మేయర్!" అంటూ అపరిచితుడు తన అరచేతిని వృద్ధుడి కళ్ళమీద ఉంచాడు.

"మీరు నిరపరాధి. మీరెలాంటి పాపం చేయలేదు. అది దొంగతనం కిందికి కూడా రాదు. నిజం చెప్పాలంటే ఔదార్యంగా కూడా భావించవచ్చు" ఓదార్చాడు అపరిచితుడు.

"ఆమెన్!" అని వృద్ధుడు మెల్లగా అన్నాడు.

అపరిచితుడు కూడా "ఆమెన్" అని బదులిచ్చి - "ఇప్పుడు చెప్పండి మీ చివరి కోరిక!" అన్నాడు.

"ఎవరో ఒకరు నా కూతురు మరియా సంరక్షణ చూసుకోవాలని నా కోరిక."

"ఆ పని నేను చేస్తాను. ఇంకేమైనా కోరిక ఉందా?" అడిగాడు అపరిచితుడు. వృద్ధుడు అకస్మాత్తుగా చిరునవ్వు నవ్వి, "నేను మంచి వయసులో ఉండగా మార్తాను కలిసినప్పుడు ఎలా ఉండేదో అదే రూపంలో ఆమెను మరోసారి చూడాలని కోరికగా ఉంది. సూర్యుణ్ణీ, ఈ పాత తోటనూ - అది వసంతంలో పూతకు వచ్చినప్పుడు ఎలా ఉంటుందో అలా చూడాలని ఉంది. కానీ, అది జరిగే పని కాదని తెలుసు. తెలివి తక్కువగా మాట్లాడినందుకు నా మీద కోపం తెచ్చుకోవద్దు. నా జబ్బు కారణంగా కాస్త తలతిక్క వచ్చినట్టుంది" అన్నాడు వృద్ధుడు.

"మంచిది" అన్నాడు అపరిచితుడు స్టూల్ మీదినుంచి పైకిలేస్తూ. "మంచిది" అని మళ్ళీ అన్నాడు. పియానో దగ్గరికెళ్ళి దానికెదురుగా ఉన్న స్టూల్ మీద కూచుని ఉచ్ఛస్వరంతో "మంచిది" అన్నాడు మూడో సారి.

అప్పుడు ఉన్నట్టుండి వందలకొద్దీ గాజుగోలీలు నేలమీద దొర్లుతున్నట్టుగా గలగలమనే శబ్దం వేగంగా ఆ గుడిసెంతా వ్యాపించింది.

"వినండి... చూడండి!" అంటూ పియానో వాయించడం మొదలు పెట్టాడు ఆ అపరిచితుడు.

మొదటి స్వరం వినబడగానే మరియా అతని ముఖంలోకి చూసింది. అతను నుదురు వివర్ణమై ఉంది. వ్యాకులభరితమైన అతని కళ్ళల్లో కొవ్వొత్తి వెలుగు రెపరెపలాడుతూ కనిపించింది.

చాలా ఏళ్ళ తర్వాత పియానో మొదటిసారిగా గొంతువిప్పి తన స్వర మాధుర్యంతో అలరించసాగింది. దాని సుస్వరలహరి గుడిసెనే గాక, మొత్తం తోటనంతా పులకింపచేసింది. ముసలి కుక్క తన స్థావరం నుంచి బయటికొచ్చి కూచుని, తల ఒకవైపు ఓరగా వాల్చి మెల్లగా తోకాడించసాగింది. తడి మంచు కురుస్తున్నా కుక్క చెవులు రిక్కించిందే గానీ అక్కడ్నించి కదల్లేదు.

అపరిచితుడు పియానో వాయిస్తూనే ఉన్నాడు ఆపకుండా. చీకటి ముసిరిన కిటికీలోంచి బయటికి చూస్తూ... "ఇప్పుడు.. ఇంకేమైనా కనిపిస్తోందా?" అనడిగాడు కాసేపటి తర్వాత.

"నాకన్నీ కనిపిస్తున్నాయి" ఆనందంగా అరిచాడు వృద్ధుడు.

'మరియా! కిటికీ తెరు!'అర్థించాడు వృద్ధుడు.

మరియా కిటికీ తెరిచింది. చలిగాలి రివ్వున గదిలోకి దూసుకొచ్చింది. అపరిచితుడు మృదువుగా నెమ్మదిగా వాయించ సాగాడు.

వృద్ధుడు తన దిండుమీద వెనక్కు వాలిపోయాడు. వేగంగా శ్వాస తీసుకుంటున్నాడు. చేతులు దుప్పటిని తడుముతున్నాయి. మరియా ఒక్క ఉదుటున అతనికి దగ్గరికి పరుగెట్టింది. అపరిచితుడు వాయించడం ఆపాడు. తన సంగీతం తననే మంత్ర ముగ్ధుణ్ణి చేసినట్టు పియానో దగ్గరే నిశ్చలంగా కూచుండిపోయాడు.

మరియా గట్టిగా కేక పెట్టింది. అపరిచితుడు లేచి మంచం దగ్గరికి వెళ్ళాడు. వృద్ధుడు ఎగవూపిరి తీసుకుంటూ "చాలా ఏళ్ళ కిందట జరిగింది జరిగినట్టుగా ఇప్పుడు నేను చూశాను. కానీ మీ పేరు... మీ పేరేమిటో తెలుసుకోకుండా ప్రాణాలు వదల్లేను.. మీ పేరు... మీ పేరు?" అడిగాడు.

"నన్ను వుల్ఫ్‌గ్యాంగ్ అమద్యూస్ మొజార్ట్ అని పిలుస్తారు" జవాబిచ్చాడు అపరిచితుడు. మరియా మంచం దగ్గర్నించి వెనక్కు జరిగి దాదాపు మోకాళ్ళు నేలకు ఆనుతుండగా ఆ మహాసంగీత కారుడికి అభివాదం చేసింది.

ఆమె సర్దుకుని పైకి లేచేటప్పటికే వృద్ధుడు ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. బయట తెల్లగా తెల్లారింది. మంచుతో తడిసిన పువ్వులు తోటంతా పరుచుకుని ఆ వెలుగులో మెరుస్తున్నాయి.

- రష్యన్ మూలం : కన్‌స్తన్ తీన్ పవుస్తోవ్‌స్కీ

అనువాదం : కేశవ్ గోపాల్

పోరుకు సిద్ధం కావాలి


నలు దిక్కుల నుండి
కార్మికులంతా కదలాలి
ఎరుపెక్కిన జెండా చేబూని
జరిగే పోరులో నిలవాలి

కొందరి సౌఖ్యం కోరే
పాలకనీతిని ప్రశ్నిద్దాం
అందరికోసం ఒకటిగా నిలిచి
శ్రామిక రాజ్యం సాధిద్దాం

జాతికి శ్వాసగా నిలిచిన
ప్రభుత్వరంగాన్ని ఫలహారంగా
మార్చే ప్రభుత్వాన్ని నిలదీద్దాం
కార్పొరేట్ కసాయినీతిని ఎదిరిద్దాం

నాడు జాతి నిర్మాణంలో నిలవని
కలవని పారిశ్రామిక దండులు
నేడు జాతి జనుల స్వేదంతో నిర్మితమైన
పరిశ్రమలపై పడ్డాయయ్యో వాటి కన్నులు

కార్మిక చట్టాలను సవరించే
కాషాయిల దుర్నీతిని ఎండగడతాం
సాధించిన హక్కులపై కన్నేస్తే ఊరుకోం
సమరానికి సై అంటూ సంగతేదో తేల్చుతాం ✤



జేజేలు గని కార్మికా ....!

దక్షిణాది పరిశ్రమల ఆయువుపట్టు సింగరేణి
ప్రతిరోజు మరణాన్ని జయించిన వీరునిలా
గని కార్మికుడు పనికానించి వస్తాడు.

ఓ.సి. మైన్ అయినా - యు.జి.మైన్ అయినా
కార్మికుని కష్టమంతా - మట్టిపారల మధ్యనే

శత వత్సరాల కష్టంతో -
నా కార్మికుల దేశ సంపదను
ఎంత సృష్టించారు -
పరిశ్రమ లెన్నింటికో ప్రాణాలైనారు
మసిపూసుకునే వాని కడుపున
డాక్టర్లు, యాక్టర్లు, ఇంజనీర్లు
సినీ డైరెక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

బొగ్గు పారల మధ్య -
బుగ్గై పోతాయనుకున్న
హృదయాలకు ఎంత స్వాంతన
అర్థం లేకుండా పోతామేమో అనుకున్న బతుకులకు
ఎంత వారసత్వం

కోల్ ఫిల్లర్, హాలర్ ఆపరేటర్
కోల్ కట్టర్, సర్దార్, సార్ట్‌ఫైరర్
టింబర్‌మెన్, చైన్‌మెన్,
ల్యాంప్‌రూమ్ కార్మికులారా...
గర్మిదులాయిల్లో
మీరుపడ్డ కష్టం ఊరికే పోదు
సమాజాన్ని సౌందర్యంగా
నిర్మించుకుంటూ వచ్చారు.

ఇప్పుడు గని కార్మికుడు
మసిపూసుకునే వాడే కాదు
మన కోసం మండుతున్న బొగ్గు
హక్కుల కోసం పిడికిలెత్తిన
గని కార్మికులకు ఇప్పుడు
ఉందాం మనమంతా అండ

✤ - పి.వి. రావు

ఆర్టీసి సదస్సు తీర్మానం

ఏప్రిల్ 30న సమ్మెను జయప్రదం చేద్దాం - రోడ్డు రవాణా & భద్రతా బిల్లు - 2014ను తిప్పికొడదాం!!

రాజ్యాంగం ప్రకారం రవాణా రంగం రాష్ట్ర ప్రభుత్వ జాబితాలో వుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోడ్డు ట్రాన్స్‌పోర్టు & సేఫ్టీ బిల్లు-2014తో మాత్రం రవాణాను కేంద్రం తన ఆధీనంలోకి తీసుకొనున్నదని, ఇది సమాఖ్య స్వభావాన్ని దెబ్బతీయడమేనని, కాబట్టి ఆ బిల్లును వెనక్కి కొట్టేందుకు జరిగే సమ్మెతో సహా అన్ని కార్యక్రమాలను సిపిఐ(ఎం) పార్టీ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి మల్లారెడ్డి తెలియజేశారు.

ఆర్టీసి రంగంలో పనిచేస్తున్న ట్రేడ్ యూనియన్లు ఐక్యంగా సేఫ్టీ బిల్లుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 10న రాష్ట్ర సదస్సును నిర్వహించాయి. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మల్లారెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ బొగ్గుతో నడిచే బస్ నుండి ఈనాటి అత్యాధునిక 'స్థాయికి ఆర్టీసి ఎదగడంలో కీలకపాత్ర కార్మికులదేనన్నారు. కేంద్రం రాష్ట్రాల హక్కులను కాలేస్తుంటే, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నోరెత్తడం లేదని అన్నారు. యూనియన్లు ఐక్యంగా వుంటే రాజకీయ పార్టీలే మీ వెంట వస్తాయని, సిపిఎం పార్టీ ఎంపిలనందరి చేత పార్లమెంటులో ఈ బిల్లును వ్యతిరేకింప చేస్తామని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పనిచేస్తున్నదని, ఈ బిల్లు కూడా రాజ్యాంగంలోని అనేక అంశాలను తుంగలో తొక్కుతుందని, కాబట్టి ప్రజలంతా ఈ బిల్లును వ్యతిరేకించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మన రాష్ట్రంలో పేద ప్రజలకు వరప్రసాదంలా వున్న ఆర్టీసి ఈ బిల్లు వల్ల కనుమరుగవుతుంది. అందుకని ప్రజలందరిని ఐక్యం చేసి బిల్లును తిప్పి కొట్టేందుకు సిపిఐ పార్టీ కృషి చేస్తుందని అన్నారు.

దేశ ప్రజలందరి సమస్యలపై ఆర్టీసి కార్మిక సంఘాలు ఐక్యమై పోరాటానికి ముందుకు రావడం అభినందనీయమని సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎం.డి.అబ్బాస్ అన్నారు. పేరులో వున్న సేఫ్టీ బిల్లులో లేదని, ఈ బిల్లును రాష్ట్ర ప్రజలందరూ తిప్పికొట్టాలని, ఏప్రిల్ 30న ప్రజలు, కార్మికులు అందరూ స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనేలా అందరం కల్సి చైతన్యపరచాలని, ఇందులో సిఐటియు సంఘం మీతో వుంటుందని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు దేశ ప్రజలకు తీరని

రాష్ట్ర సదస్సు తీర్మానం

నష్టమని, ఆర్టీసిలన్ని కనుమరుగై దేశ ప్రజలందరూ ప్రజా రవాణాకు దూరం అవుతారని, కావున బిఎంఎస్ ఈ బిల్లుకు వ్యతిరేకంగా పని చేస్తుందని బిఎంఎస్ నాయకులు రవిశంకర్ అన్నారు.

ఇంకా ఈ సదస్సులో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు నరసింహన్, ఐఎన్‌టియుసి నేత అంజిరెడ్డి, టిఎన్‌టియుసి నేత సత్యనారాయణ, ఐఎఫ్‌టియు నుండి వి.కిరణ్, ఎఐయుటియుసి నాయకులు సుధీర్, బి.ఎస్.పి. నాయకులు రామస్వామి, తదితరులు ప్రసంగిస్తూ సదస్సులో ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతును తెలియజేశారు.

తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు థామస్‌రెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. బివిరెడ్డి (టిఎంయు), బాబు (ఇయు), రమేష్ కుమార్ (కెఎస్), అబ్రహాం (ఎస్‌డబ్ల్యుయు), యాదగిరి (కెపి), ఎవి.రాజు (బిడబ్ల్యుయు), యాదయ్య (బికెయు) లు ప్రసంగించారు.

టిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు స్వాగతోపన్యాసం చేసి, ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రాంచందర్ వందన సమర్పణతో సదస్సు ముగిసింది.

: సదస్సులో చేసిన నిర్ణయాలు :

1. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభదినమైన ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లో ప్రదర్శన, ధర్నా నిర్వహించాలి.
2. మార్చి 15 నుండి ఏప్రిల్ 16 వరకు అన్ని జిల్లాల్లో సదస్సులు, రంగాలవారీ సదుస్సులు జరపాలి.
3. ఏప్రిల్ 15న సమ్మె నోటీసులు ఇవ్వాలి.
4. ఏప్రిల్ 16 నుండి 20 వరకు ప్రజలలో సమ్మె పట్ల అవగాహన పెంచేందుకు కృషి చేయాలి.
5. ఏప్రిల్ 30న దేశవ్యాప్తంగా 24 గంటలు సమ్మెను జయప్రదం చేయాలి.

- వజ్రాల

సందర్భం

మూగబోయిన తమిళ రచయిత 'పెరుమాల్ మురగన్'



'మరణించిన రచయిత'కు నివాళి చెప్పేటప్పుడు ఇవాన్ తుర్గెనెవ్ రాసిన 'ముమూ....' అన్న కథ యాదికి వస్తున్నది. అది రష్యన్ ప్రౌఢ కథా సంకలనంలోని ఒకానొక కథ. నిరంకుశత్వం, ఆధిపత్యం మధ్య మనిషి మూగవోయిన గాథ అది. పనివాడు, ఎత్తయిన వాడు, బలిష్టుడు 'ముమూ.' అతడ్నిఒక యజమాని ఊరు నుంచి తెప్పించుకుంటుంది. ఇంట్లో ఏపని చెబితే అది చేయాలి. ఆయన చాలా ఈజీగా చేసేస్తడు. ఇల్లు ఊడిస్తే సగం వాకిలి సాఫవుతుంది. ఏ పని చేసినా అంతే. తాను చేయి వేస్తే అది అమిత శ్రద్ధ. జరూరుగా ఆ పని పూర్తవుతుంది. అయితే ఆ మనిషి ఒక్కడే ఆ ఇంట్లో లేదు. అంటే ఆ ఔట్ హౌజ్‌లో లేదు. పదులు, ఇరవైలు, బహుశా చాలామంది నౌకర్లే ఉన్నరు. అందులో ఇతనొకడు. కానీ తనకంటూ ఒక గది ఉంటుంది. అందులో తాను ఇష్టంగా ఉంటాడు. బయట పనంతా చేసి ఇంట్లో ఉన్నట్టే ఉంటడు. అయితే అతడికీ హృదయం ఉంది. ఒక చాకలామె ఉంటుంది. ఆమెను ప్రేమిస్తాడు. కానీ, ఒక ఫైన్ మార్నింగ్ యజమానురాలు ఆమెను పిలిచి, 'నీకు పెళ్లి చేస్తున్నా' అంటుంది. చేసేస్తుంది. అప్పుడే ముమూ... సగం మూగవాడవుతాడు. నిజానికి అతడికి మాటలు రావు. కానీ, గుండె. అది సగం కునారిల్లుతుంది. ఆ తర్వాత అతడు కుక్కను పెంచుకుంటాడు. ఎంత ఇష్టంగా అంటే చెప్పరాదు. మరొక ఫైన్ మార్నింగ్ యజమానురాలు పిలుస్తుంది. అది మొరగవద్దని చెబుతుంది. కానీ ముమూ ఆ కుక్కకు చెప్పలేడు. దానికి అర్థం కాదు. కానీ మనకు అర్థమౌతుంది. యజమానికి ఒక 'కుక్క' కావాలి. కానీ 'కుక్క'కు కూడా కుక్క ఉండటం, అది మొరగడం యజమాని సహించదు. అందుకే వేరొకరితో దాన్ని ఎక్కడో వదిలేసి రమ్మంటుంది. కానీ కుక్క మళ్ళీ అతడ్ని చేరుకుంటుంది. కానీ యజమానికి మరొక ఫైన్ మార్నింగ్ ఉండనే ఉంటుంది. దాంతో అతడ్ని మళ్ళీ పిలుస్తుంది. ఈసారి ఆకుక్కను నువ్వే చంపమని చెబుతుంది. చంపుతాడు. నిజం. అతడు ఆ కుక్కను చంపే సన్నివేశం చదివాక 'ముమూ'నే కాదు, మళ్ళీ మనమే మూగబోతాం. ముమూ గుండె అయితే పూర్తిగా మూగబోతుంది. ఆ తర్వాత అతడు తన రూంకి వస్తడు. కొంచెం సామాను ఏదో ఉంటుంది. ఇరవై ఏళ్ల క్రితం తన ఊరు నుంచి వచ్చినప్పుడు పట్టుకొచ్చింది. అది సర్దుకుని బయలుదేరుతాడు. 24 గంటలో 48 గంటలో ఇంకా ఎక్కువో... కానీ తాను ఊరుకు చేరుతాడు. ఒక ఏడు గడుస్తుంది. రెండేళ్లు, మూడేళ్లు. దశాబ్దం. దశాబ్దాలు గడుస్తయి. ఊర్లో మాత్రం ఒక మాట చెప్పుకుంటూ ఉంటారు. 'ఎందుకో అతడికి ఆడవాళ్లన్నా పడదు. కుక్కలన్నా పడదు. వాటివైపే చూడడు' అని!

***

నిరంకుశత్వం మనిషిని ఎట్లా అణచివేసి 'మూగవాళ్ళను' సైతం జీవితాంతం 'మూగవోయేలా' చేస్తుందో చెప్పే అద్భుతమైన విషాద నిరసన కావ్యం 'ముమూ'. గుర్తున్నంత వరకూ ఇది ఆ కథాంశం. ఈ కథ ఎందుకు గుర్తు చేయవలసి వస్తున్నదీ అంటే, ఒక రచయిత మున్నాలుగురోజుల కింద 'నేను రచయితగా మరణించాను. ఇక ముందు నేను కేవలం సాధారణ ఉపాధ్యాయుడినే' అని ప్రకటించినందువల్ల! పాతికేళ్ల క్రితం నెలకొన్న ఒక ఆచారాన్ని ఎత్తి చూపినందుకు ఆయన 'ముమూ' అయ్యాడు. అయ్యేలా చేశారు.

***

ప్రొఫెసర్ పెరుమాళ్ మురుగన్ అన్న రచయిత తాను రాసిన నవల - 'మధోరుభగన్' ను అడ్డుకున్న కారణంగా విసిగిపోయి పంచాయితీ ఎదుర్కొని, తాను రచయితగా మరణించానని, ఇక సాధారణ ఉపాధ్యాయుడిగానే జీవిస్తానని, తనను ఎవరూ కవల నక్కర్లేదని,తన రచనల అమ్మకాలను కూడా నిలిపివేయాలని, ఇక తనను ఒంటరిగా వదిలేయాలని విజ్ఞప్తి చేశారు. ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి.

తనకు 'భగవంతుడు లేడు' గనుక 'పునర్జన్మ' కూడా ఉండదని, అందువల్ల ఇక తనలో 'రచయిత' లేడనీ ప్రకటించాడు. అంతేగాదు,తనకు గతమూ భవిష్యత్తూ లేదనీ చెప్పేశిండు. అవును. మున్ముందు ఇక తాను రాయబోయే రచనలు మరణించాయనీ చెప్పిండు. అలాగే రాసినవి రద్దు చేసుకుంటున్నట్లూ చెప్పేశిండు. అలా అతడు వెనక్కి పూర్తిగా వెనక్కి వెళ్లిపోయి 'ముమూ'అయ్యిండు.

చిత్రమేమిటంటే మనం 'హత్యల్ని' చూస్తాం. ఎవరో ఒకర్ని హత్య చేయడం చూస్తాం. కానీ ఆత్మహత్యలు ఎవరికి వారే చేసుకోగా చూస్తాం. కానీ మురుగన్‌ను వేరెవరో 'ఆత్మహత్య' చేయడం... ఆ సంగతి గ్రహించి ఆయన తనలోని 'రచయిత మరణించాడని' చెప్పడం ఒక విషాద కావ్యం. అది 'ఆత్మహత్యా వాంగ్మూలం'.

***

తన నవల కథాంశం. ఏమిటంటు - అది నూటా పాతికేళ్ల నాటి ఆచారం. తమిళనాడులోని తిరుచెంగోడు ప్రాంతంలో సంతానంలేని మహిళలు ఒక జాతర సందర్భంగా ఆలయంలో అపరిచితులతో శారీరకంగా కలవడం. ఈ అంశంపై మురగన్ నవలను రాసినందుకు అతిని ముందు ఊర్లోంచి వెళ్లగొట్టి అటు తర్వాత పంచాయితీ పెట్టి అటు తర్వాత తనంతట తాను ఇలా మరణించేలా చేయడం అన్నది ఈ నిజ జీవిత కథా లేదా 'ముమూ' లేదంటే కొన్ని హిందూ సంస్థల విజయగాథ.


***

మనిషి మూగవోయినప్పుడల్లా, అది 'ముమూ'నే కానవసరం లేదు, మురుగన్ అయినా ఎవరైనా ఒకటే. కథ రిపీట్ అవుతూనే ఉంటుంది. ఇక అతడు వెనక్కిపోతాడు. జీవితాన్ని పరిశీలనగా చూడడు. బాధ్యత వహించడు. ప్రేమించడు. ప్రేమతో దేన్నీ ముట్టుకోడు. ఒక్కమాటలో జీవించడు. జీవచ్ఛవం. అంతే! నివాళి.

\- కందుకూరి రమేష్‌బాబు


'ప్రపంచీకరణ - భారతదేశం'

ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ రాసిన వ్యాసాలు 'ప్రపంచీకరణ - భారతదేశం' పేరుతో తెలుగులో మొదటిసారి సంకలనంగా రావడం చాలా సంతోషకరమైన విషయం. సమకాలీన భారత దేశంలోనే గాక ప్రపంచ స్థాయిలో కూడా ప్రజల పక్షాన నిలిచే ప్రగతిశీల మేధావి, ఆరితేరిన ఆర్థికవేత్త ఆయన. ప్రపంచ ద్రవ్య వ్యవస్థను సంస్కరించటానికి ఐక్యరాజ్య సమితి జోసెఫ్ స్టిగ్లిజ్ అధ్యక్షతన నియమించిన నలుగురు సభ్యుల ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌లో ప్రభాత్ పట్నాయక్ ఒకరంటే ఆయన స్థాయి ఏమిటో అర్థమవుతుంది. ప్రత్యేకించి నయా ఉదారవాద ఆర్థిక విధానాల నయ వంచనను పటాపంచలు చేసే విశ్లేషణ ఆయన స్వంతం. ఒక్క అక్షరం వృధాపోకుండా తన రచనను ఆమూలాగ్రం అర్థవంతమైన సమాచారంతో నింపడం ఆయనకే చెల్లింది. నిజానికి ప్రత్యేకంగా ఒక ముందు మాట అంటూ అవసరం లేని మహా మేధావి ఆయన. అయితే ఆయన రచనల వల్ల, విశ్లేషణల వల్ల అవగాహన పెంచుకుంటున్న ఎంతోమంది ప్రజా ఉద్యమ కారుల ప్రతినిధిగా అభినందనలు తెల్పడానికే ఈ ప్రయత్నం.



గొప్పగా అనునిత్యం కీర్తించబడే ప్రపంచీకరణ వాస్తవానికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణే. కానీ చాలా మంది పాలక వర్గ మేధావులు, ఆర్థికవేత్తలు సామ్రాజ్యవాదం వంటి పదాలకు కాలం చెల్లిపోయిందని సుద్దులు చెబుతుంటారు. అవెంత బూటకమో ప్రభాత్ పట్నాయక్ ఈ వ్యాసాల్లో నిరూపించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో రూపం ఏదైనా ప్రపంచాధిపత్య వ్యూహం అనివార్యమైన అవసరం. సామ్రాజ్యవాదాన్ని గురించి మాట్లాడటం ఇప్పుడు మరింత అవసరం. సామ్రాజ్యవాదంలేని పెట్టుబడిదారీ వ్యవస్థను ఊహించటమే సాధ్యంకాదని ప్రభాత్ విశ్లేషించారు. వలసకాలంలో బ్రిటన్ ప్రధాన శక్తిగా ఉన్నప్పుడు చమురులాంటి వనరులను ఉత్పత్తి చేస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రత్యక్ష పెత్తనంతో సరఫరాను నియంత్రించింది. వర్తమానంలో ఈ నియంత్రణ రాజకీయ ప్రాబల్యంతో నిశ్చయమవుతున్నది. ఇరాక్ వంటి చోట్లనైతే ఇప్పుడు కూడా వలస తరహా ప్రత్యక్ష నియంత్రణకు ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ఆ వ్యవస్థకు నాయకత్వం వహించే దేశం మారవచ్చు కానీ దాని అదుపాజ్ఞలు, అజమాయిషీలు అలాగే ఉండడం వారికి అవసరం. ఈనాడు ప్రపంచీకరణ శకంలో మూడవ ప్రపంచ దేశాలలోని బూర్జువా వర్గం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారీ వర్గంతో చాలా వరకూ కలగలసి పోతున్నది. అయినప్పటికీ అగ్రరాజ్య కూటమి మూడవ ప్రపంచ దేశాల వనరులను, ఉత్పత్తులను అదుపు చేస్తూనే ఉంటుంది. మూడవ ప్రపంచ దేశాలలోని ఉద్యోగులు, కార్మికుల ఆదాయాలను దిగ కోస్తూనే ఉంటుంది. తన సరుకులను అక్కడకు పంపి దేశీయ మార్కెట్లను కబళిస్తూనే ఉంటుంది. వీటన్నిటినీ సాగించేందుకు కావలసిన యంత్రాంగం పేరే సామ్రాజ్యవాదం అని ప్రభాత్ పట్నాయక్ కుండబద్దలు కొట్టి చెబుతారు. అలాంటి సామ్రాజ్య వాదం పట్ల సన్నాయినొక్కులు గాక సమరశీల అవగాహన ఆవశ్యమంటారు. పైగా దీనివల్ల సంపన్న దేశాలలో కార్మికుల వేతనాలు పెరగకుండా అడ్డుకోవడం కూడా జరుగుతుంది. ఆ విధమైన అభద్రతా వాతావరణం వారి పోరాటాలను, ఉద్యమాలను బలహీనపర్చే సాధనమవుతుంది. కనుక ఈ విధానాలతో ఒక్క దెబ్బకు రెండు పిట్టల్లా అంతర్జాతీయ సామ్రాజ్య వాదం ద్వంద్వ ప్రయోజనాలు సాధించుకుంటుందని విశద పరుస్తారు ప్రభాత్. అభివృద్ధి చెందిన దేశాలలో శ్రామిక ఉత్పాదకతతో పాటుగా కార్మికుల వాస్తవ వేతనాలు ఇకపై పెరగవు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శ్రామిక ఉత్పాదకత పెరిగినప్పటికీ వాస్తవ వేతనాల సదిశలో స్తబ్ధత ఏర్పడటం అంటే మిగులు విలువ భాగం పెరిగిందనటానికి అంతస్సూచన అని చెప్పవచ్చు. అంటే ప్రపంచంలో ఆర్థిక అసమానతలు పెరిగాయన్న మాట. ప్రపంచీకరణ పేరుతో చలామణీ అవుతున్న నయా ఉదారవాద శకంలో కార్మికులూ, ఉద్యోగులూ నిరంతరం నిరుద్యోగం పడగనీడలో జీవిస్తున్నారంటే కారణం అదే.

అంతకన్నా దారుణం ఏమంటే, సంపదలు అపారంగా పెంచే సాధనంగా ప్రచారం పొందిన నయా ఉదారవాద విధానాల ఫలితంగా దారిద్ర్యం పెరగడం! అధికారికంగా జరిగిన నేషనల్ శాంపుల్ సర్వేనే ఇందుకు ఆధారంగా ఉండటం ఆసక్తికరమైన విషయం. కనుక ఆర్థికాభివృద్ధి జరిగినంత మాత్రాన దారిద్ర్యం పోతుందని చెప్పలేం. నయా ఉదారవాదంలో పెరిగే దారిద్ర్యం వ్యవస్థీకృత ఉత్పాదితం. దీని మూలాలు ఆర్థిక విధానంలో ఉంటాయి - అంటూ ఆయన చేసిన సూత్రీకరణ ఒక హెచ్చరిక. ఎవరు ఏ పనైనా చేసేందుకు స్వేచ్ఛ లభించినట్లు చెబుతున్నా, వాస్తవంలో కొన్ని తరగతుల శ్రామికులు కొన్ని వృత్తులలో బందీలై ఉంటారు. ప్రత్యక్ష, పరోక్ష వివక్షకు గురవుతుంటారు. వారి పని



పరిస్థితులు, ప్రతిఫలం కూడా పరమ నికృష్టంగా ఉండిపోతాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వంటి పేర్లతో కార్మికులలో ఒక 'అణగారిన' తరగతిని ఎల్లవేళలా అభద్రతతో ఉంచేస్తారు.

ఈ క్రమంలో దారుణంగా చితికిపోయే మరో రంగం వ్యవసాయ రంగం. రైతాంగం ఆత్మహత్యలు, గిట్టుబాటు ధరల లేమి, పరపతి అందకపోవడం, సబ్సిడీల కోత వంటి సమస్యలు మనం రోజూ చూస్తుంటాం. వీటికి బాధ్యత తీసుకోవడానికి పాలకులు ముందుకు రారు. పైగా ప్రపంచ వాణిజ్య సంస్థ వ్యవసాయ సబ్సిడీలు రద్దు చేయాలని వెంటపడుతుంది. రైతాంగం చితికిపోవడం ఒకటైతే, వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారడం మరో ముఖ్యమైన అంశం. కానీ పెద్ద పెద్ద ఆర్థిక సిద్ధాంతాలు వల్లెవేసే పండితులు దీనికి ఎంతమాత్రం ప్రాధాన్యతనివ్వరు. ప్రొఫెసర్ ప్రభాత్ వ్యాసాలలో వీటికి సమాధానం దొరుకుతుంది. సమస్యలతో పాటుగానే ద్రవ్య లోటు, ద్రవ్య శిక్షణ, ఆర్థికాభివృద్ధి, గాలిబుడగ, మాంద్యం, రూపాయి విలువ పతనం, వివిధ దేశాలలో ద్రవ్యపరమైన ఒడుదుడుకులు, తదితర అంశాలు కూడా అచ్చమైన ఆర్థికవేత్తలాగే ఆయన మనకు ఎరుకపరుస్తారు. కాకపోతే భూకంపాలు, ప్రభుత్వ పతనాలు అన్నట్టు ఈ ఆర్థిక తుపానుల వెనకగల విధాన సూత్రాలేమిటో తేటతెల్లం చేస్తారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగక, చేసిన ఉత్పత్తులు అమ్ముడవక నిజమై అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నిస్తారు. ఇలాంటి పెట్టుబడిదారీ వ్యవస్థ నయా ఉదార వాదాన్ని నెత్తికెత్తుకున్న మన పాలక వర్గాలు - యుపిఎ, ఎన్.డి.ఎ, ప్రాంతీయ పార్టీలు ఏవైనా - ఒకే గాడిన నడుస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ముందు మోకరిల్లుతున్నాయి. ఈ ప్రభావం రాజకీయాల పైనా పడి దేశంలో అసలే అంతంత మాత్రంగా ఉన్న ప్రజాస్వామ్యాన్ని మరింతగా కుంగదీసింది. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా కాకుండా చట్ట సభలకూ, న్యాయ వ్యవస్థకూ అతీతంగా కార్యనిర్వాహక వర్గం - అంటే ప్రభుత్వానికి ఆధిపత్యం వహించిన రాజకీయ నాయకత్వం - సర్వాధికారం చెలాయించే పరిస్థితి ఏర్పడింది. నరేంద్రమోడీ వచ్చిన తర్వాత మన్మోహన్ తరహా విధానాలే మరింత జోరుగా అమలు చేయడం మన కళ్ల ముందు జరుగుతున్నదే. ఇందుకోసం అతి కీలకమైన అంశాల్లో ఆర్డినెన్స్‌లు జారీచేసినా చెల్లిపోతున్నది. అంటే గత 100 సంవత్సరాల కాలంలో వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం, ఆ తరువాత అనేక ప్రజాస్వామిక పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కుల మీదా దాడి జరుగుతున్నది. ఈ మార్కెట్ ఛాందసం రాజకీయ క్షేత్రంలో మతతత్వం - ఫాసిజం రూపంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని మరింతగా దెబ్బతీస్తున్నది. వీటన్నిటి మధ్యనా అంతస్సం బంధం ఏమిటో ఈ పుస్తకంలోని వ్యాసాలు మనకు చెబుతాయి.

ఈ విధంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైన పాలకవర్గాలు బూటకపు 'అభివృద్ధి' పేరుతో ప్రజలను మాయచేసి దోచుకుంటున్నాయి. చీలుస్తున్నాయి. ఇందుకు భిన్నంగా ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేయడం వామపక్షాల ప్రప్రధాన కర్తవ్యంగా ఉంది. అటు దేశ ఆర్థిక సార్వభౌమత్వం, ప్రజల జీవిత ప్రమాణాలు కాపాడుకోవడం మరోవైపున వారి ప్రజాస్వామిక హక్కుల రక్షణ - ద్విముఖ కర్తవ్యాలుగా ఉన్నాయి. మోడీత్వ మతతత్వ రాజకీయాలను ఢీకొని లౌకిక విలువలను రక్షించుకోవాలి. ఇప్పుడు దేశ వ్యాప్తంగా జరుగుతున్న సిపిఎం మహాసభల్లో ఇందుకు సంబంధించి వాస్తవాల క్రోడీకరణ, ఆచరణాత్మక విశ్లేషణ సాగుతున్నాయి. ఇతర శక్తులను కూడగట్టే కృషి జరుగుతున్నది. వరుసగా వచ్చే కుదుపులు, కొన్ని ప్రతికూల పరిణామాలు కూడా ప్రపంచీకరణ మేడిపండు స్వరూపం కొద్ది కొద్దిగా అర్థం అయ్యేలా చేస్తున్నాయి. ఆ అవగాహన ఎంతగా పెరిగితే ఆచరణ అంతగా పదునెక్కుతుంది. ఈ అధ్యయనానికి, కార్యాచరణకూ కూడా ప్రభాత్ పట్నాయక్ వ్యాసాల సంకలనం ప్రజాస్వామ్యవాదులందరికీ ఒక సమగ్ర మార్గదర్శినిగా ఉంటుంది. ఆ విధంగా ఈ పుస్తకాన్నీ ఉపయోగించుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఇదే కోవలో స్థానిక అంశాలకు వీటిని అన్వయించి చూసుకుంటే మరింత సులభంగా అర్థమవుతాయి.

ఈ వ్యాసాలు ప్రజాశక్తిలో వస్తున్నప్పుడే అధ్యయన శీలురైన పాఠకులను విశేషంగా ఆకర్షించాయి. అనేక చోట్ల వీటిపై అధ్యయన తరగతులు జరిగాయి. వారం వారం వీటిని అనువదించిన నెల్లూరు నరసింహారావు .. అనువాదం సుబోధకంగా సాగేందుకు శక్తికి మించి ప్రయత్నించడం అభినందనీయం. ఈ పుస్తకం పాఠకుల ఆదరణతో మరిన్ని ముద్రణలు వస్తుందని విశ్వసిస్తున్నాను. తన మేధనూ, అధ్యయనాన్నీ, అభ్యుదయ ఉద్యమాలను ప్రజా విముక్తి - వికాసాలకు అంకితం చేసిన ప్రభాత్ పట్నాయక్ కు హృదయ పూర్వకంగా జేజేలు పలుకుతున్నాను.

పుస్తకం వెల: రూ.200. పేజీలు : 400

- తమ్మినేని వీరభద్రం, సిపిఐ(ఎం)తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

ప్రకటన

నవల, కథ, కవితల పోటీకి రచనలు ఆహ్వానం

సిపిఎం 21వ అఖిల భారత మహాసభల సందర్భంగా ఉత్తమ సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకై నవలలు, కథలు, కవితల పోటీ నిర్వహించాలని ఆహ్వాన సంఘం నిర్ణయించింది. ప్రజా శ్రేయస్సు, సామాజిక చైతన్యం కోరే రచయితలు, కవులూ ఈ పోటీలలో పాల్గొని ఉత్తేజకరమైన రచనలు పంపి ఈ ప్రయత్నం జయప్రదం చేయాలని కోరుతున్నాము.

తెలుగువారి సాహిత్య, సాంస్కృతిక పునరుజ్జీవనంలో కమ్యూనిస్టు ఉద్యమం దాని ప్రచురణ సంస్థలూ చేసిన కృషి ప్రతివారికీ తెలుసు. ప్రత్యేకించి కాలం చెల్లిన మూఢత్వ ధోరణులనూ, పీడననూ దోపిడీని ఎదిరించి పోరాడేందుకు చైతన్యవంతమైన ప్రగతిశీల సాహిత్యాన్ని కమ్యూనిస్టులెప్పుడూ ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సామాన్య ప్రజలపై దాడులు చేస్తూ ప్రతిదీ ప్రైవేటీకరణకు, కార్పొరేటీకరణకు ఫణం పెడుతున్నది. రాజకీయ అవినీతి సాంస్కృతిక కాలుష్యం ఆందోళనకరంగా అలుముకు పోతున్నాయి. మతోన్మాద రాజకీయం వెర్రితలలు వేస్తున్నది. ఈ క్రమంలో సామాజిక న్యాయం, మహిళలు, దళిత, బలహీన వర్గాల జీవితాలు అణగారి పోతున్నాయి. ప్రజలకు సంక్షేమం చిలకరిస్తున్నామంటూనే దేశ విదేశీ బడా వ్యాపార వర్గాలకు పాలకులు వనరులన్నీ ఫలహారం చేస్తున్నారు. ఇదే అభివృద్ధి అని వూదరగొడుతున్నారు. ఈ పరిస్థితి ప్రభావం సాహిత్యంపైనా పడుతున్నది. తెలుగులో ప్రగతిశీల సాహిత్య సాంప్రదాయాలు బలంగా వున్నప్పటికీ నేటి సామాజిక సవాళ్లకు తగిన స్థాయిలో మరిన్ని రచనలు రావలసి వుంది. అందుకే ఈ ప్రయత్నాన్ని ఫలప్రదం చేసి, చిరస్మరణీయ రచనలు అందించవలసిందిగా కోరుతున్నాం.

నిబంధనలు - సూచనలు

* కథకు సంబంధించి ఎ4 సైజు కాగితంపై చేతిరాతలో 8 పేజీలు ఉండాలి. డి.టి.పి. సైజు ఫాంట్‌లో ఎ4 సైజులో 5 పేజీలకు మించకూడదు.
* మరీ సుదీర్ఘ కవితలు పంపనవసరం లేదు. ఒక కవి ఒక కవిత మాత్రమే పంపించాలి.
* నవల ఎ4 సైజు కాగితంపై చేతిరాతలో 250 పేజీలు ఉండవచ్చు. టిడిపి అయితే 15 సైజు ఫాంట్‌లో ఎ4 సైజులో 150 పేజీలకు మించకూడదు.
* ఇటీవలి ప్రపంచీకరణ విధానాల నేపథ్యంలో ప్రజల జీవితాలలోవస్తున్న మార్పులకు సంబంధించిన అంశాల్ని ఇతివృత్తంగా స్వీకరించవచ్చు. ఇతివృత్తంతో పాటు రచనా శిల్పానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది.
* అచ్చయినవి, అనుకరణలు, అనువాదాలు పోటీకి అనవసరం. ఆ మేరకు హామీపత్రం రాయాలి.
* ఉత్తేజకరమైన పోరాట ఘట్టాలు, జీవితాలు కూడా నవలీకరించవచ్చు. కాని సమకాలీన ప్రపంచం ప్రస్ఫుటంగా ప్రతిబింబించాలి.
* గ్రామీణ జీవితం, మహిళలు, అణగారిన తరగతుల గురించి సజీవ చిత్రణలకు స్వాగతం. సామాజిక సమస్యలు, నూతన సమస్యలను కూడా ఇతివృత్తాలుగా తీసుకోవచ్చు.
* రచనలపై రచయిత, రచయిత్రులు తమ పేర్లు రాయకూడదు. హామీ పత్రంలో మాత్రమే పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, ఇ-మెయిల్ వివరాలు రాయాలి.
* కవరుపై నవల, కథ, కవిత ల పోటీకి అని రాసి 'మహాసభల ఆహ్వాన సంఘం, ప్లాట్ నెం.21/1, యం.హెచ్.భవన్, ఆర్టీసి కళ్యాణ మండపం దగ్గర, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్ - 500 020 కు పంపించాలి.
* ఇ-మెయిల్ psbhap@gmail.com ద్వారా కూడా పంపించవచ్చు. డి.టి.పి. చేసిన వాటిని పిడిఎఫ్, ఓపెన్ ఫైల్ రెండూ పంపించాలి.
* ఫలితాలకు సంబంధించి న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు.
* రచనలు చేరవలసిన చివరి తేది. 10.03.2015
* బహుమతి పొందిన నవలలు ప్రచురించడం జరుగుతుంది.
* పోటీకి అందిన కథలు, కవితలలో గెలుపొందిన వాటితో పాటు, సాధారణ ప్రచురణకు ఎంపిక చేసిన వాటితో కథ, కవితా సంకలనాలను ప్రచురించడం జరుగుతుంది.
* బహుమతిపొందిన కథలు, కవితలను ప్రస్థానం, ప్రజాశక్తి దినపత్రిక ఆదివారం సంచికలలో ప్రచురించడం జరుగుతుంది.
* విశాఖపట్నంలో ఏప్రిల్ 14 నుండి 19 వరకు జరిగే మహాసభల సాహిత్య వేదికపై బహుమతులు అందజేయడం జరుగుతుంది.
* www.prasthanam.com వెబ్‌సైట్‌లో కూడా పోటీల వివరాలు చూడవచ్చు.
* ఇతర వివరాలకు 9490099059 కు సంప్రదించవచ్చును.

- బెల్జియం ప్రభుత్వం ప్రతిపాదించిన 'పబ్లిక్ సెక్టార్‌లో ఉద్యోగాలపై కోత, పెన్షన్ వయసు పెంపు, పెన్షన్ రుసుము తగ్గింపు"కు వ్యతిరేకంగా ఆ దేశ కార్మికవర్గం డిశంబర్ 14, 2014న చారిత్రాత్మక సమ్మె చేశారు.

- గత మూడు సంవత్సరాల కాలంలో గ్రీస్ దేశపు బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణకై కేటాయించే బడ్జెట్‌లో 50% కోత విధించబడింది. 35వేల మంది డాక్టర్లు, నర్సులు డిస్మిస్ చేయబడ్డారు. 183 ఆస్పత్రులకుగాను 100 ఆసుపత్రులను మూసివేశారు.

- ఐఎల్‌ఓ రిపోర్టుల ప్రకారం గ్రీస్‌లో 70% మంది నిరుద్యోగులు, అంటే 1.3 మిలియన్ ప్రజలు ఒక సంవత్సరంపైగా ఉద్యోగాలు లేకుండా జీవిస్తున్నారు. 44% మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు.

- ఐ.ఎల్.ఓ. నివేదిక ప్రకారమే - ప్రపంచ వ్యాప్తంగా 200 మిలియన్ నిరుద్యోగులున్నారు. రాబోయే దశాబ్ది కాలంలో (10 సం॥లు) మరొక 400 మిలియన్ల మంది యువత ఉద్యోగాన్వేషణకు సిద్ధం కానున్నారు.

- గత 30 సం॥రాల కాలంతో పోలిస్తే పేద, ధనిక వర్గాల మధ్య అంతరం చాలా ఎక్కువగా పెరిగిందని నిపుణుల అంచనా. 30 సం॥ క్రితం 10% ధనికులు, 10% అత్యంత పేదలకన్నా 7 రెట్లు ఎక్కువగా సంపాదించేవారు. కానీ ఆ నిష్పత్తి నేడు 9.5 :1 గా మారింది.

- ఇటలీ పార్లమెంటు ప్రవేశపెట్టిన 'జాబ్స్ యాక్ట్' చట్టం ప్రకారం పెట్టుబడిదారులు కార్మికుల పట్ల 'హైర్ అండ్ ఫైర్' (ఇష్టం వచ్చినప్పుడు కార్మికులను తొలగించడం) విధానాన్ని అనుసరించవచ్చు. కార్మిక హక్కులపై జరుగుతున్న ఈ దాడిని నిరసిస్తూ ఇటలీలోని కార్మికులు 12 డిసెంబర్ 2014న ఒకరోజు సమ్మెకు పిలుపునివ్వగా, సంపూర్ణంగా విజయవంతమైనది.

- ఆస్ట్రేలియాలో ముప్పై నెలల క్రితం 4.9% గా ఉన్న నిరుద్యోగిత శాతం ప్రస్తుతం 6.3%నికి చేరుకుంది. వీరిలో యువ నిరుద్యోగులు 14.5%.

- ఫ్రాన్స్‌లోని మోటారు వాహనాల తయారీ కంపెనీ పి.ఎస్.ఏ. 3,45,450 మందిని ఉద్యోగాల నుండి తొలగిస్తూ (లే ఆఫ్) నిర్ణయం తీసుకుంది. 2016 నాటికి 11,200 ఉద్యోగాలనురద్దు చేయాలని ప్లాన్ చేసింది. 2015 సం॥ ఫ్రెంచ్ బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమంపై 21 బిలియన్ యూరోల కోత విధించనున్నారు. అంతేగాక 5 మిలియన్ పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల వేతనాలను స్థంభింప చేయనున్నారు.

- యునైటెడ్ స్టేట్స్ (అమెరికా) లోని అత్యధిక కంపెనీలు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల హెల్త్ కేర్ ప్లాన్‌ను నిలిపి వేయనున్నాయి. 1988 లో 66% కంపెనీలు (200పైగా ఉద్యోగులున్న వారు) రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ బెనిఫిట్స్ కల్పించేవి. కానీ నేడు 28% కంపెనీలు మాత్రమే హెల్త్ కేర్ బెనిఫిట్స్ అందిస్తున్నాయి. ఇప్పుడు వాటిపై కూడ ఆంక్షలు విధించనున్నారు.

- ఐ.ఎల్.ఓ. ప్రకటించిన గ్లోబల్ వేజ్ రిపోర్టు 2013 ప్రకారం కార్మికుల ఉత్పాదకత ప్రతి సంవత్సరము క్రమంగా పెరుగుతుండగా, నిజవేతనాలు మాత్రం క్రమేణా తగ్గిపోతున్నాయి. కొన్ని దేశాలలో ఇది కేవలం 2% గా కూడా నమోదైంది.



మూఢనమ్మకాలపై ఎక్కుపెట్టిన బాణం

గోపాల గోపాల

ప్రజల మూఢనమ్మకాల్ని క్యాష్ చేసుకుంటున్న స్వామీజీలపై ఎక్కుపెట్టిన బాణం గోపాల గోపాల సినిమా.

అన్ని మతాల్లోనూ చెప్పేది ఒక్కటే. సాటి మనిషిని ఆదుకోవాలని. కానీ మనుషులు స్వార్థం కోసం రాళ్ళను కూడా దేవుడ్ని చేస్తున్నారు. మనిషిని మనిషిలా చూడడం లేదని ఈ సినిమాలో చెప్పదలచుకున్న సారాంశం. ఇదే ఖురాన్‌లోనూ, భగవద్గీతలోనూ, బైబిల్‌లోనూ వుందని గట్టిగా చెప్పాడు. రొటీన్, క్లాస్, మాస్ అంటూ ఒక ఫార్మెట్‌లో వెళుతున్న తెలుగు సినిమాకు ఇది కొత్తదారే.

కథ : గోపాలరావు (వెంకటేష్) నాస్తికుడు. కానీ చేసే వ్యాపారం దేవుడి బొమ్మలు అమ్మే వ్యాపారం. ప్రజల మూఢనమ్మకాల్ని విగ్రహాలు అమ్మడంలో వాడుకుంటాడు. భార్య శ్రియ పరమ భక్తురాలు. తనుండే ప్రాంతంలో ఓ స్వామిజీ (పోసాని) వచ్చి మూఢ నమ్మకాల ద్వారా ప్రజల్ని మభ్యపెడుతుంటే గోపాలరావు ఎదిరిస్తాడు. దాంతో ఆయన ఆగ్రహానికి గురై శపించబడతాడు. దానికి తగినట్లే రాత్రి భూకంపం వచ్చి గోపాలరావు షాపు ఒక్కటే భూస్థాపితం అవుతుంది. లక్షల్లో నష్టం వచ్చి రోడ్డున పడిపోయాడనుకున్న సమయంలో తెలివిగా ఇన్సూరెన్స్ క్లెయిమ్‌ను చూపిస్తాడు. కానీ కంపెనీ వారు అందులోని 'ఏక్ట్ ఆఫ్ గాడ్' అనే లాజిక్కుతో తామేమీ చేయలేమని చేతులు దులుపుకుంటారు. దాంతో వారిని ప్రశ్నించడంతో దేవుడ్నే న్యాయం అడగమని కంపెనీ సూచిస్తుంది. ఆ తర్వాత దేవుడిపై కోర్టులో పోరాటం చేస్తాడు. చిత్రమైన ఈ కేసును కోర్టు ఆమోదిస్తుంది. దాంతో ముస్లిం లాయర్ ద్వారా గోపాలరావు... దైవాంశ సంభూతులుగా చెప్పుకునే స్వామీజీలకు నోటీసులు పంపిస్తాడు. వారంతా కోర్టుకు హాజరై తమ వాదనలు విన్పిస్తారు. మరోవైపు గోపాల తన వాదనలు విన్పిస్తాడు. ఈ క్రమంలో దేవుడ్ని నిందించేవాడు బతకకూడదనే సాధువుల పెద్ద లీలాధర్ (మిథున్ చక్రవర్తి) అనుచరులతో గోపాలపై ఎటాక్ చేయిస్తాడు. అప్పుడే విషయం తెలుసుకున్న దేవుడు (పవన్ కళ్యాణ్) పైలోకం నుంచి కిందకి వచ్చి గోపాలంను కాపాడి తగు సలహాలు ఇస్తుంటాడు. మరి ఎంతోమంది భక్తులున్నా రాని దేవుడు నాస్తికుడైన గోపాలంకు ఎందుకు సాయం చేయాలనుకున్నాడు? అసలు దేవుడిపై పెట్టిన కేసు గెలిచాడా? అన్నది మిగిలిన సినిమా.

తెలుగు హీరోలకు ఒక చట్రం వుంటుంది. ఫ్యాన్స్ కోసం అందులో ఇరుక్కుని... భిన్నమైన కాన్సెప్ట్‌లు టచ్ చేయరు. అలాంటి చట్రాలని ఎప్పుడో తుడిచేసిన బాలీవుడ్ నుంచి స్ఫూర్తిగా తీసుకుని తెలుగులో వచ్చిన చిత్రమే 'గోపాల గోపాల'. కథ తెలిసిందే. దేవుడ్ని ముద్దాయిగా బోనులోనిలబెట్టే పాయింట్ ఇది. హిందీలో దేవుడుని ప్రశ్నించే పాత్రను పరేష్‌రావల్ పోషించి 'ఓ మైగాడ్' అనేలా చేశాడు. దేవుడిగా అక్షయ్ కుమార్ చేశాడు. అందులోని సామాన్యుడి ప్రశ్నలు, భక్తుల నమ్మకాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు దాన్ని తెలుగులో పవన్ కళ్యాణ్, వెంకటేష్‌తో రీమేక్ చేయడం సాహసమే అనుకున్నారు. కానీ కథలోని పాయింట్‌ను బట్టి ఎవరు చేసినా సరిపోతుందని తెలియచెప్పింది ఈ చిత్రం.

ఇక పవన్ కళ్యాణ్ పాత్ర... దేవుడిగా సింపుల్‌గా బాగానే వుంది. అయితే మాటల్లో... కొన్ని తెలుగు జిమ్మిక్కులు చెప్పాడు. జ్ఞానం ఉన్నవాడు ఇంటిలో కూర్చుంటే అజ్ఞానులు దేశాన్ని ఏలుతారు... అంటూ డైలాగ్‌లు పెట్టాల్సివచ్చింది. అదే పనిగా... ఇందులో దేవుడి పాత్ర నిడివి ఎక్కువగానే వుంది. స్వామీజీల పాత్రలు చాలా స్ట్రాంగ్‌గా అనిపించకపోవడానికి కారణం... రొటీన్ ఆర్టిస్టులు వేయడమే.

పవన్ కళ్యాణ్ ప్రవేశం, గోపాలపాత్ర డీల్ చేయడం బాగున్నాయి. రొటీన్ చిత్రాలకు భిన్నంగా వారి ప్రవర్తన వుంటుంది. కోర్టులోనూ, టీవీ చర్చల్లోనూ సాగే డైలాగ్‌లు పవర్‌ఫుల్‌గా వుండబట్టి ఆలోచించేట్లుగా అనిపిస్తాయి.

లీలాధర స్వామిజీగా మిథున్ చక్రవర్తి పాత్రలో జీవించాడు. గోపాల శిష్యుడుగా కృష్ణుడు, జడ్జిగా రంగనాథ్, లాయర్‌గా ఆశిష్ విద్యార్థి, ముస్లిం లాయర్‌గా మురళీ శర్మ, టీవీ యాంకర్‌గా మధు శాలిని వారి వారి పాత్రలకు న్యాయం చేశారు. ఆసక్తి కల్గించేందుకు ఎన్‌టిఆర్, ఎస్‌విఆర్ నటించిన సీన్... ఘటోత్కచుడు, బ్రాహ్మణుడు సీన్... పవన్, వెంకీకి జత చేశారు. శ్రియ పాత్ర పరిమితమే. అయితే వెంకీ కొడుకు మాస్టర్ అర్జున్ ఇందులో కొడుకుగా నటించాడు. టెక్నికల్‌గా... జయన్ విన్సెంట్ కెమెరా, అనూప్ బాణీలు బాగున్నాయి. అయితే సంభాషణపరంగా బుర్రా సాయిమాధవ్ పొందికగా రాయడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో కొన్ని హాస్యపు గుళికలు వేశాడు. ఎడిటింగ్ ఫర్వాలేదు. దర్శకుడిగా కిషోర్‌కుమార్ పార్థసాని... కొద్దిగా తెలుగులోకి మార్చి సినిమాను తీశాడు. నిర్మాతగా పవన్ స్నేహితుడు శరద్ మర్రాండ్ సింపుల్‌గా నిర్మించాడు. విజువల్ ఎఫెక్ట్, గ్రాఫిక్స్ చిత్రానికి ఆకర్షణగా నిలిచాయి.

సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యాన్ని విచారించాలి

దేశంలోనే అతిపురాతనమైన కాగితపు తయారీ కర్మాగారాల్లో ఒకటైన సిర్పూర్ పేపర్ మిల్స్ (ఎస్‌పిఎం) ప్రస్తుత యాజమాన్యం తీరు వల్ల కార్మికులు పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉన్న ఈ పరిశ్రమ యాజమాన్యం ప్రణాళికబద్ధంగా రూపొందించిన నష్టాల సాకుతో సరిగ్గా గత నాలుగు నెలల క్రితం యాజమాన్యం ఉత్పత్తి నిలిపి వేసింది. ప్రతిసారి కార్మికుల హక్కులను కాలరాయడం ఈ యాజమాన్యానికి పరిపాటే. ఏడాదికి ఓసారి ఇచ్చే అరకొర బోనస్ సమయంలోనూ పేచీనే. రాష్ట్ర ప్రభుత్వం నుంచి భారీగా ప్రోత్సాహకాలు పొందడానికి తాజా మూసివేతకు దీర్ఘకాల కుట్ర చేసిందనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో ఎస్‌పిఎం యాజమాన్యం పరిశ్రమను నడిపిస్తుందా? లేదా? అన్న గందరగోళం నెలకొంది. స్పష్టమైన కారణాలు లేకుండానే గతేడాది సెప్టెంబర్ చివరలో మిల్లును మూసివేసింది. దీంతో ఇందులో పనిచేసే 1650 మంది శాశ్వత కార్మికులు 500 మంది సిబ్బంది (స్టాఫ్), 2,000 వరకు కాంట్రాక్టు కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రస్తుతం కాగజ్‌నగర్ పట్టణంలో లక్ష మంది జనాభాతో పాటు పరిసర గ్రామాలు ఈ కంపెనీపై పరోక్షంగా ఆధారపడ్డాయి. ఎస్‌పిఎం ప్రత్యక్షంగా రూ.2.5 కోట్ల వరకు వేతనాలు చెల్లిస్తుంది. ప్రస్తుతం ఈ మొత్తం నిలిచిపోవడంతో ఇక్కడి చిరు వ్యాపారులు అమ్మకాలు లేక వారి దగ్గర పనిచేసే ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది.

మూడేళ్లలోనే గోల్‌మాల్ : 2014 మార్చి నాటికి ప్రతి ఏడాది ఎస్‌పిఎం అమ్మకాలు, ఆదాయం భారీగానే పెరుగుతూ వచ్చింది. 2012 నాటికి నిర్వహణ లాభాలు కూడా బాగానే ఉన్నాయి. 2011-12 ఆర్థిక సంవత్సరంలో యాజమాన్యం రూ.49.79 కోట్ల నిర్వహణ లాభాలు చూపించింది. తర్వాత 2012-13లో రూ.28.54 కోట్లు, 2013-14లో రూ.13.92 కోట్ల నిర్వహణ నష్టాలు మూటగట్టు కున్నట్లు వెల్లడించింది. అమ్మకాల్లో మెరుగైన వృద్ధి ఉన్నప్పటికీ 2008 ఏప్రిల్ నుంచి వరుసగా నాలుగేళ్లు నికర లాభాల్లో సుమారు రూ.5కోట్ల చొప్పున తగ్గుదల చూపింది. తర్వాత రెండేళ్లు నష్టాల్లో కూరుకుపోయినట్లు ప్రకటించింది. కార్మికుల శ్రమతో సంబంధం లేని వడ్డీ, తరుగుదల, పన్నులు, అనామత్ ఖాతాలను భారీగా సృష్టించి 2012 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.73.42 కోట్ల నష్టాలను ప్రకటించింది. ఒక్క ఏడాదిలో ఇంత భారీగా నష్టాలు చూపించిందంటే యాజమాన్యం పరిస్థితిని ఎలా తారు మారు చేసిందో అర్థం అవుతుంది. కాగా ఈ కంపెనీ కార్మికుల వ్యయం, వేతనాల కింద నెలకు సగటున రూ.5కోట్ల పైగానే చూపిస్తోంది. మిల్లులో పనిచేసే కార్మికులకు, సిబ్బందికి రూ.2.5 కోట్ల లోపే చెల్లింపులు జరుగుతున్నాయని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. మిగతా సగం చెల్లింపులపై అనుమానాలు లేవనెత్తుతున్నాయి. యాజమాన్యం కంపెనీలోని స్క్రాప్ విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంది. మరోవైపు షేర్ హోల్డర్లకు డివిడెండ్‌ను కూడా ప్రకటించింది లేదు.

రంజన్ కుమార్‌ను విచారించాలి : ఎస్‌పిఎం కు ఇంతకాలం ఛైర్మన్‌గా వ్యవహరించిన రంజన్ కుమార్ పోద్దార్, ఆయన కుటుంబ సభ్యుల వ్యాపారాలను సిబిఐ లేదా సిఐడి చేత విచారిస్తే అసలు కారణాలు బయటపడుతాయి. 2007, 2008లో ఆధునీకరణ, విస్తరణ పేరుతో ఎస్‌పిఎం బ్యాంకుల నుంచి రూ.650 కోట్లకు పైగా రుణాలు తీసుకుంది. ఈ మొత్తాన్ని పెట్టుబడి కింద బ్యాంకులకు చూపించినప్పటికీ, ఇతర ఆదాయాలను పూర్తిగా సొంత వ్యాపారాలకు మళ్లించిందనే ఆరోపణలున్నాయి. రంజన్ కుమార్ పోద్దార్‌కు ఇతర వ్యాపారాలు ఉన్నాయి. ఎస్‌పిఎం బోర్డులోని 10 మంది సభ్యులు ఆయన బంధువులే. ఆరావళి సెక్యూరిటీస్ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్ అనే ఓ ఫైనాన్స్ కంపెనీకి ఈయన ఏకంగా ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. గుర్గాంవ్ కేంద్రంగా పనిచేస్తున్న దీని బోర్డులోనూ ఆయన సంబంధీకులు పది మంది ఉన్నారు. ఈ సంస్థ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతుంది. ఎస్‌పిఎం లాభాలను, ఆదాయాన్ని దొంగచాటున ఈ సంస్థకు తరలించారనే విమర్శలు ఉన్నాయి. ఆ సంస్థ లాభ, నష్టాల సంగతి బయటపెట్టదు. ఈ ఫైనాన్స్ కంపెనీలో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు దేవాశిస్ పోద్దార్, మాళవిక పోద్దార్, నరేష్ బిర్లా తదితరులు పెట్టుబడులు ఉండటంతో పాటు వారు డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఎస్‌పిఎం లోనూ ప్రధాన వాటాలున్నాయి. అదే విధంగా రంజన్‌కు హోటళ్ల వ్యాపారం ఉందని సమాచారం.

చర్చల్లో మరింత జాప్యం : ఎస్‌పిఎం బోర్డు సమావేశంలో రంజన్ కుమార్‌తో పాటు డైరెక్టర్లు నాగరాజన్, దేవాశిస్ పోద్దార్‌లు రాజీనామా చేశారు. చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) విమల్ అరోరా వైదొలిగారు. పూర్తికాలం డైరెక్టర్‌గా ఉన్న వేదకుమార్ సిఇఒగా నియమితు లయ్యారు. రంజన్ రాజీనామా చేయడంతో చర్చల్లో మరింత జాప్యం జరిగే అవకాశాలు లేకపోలేదు. తాజా పరిణామాలు కంపెనీ చేతులు మారి ఉండవచ్చని అంచనా.

ప్రభుత్వ చొరవే కీలకం : ఎస్‌పిఎం యాజమాన్యం తీరు వల్ల ప్రత్యేక రాష్ట్రంలో తొలి సంక్రాంతి పండగ సిర్పూర్ నియోజకవర్గ ప్రజలను నిరాశ, నిస్పృహలకు గురి చేసింది. మిల్లును తెరిపించాలని 40 దినాలుగా కార్మికులు చేస్తున్న దీక్షలపై వెంటనే స్పందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. వేలాదిమంది కార్మికులను రోడ్డున పడేసిన ఈ యాజమాన్యంతో రేపు, మాపు చర్చలు జరుపుతా మంటూ కాలయాపన చేస్తున్న ఎస్‌పిఎం కార్మికుల గుర్తింపు సంఘం హెచ్ఎంఎస్ ఇప్పటికైనా సిర్పూర్ ప్రజల మేలు కోరుకుని మిల్లు పునః ప్రారంభానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. గుర్తింపు కార్మిక సంఘం, అధికార పార్టీ టిఆర్ఎస్ రెండూ ఒక్కటే కాబట్టి సమస్యను పరిష్కరించే బాధ్యత ముఖ్యమంత్రి గారిపై ఉంది. జరగబోయే చర్చల్లో దీర్ఘకాలంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఒకే విధమైన పనికి స్థానికేతరులకు ఇస్తున్న వేతనాలను స్థానిక కార్మికులకూఅమలు చేయాలి. కాంట్రాక్టు కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తింపునిచ్చి వారికి ఉద్యోగ భద్రతను కల్పించడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. యాజమాన్యం మరీ మొండికేస్తే ఈ మిల్లును ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని నిర్వహించాలి.

- చిట్యాల మధుకర్

సింగరేణి


ఐక్య పోరాటాలకు సింగరేణి జెఎసి పిలుపు



శేషగిరి భవన్‌లో ది. 11.2.2015న అన్ని కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. AITUC, INTUC, CITU, IFTU, HMS, BMS, TRSICU, SCKSU, TNTUC, SELCWU సంఘాల నాయకులు పాల్గొన్నారు. సింగరేణిలో 25వేలకు పైగా ఉన్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం, అధికారులు నేరపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని సమావేశం అభిప్రాయపడింది. హైపవర్ కమిటి వేతనాలు, రెగ్యులరైజేషన్ సాధన ఐక్య పోరాటాన్ని విస్తృతంగా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఐక్య పోరాటాలకు సహకరించాలన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు : వాసిరెడ్డి సత్య నారాయణ (AITUC), బి.డాలయ్య (INTUC), బి.మధు (CITU), ఎ.వెంకన్న (IFTU), జె.శ్రీను (TRSKV), కోటి (TNTUC), రామంచి శ్రీను (SCKS), యాకూబ్‌షావలీ (SCLLWU), పరమేష్ (HMS),

ఏఐటియుసి నుంచి ఎస్.కె. సాబీర్‌పాషా, గొత్తాల సత్యనారాయణ, పి.రాంచందర్, టి.రవి; సిఐటియు ఎర్రగాని క్రిష్ణయ్య, ఐఎఫ్‌టియు ఎన్.సంజీవ్, పి.సతీష్, చంద్రశేఖర్, డి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ✤



[illegible]

కోల్ ఇండియాలోని ప్రభుత్వ వాటాలను మరో 10% వరకు ప్రైవేటు వారికి అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకింగా మరియు బొగ్గు పరిశ్రమలోని కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు 4 జాతీయ కార్మిక సంఘాలు (AITUC, INTUC, HMS, BMS) జనవరి 6 నుండి 10 వరకు దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలో 5 రోజులు సమ్మె చేసేందుకు పిలుపునిచ్చి, ఆ మేరకు సమ్మె నోటీసును ఇచ్చాయి.

ఇవే అంశాలపైన నవంబర్ నెలలో దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని 5 యూనియన్లు సంయుక్తంగా నిర్ణయం తీసుకొని, విస్తృతంగా ప్రచారం చేసి, కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేసిన తర్వాత 22 వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన బూటకపు హామీ ఆధారంగా మిగతా 4 యూనియన్లు (సిఐటియు మినహా) 24వ తేదీన జరిగే సమ్మెను విరమించుకున్నాయి. సిఐటియు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. కానీ, భవిష్యత్తులో కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాల్సి ఉన్న అవసరం దృష్ట్యా అప్పుడు తన భిన్నాభిప్రాయాన్ని తెలుపుతూనే సమ్మె విరమణలో పాల్గొన్నది.

కానీ, ఫెడరేషన్ పిలుపు ప్రకారం 24 తేదీన అన్ని ఏరియాలలో మైన్స్, డిపార్టుమెంట్‌ల వద్ద 2 గంటల పాటు నిరసన కార్యక్రమాలు, హెడ్ ఆఫీసు వద్ద 2 గంటల పాటు ధర్నాను నిర్వహించారు. సిఐటియు అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం మరియు ఎంప్లాయీస్ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆ రోజు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించారు.

జనవరి 5, 6 తేదీల్లో సమ్మె

బెల్లంపల్లిలో 95%, భూపాలపల్లి, మణుగూరు మరియు ఇల్లందులలో 75%, రామగుండం-1లో 60%, రామగుండం-2, రామగుండం-3 మరియు కొత్తగూడెం ఏరియాలలో 50% జరిగింది.

సింగరేణిలో గుర్తింపు సంఘం టిబిజికెఎస్ సమ్మెకు వ్యతిరేకంగా పనిచేసి కార్మికులను ఇండ్ల నుండి తీసుకొచ్చి మరీ డ్యూటీలు చేసే ప్రయత్నం చేసింది. అయినా కార్మికులు సమ్మెలో పాల్గొనడం పట్ల సిఐటియు అభినందనలు తెలుపుతున్నది. ✤


సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల
రాష్ట్ర సదస్సు



Date of Publication: 12/02/2015 RNI No. TELTEL/2014/59323 H/SD/491/2015-17



తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో
సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రోడ్డు రవాణ & భద్రత బిల్లు - 2014పై సదస్సు



Printed & Published by P.Rajarao on behalf of CITU Telangana State Committee
and Printed at Prajasakti Daily Printing Press, Hyderabad and Published from H.No. 1-7-139/44,
NVB Smaraka Kendram, S.R.K.Nagar, Zamisthanpur, Musheerabad, Hyderabad -20. Editor : MD.Abbas

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA102M105
పుస్తకం పేరు	మనవర్మర్
తారీఖు	23 February 2025
ముందు అట్ట	బ్లూ
వెనుక అట్ట	బ్లూ
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	no
తయారు చేసినది	Saranya
పేజీలు విడదీసినది	SARANYA
స్కాన్ చేసినది	Afsar
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good